RNI No. APTEL/2006/17880 www.bharathasakthi.com



# భారత శక్తి

తెలుగు దినపత్రిక
VOICE OF INDIAN



Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి: 19 సంచిక:246 హైదరాబాద్, గురువారం, 1 మే 2025 పేజీలు: 12 వెల: 1.00



## ప్రధాని అధ్యక్షతన 'సూపర్ క్యాబినెట్' భేటీ..

## పుల్వామా ఘటన తర్వాత తొలిసారి

పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడి ( తో భారత్-పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలు భగ్గుమన్నాయి. ఈ ఘటనకు భారత్ తగిన సమాధానం ఇచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. ఈనేపథ్యంలో బుధవారం ప్రధాని నరేంద్రమోదీ పలు కీలక సమావేశాలకు అధ్యక్షత వహిస్తున్నారు. దేశ భద్రతపై అత్యున్నత నిర్ణయాలు తీసుకొనే క్యాబినెట్ కమిటీ ఆన్ సెక్యూరిటీ (%జజూ%) ఈ రోజు రెండోసారి సమావేశమైంది. అనంతరం రాజకీయ వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ( భేటీ జరిగింది. ఇక, ఈరోజు సాయంత్రం క్యాబినెట్ సమావేశం కూడా నిర్వహించనున్నారు.

సూపర్ క్యాబినెట్..

సీసీపీఏ అనేది అత్యంత శక్తివంతమైన గ్రూప్. దానిని 'సూపర్ క్యాబినెట్' అని కూడా పిలుస్తారు. 2019లో జరిగిన పుల్వామా ఉగ్రదాడి అనంతర పరిణామాల నేపథ్యంలో నాడు సీసీపీఏ భేటీ అయింది. ఆ తర్వాత ఈ క్యాబినెట్ కమిటీ మళ్లీ సమావేశం కావడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. 2019లో పుల్వామాలో సీఆర్‌పీఎఫ్ వాహనంపై జరిగిన దాడిలో 40 మంది జవాన్లు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. దానిపై దేశంలో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. ఈ దారుణ ఘటనపై ప్రతీకార చర్యలు, పరిస్థితిని సమీక్షించేందుకు ఆనాడు సీసీపీఏ సమావేశమైంది. ఆ సమావేశంలోనే పాకిస్థాన్‌కు ఉన్న 'అత్యంత అనుకూల దేశం' వాణిజ్య హోదాను రద్దు చేయాలని భారత్ నిర్ణయించింది. ఆ ఏడాదిలో కొన్ని రోజుల తర్వాత, ఫిబ్రవరి 26న భారత వైమానిక దళం బాలాకోట్‌లోని ఉగ్రవాద శిబిరాలపై వైమానిక దాడి చేసి, దాయాదికి గట్టి సమాధానం ఇచ్చింది.

అత్యంత కీలక సందర్భాల్లో మాత్రమే సీసీపీఏ సమావేశం అవుతుంది. దేశంలోని ముఖ్యమైన రాజకీయ, ఆర్థిక విషయాలను సమీక్షించి నిర్ణయాలు తీసుకుంటుంది. రాజకీయ చిక్కులు కలిగి ఉన్న ఆర్థిక విధానాలు, అంతర్గత భద్రతా సమస్యలపై చర్చలు, నిర్ణయాలు ఉంటాయి. వివిధ మంత్రిత్వ శాఖల మధ్య సమన్వయానికి సహాయపడుతుంది. దేశ రాజకీయాలపై ప్రభావం చూపే అవకాశం ఉన్న అంశాలను ఈ భేటీలో చర్చిస్తారు. ప్రధాని మోదీ అధ్యక్షతన జరుగుతున్న ఈ సమావేశంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, హోంమంత్రి అమిత్‌షా, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తదితరులు పాల్గొన్నట్లు తెలుస్తోంది.




## హైదరాబాద్‌లో పలు పోలీస్ స్టేషన్ల పేరు మార్పు.. 146 మంది సీఐల బదిలీ

హైదరాబాద్: నగరంలోని ప్రఖ్యాత ప్రాంతాలను దృష్టిలో ఉంచుకొని కొన్ని పోలీస్‌స్టేషన్లు, డివిజన్ల పేర్లను మార్చుతున్నట్లు హైదరాబాద్ కమిషనర్ సీవీ ఆనంద్ తెలిపారు. 72వ లా అండ్ ఆర్డర్ పీఎస్‌గా టోలిచౌకి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సెక్రటేరియట్ పీఎస్‌ను లేక్ పోలీస్‌స్టేషన్‌గా, హుమాయున్‌నగర్ పీఎస్‌ను మెహదీపట్నం పీఎస్‌గా, షాహినాయత్‌గంజ్ పీఎస్‌ను గోషామహల్ పీఎస్‌గా మార్చినట్లు వెల్లడించారు.

"35 ఏళ్ల తర్వాత హైదరాబాద్ కమిషనరేట్‌లో ఠాణాల పునర్వ్యవస్థీకరణ జరిగింది. నగరంలో 71 లా అండ్ ఆర్డర్, 31 ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లు ఉన్నాయి. రెండేళ్లుగా పోలీస్‌స్టేషన్ల హద్దుల్లో సమస్యలు ఎదురవుతున్నాయి. ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ ఠాణాపై గందరగోళం నెలకొంది. ప్రభుత్వానికి నివేదిక పంపితే మార్పులకు ఆమోదం తెలిపింది. పోలీస్‌స్టేషన్ల వివరాలను హైదరాబాద్ సిటీ పోలీస్ వెబ్‌సైట్‌లో పొందుపరుస్తాం" అని సీపీ సీవీ ఆనంద్ తెలిపారు.

146మంది సీఐల బదిలీలు

మరోవైపు, హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో భారీ ప్రక్షాళన చేపట్టారు. పెద్ద ఎత్తున సీఐలను బదిలీ చేశారు. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో146 మంది సీఐలను బదిలీ చేస్తూ సీపీ ఉత్తర్వులు ఇచ్చారు.

## తెలంగాణ ఇచ్చినందుకు కాంగ్రెస్ విలన్ అయ్యిందా?:

## కేసీఆర్‌పై సీఎం రేవంత్ ఫైర్



హైదరాబాద్: ఇటీవల ఎల్కతుర్తిలో జరిగిన భారాస రజతోత్సవ సభకు తాము సంపూర్ణంగా సహకరించినట్లు సీఎం రేవంత్ రెడ్డి( తెలిపారు. రవీంద్రభారతిలో నిర్వహించిన బసవేశ్వర 892 జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. పదో తరగతి పరీక్ష ఫలితాలను విడుదల చేసిన అనంతరం రేవంత్ రెడ్డి ప్రసంగించారు. భారాస రజతోత్సవ వేడుకల్లో మాజీ సీఎం కేసీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై చేసిన విమర్శలకు కౌంటర్ ఇచ్చారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ కోతుల గుంపునకు అప్పగించినట్లయిందంటూ సీఎం ధ్వజమెత్తారు. ప్రతిపక్ష నేత కుటుంబం తెలంగాణ మీద పడి దోచుకుందన్నారు. 'తెలంగాణ ఆగమైంది.. కాంగ్రెస్ విలన్' అంటూ కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై సీఎం తీవ్రంగా మండిపడ్డారు. మరో పదేళ్లు దోచుకోవడం ఆగిందని తెలంగాణ ఆగమైందా? తెలంగాణ ఇచ్చినందుకు కాంగ్రెస్ విలన్ అయ్యిందా? అని ప్రశ్నించారు. కాళేశ్వరం, రైతు రుణమాఫీ, ఎస్సీ వర్గీకరణ, కులగణన, రైతుబంధుపై చర్చిద్దామా? అంటూ ఈ సందర్భంగా సవాల్ విసిరారు. ప్రతిపక్ష హోదా ఇచ్చిన ప్రజల వద్దకు కేసీఆర్ ఎందుకు వెళ్లట్లేదని ప్రశ్నించారు.

ప్రభుత్వ నిర్ణయాల్లో ఎక్కడా మంచి కనబడట్లేదా?

"బీఆర్‌ఎస్ సభ ఏర్పాటు చేసుకుంటే బస్సులు ఇవ్వాలని చెప్పాం. సభకు అవసరమైన వసతులు బాటుకల్పించాలని అధికారులను ఆదేశించాం. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వంతో పాటు ప్రతిపక్షం బలంగా ఉండాలి. బీఆర్‌ఎస్ సభకు మేం సంపూర్ణంగా సహకరించింది నిజం కాదా? ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయంలో ఎక్కడా మంచి కనబడటం లేదా? ప్రభుత్వాన్ని భుజం తడుతూ వైఫల్యాలను ప్రశ్నించాలి. మా వైఫల్యాలపై ఎండగట్టాలి.. కానీ, ప్రతిపక్ష నేత ఇంట్లో నుంచి బయటకు వెళ్లకుండా ప్రభుత్వ వసతులు అనుభవిస్తున్నారు. 16 నెలలుగా జీత భత్యాలు తీసుకొని ఫాంహౌస్‌లోనే ఎందుకు ఉంటున్నారు?

ఇవేవీ కనబడటం లేదా?

అసెంబ్లీకి రాను.. మా పిల్లల్ని పంపామని చెబుతున్నారు. పిల్లలను సభకు పంపితే మీరెందుకు ప్రతిపక్ష నేతగా ఉన్నారు? సభకు రాని ప్రతిపక్ష నేతకు మమ్మల్ని ప్రశ్నించే నైతిక హక్కు ఉందా? ప్రతిపక్ష హోదా ఇచ్చిన ప్రజల వద్దకు ఎందుకు వెళ్లడంలేదు. అధికారం ఉంటే చెలాయిస్తాం. లేకపోతే ఫాం హౌస్‌లో ఉంటామంటున్నారు. గత ప్రభుత్వ పథకాలు నిలిపివేసినట్లు చెబుతున్నారు. మీరు హయాంలోని పథకాలు ఏం ఆగిపోయాయి? రైతుబంధు ఆగిందా?, షాదీముబారక్, కల్యాణలక్ష్మి, ఫీజురియంబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ, ఉచిత విద్యుత్ ఆగాయా? రాష్ట్రంలో ప్రజా పాలన ఎక్కడైనా ఆగిందా? మేం సన్నబియ్యం ఇస్తున్నాం. పేదల ఇళ్లకు 250 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్, 60వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చాం. రెండున్నర లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చాం. ప్రైవేటులో లక్ష ఉద్యోగాలు కల్పించాం. హైదరాబాద్‌ను విస్తరించేందుకు అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నాం. ఆడబిడ్డలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాం. ఇవేమీ మీకు కనడటంలేదా?. కడుపు నిండా విషం నింపుకొని విద్వేషపూరిత ప్రసంగంతో ప్రజల మధ్య చిచ్చుపెట్టాలనే ప్రయత్నం మంచిదికాదు" అన్నారు.

## అంబేడ్కర్- అఖిలేశ్ యాదవ్ ఫొటో.. భాజపా విమర్శలు

ఇంటర్నెట్ డెస్క్: సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ పై భాజపాపై విమర్శలు గుప్పిస్తోంది. రాజ్యాంగ రూపకర్త డా.బీఆర్ అంబేడ్కర్ ఫొటోతో కలుపుతూ..అఖిలేశ్ యాదవ్ ఫొటో ఉన్న చిత్రం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో భాజపా ఆయనపై విరుచుకుపడింది. భారత రాజ్యాంగ నిర్మాత చిత్రాన్ని సగానికి చేయడం ఆయనను అవమానించడమే అవుతుందని భాజపా నేత అమిత్ మాలవీయ మండిపడ్డారు. అఖిలేశ్ యాదవ్ ఎన్ని జన్మలెత్తినా సమాజంలోని అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన అంబేడ్కర్‌కు సరితూగలేరని దుయ్యబట్టారు.

ఎస్పీ నేతలు చేసే ఇటువంటి చర్యలు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. దీనిపై ఉత్తరప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి బ్రజేష్ పాఠక్ స్పందిస్తూ..అఖిలేశ్ చర్యలను తీవ్రంగా ఖండించారు. ఎస్పీ నేతలు అంబేడ్కర్‌ను, దళితులను అవమానించడానికి ఉద్దేశపూర్వకంగానే ఇలా చేశారని విమర్శించారు. అఖిలేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో సంక్షేమ పథకాలను రద్దు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. బహుజన్ సమాజ్ పార్టీ అధినేత్రి మాయావతి సైతం అఖిలేశ్ చర్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

## కులగణనకు తెలంగాణ ఓ మోడల్‌గా నిలుస్తుంది: రాహుల్ గాంధీ

%దిల్లీ: కేంద్ర ప్రభుత్వం చేపట్టే కులగణనకు కాంగ్రెస్ పార్టీ సహకరిస్తుందని ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ(%ఝప్తుబశ్రీ +ఝఅసష్త్రఱ%) తెలిపారు. అయితే, కులగణనకు నిర్ణీత సమయం తెలపాలని కోరుతున్నామన్నారు. తెలంగాణలో చేపట్టిన కులగణన ప్రక్రియ ఇందుకు బ్లూప్రింట్‌గా నిలుస్తుందని అన్నారు. కులగణన సమనత్వం తీసుకొస్తుందని తెలిపారు. ఇది తొలి మెట్టేనని పేర్కొన్న రాహుల్.. కులగణనకు అందరి భాగస్వామ్యం కూడా అవసరమన్నారు. కులగణనకు తెలంగాణ ఓ మోడల్‌గా నిలుస్తుందని చెప్పారు.



## తెలంగాణ టెన్త్ ఫలితాల్లో 92.78 శాతం ఉత్తీర్ణత

### ఒక్క విద్యార్థీ పాస్‌కాని స్కూళ్లు రెండు..

### జూన్ 3 నుంచి 'పది' సప్లిమెంటరీ పరీక్షలు

హైదరాబాద్: తెలంగాణ టెన్త్ ఫలితాలను ( సీఎం రేవంత్‌రెడ్డి (విడుదల చేశారు. రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పలువురు మంత్రులతో కలిసి సీఎం విడుదల చేశారు. ఫలితాల్లో 92.78 శాతం ఉత్తీర్ణత



నమోదైంది. గతేడాది కంటే ఈసారి 1.47 శాతం అధికంగా ఉత్తీర్ణత నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఈ ఫలితాల్లోనూ బాలికలే పైచేయి సాధించారు. 94.26 శాతం మంది బాలికలు ఉత్తీర్ణత కాగా.. 91.32 శాతం మంది బాలురు పాసయ్యారు. అత్యధికంగా గురుకుల పాఠశాలల్లో 98.7 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా.. ప్రైవేటు పాఠశాలల్లో 94.21 శాతం విద్యార్థులు పాసయ్యారు. ఈసారి సబ్జెక్టుల వారీగా మార్కులు, గ్రేడ్లను ఎస్ఎస్‌సీ బోర్డు ఇచ్చింది.

జూన్ 3 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు

పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 3 నుంచి 13వ తేదీ వరకు జరగనున్నాయి. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు జరుగుతాయని ఎస్ఎస్‌సీ బోర్డు ప్రకటించింది. ఫీజు చెల్లింపునకు తుది గడువు మే 16గా నిర్ణయించారు. రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు మే 15వరకు అవకాశం కల్పించారు. ఇందుకోసం సబ్జెక్టుకు రూ.500 చొప్పున చెల్లించి రీకౌంటింగ్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. సబ్జెక్టుకు రూ.వెయ్యి చొప్పున చెల్లించి రీవెరిఫికేషన్‌కు దరఖాస్తుకు అవకాశం కల్పించారు.

ఒక్క విద్యార్థీ పాస్ కాని పాఠశాలలు రెండు

ఈ ఏడాది రెండు ప్రైవేటు పాఠశాలల్లో ఒక్క విద్యార్థి కూడా పాస్ కాలేదు. ఈ ఫలితాల్లో మహబూబాబాద్ జిల్లాలో అత్యధికంగా 99.29శాతం ఉత్తీర్ణత నమోదు కాగా.. వికారాబాద్‌లో అతి తక్కువగా 73.97శాతం ఉత్తీర్ణత నమోదైంది.

## మరిన్ని ఉగ్రదాడులు..

## అప్రమత్తమైన ఇంటెలిజెన్స్

శ్రీనగర్, ఏప్రిల్ 30,

జమ్మూ కాశ్మీర్లో మరిన్ని ఉగ్రదాడులకు అవకాశం ఉందని ఇంటెలిజెన్స్ వర్గాలు కేంద్రాన్ని హెచ్చరించాయి. దాంతో అప్రమత్తమైన ప్రభుత్వం జమ్మూ కాశ్మీర్లోని సగానికి పైగా పర్యాటక స్థలాలను మూసివేసింది. మరికొన్ని పర్యాటక స్థలాల వద్ద భద్రత పెంచింది. కాశ్మీర్ వ్యాప్తంగా 87 టూరిస్టు కేంద్రాలు ఉండగా 48 నుంచి 50 వరకు పర్యాటక స్థలాలను మూసివేసినట్లు ప్రభుత్వం ప్రకటించింది. సోన్ మార్గ్, దాల్ లేక్, గుల్మార్గ్, బైసారన్ లోయ సహా సున్నితమైన పర్యాటక కేంద్రాలలో ప్రత్యేక భద్రత దళాలు ఏర్పాటు చేశారు.పర్యాటకులు ప్రవేశించడానికి అనుమతించని టూరిస్ట్ ప్రదేశాలలో గురేజ్ లోయ, దూద్‌పత్రి ఉన్నాయి. గత వారం 'మినీ స్విట్జర్లాండ్'గా పిలుచుకునే బైసరన్‌లో ఉగ్రవాదులు పర్యాటకులపై దాడి చేయగా 26 మంది ప్రాణాలు కోల్పోయారు. 2019 పుల్వామా దాడి తర్వాత కాశ్మీర్ లోయలో అతిపెద్ద దాడి ఇది. పర్యాటకులకు ముప్పు ఉందని, మరో ఉగ్రదాడి జరిగే అవకాశం ఉందని భావించి కాశ్మీర్‌లోని 87 పబ్లిక్ పార్కులు, ప్రదేశాలలో 48 చోట్ల గేట్లు మూసివేశారు. భద్రతా సమీక్ష కొనసాగుతోందని, రాబోయే రోజుల్లో జాబితాలో మరిన్ని ప్రదేశాలను మూసివేసే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారని తెలిపింది.మూసివేసిన పర్యాటక ప్రదేశాలు కాశ్మీర్‌లోని సుదూర ప్రాంతాలలో ఉన్నాయని, గత పదేళ్లలలో తెరుచుకున్న కొత్త టూరిస్ట్ స్పాట్స్ కూడా మూసివేసినట్లు అధికారులు తెలిపారు. పర్యాటకులు సందర్శించలేని ప్రదేశాలలో కోకెర్నాగ్, దుక్సుమ్, మార్గన్ టాప్, సింథాన్ టాప్, అచ్చబల్, బాంగస్ లోయ, తోసామైదాన్ ఉన్నాయి.ఏప్రిల్ 22న జరిగిన పహల్గాం ఉగ్రదాడి కేసును జాతీయ దర్యాప్తు సంస్థ దర్యాప్తు చేస్తోంది. ఉగ్రదాడికి సంబంధించి రోజుకో వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఆ వీడియోల ఆధారంగా, ఆ వీడియో తీసిన వ్యక్తుల సమాచారాన్ని సేకరిస్తున్నారు. అసలు ఆ సమమయంలో ఏం జరిగింది, ప్రత్యక్ష సాక్షులను విచారించడానికి అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. ఉగ్రదాడి జరిగిన బైసరస్ లోయ ప్రదేశంలో ఐఎన్ఐఏ అధికారులు సీన్ రీక్రియేట్ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఆ సమయంలో బైసరన్ లోయను సందర్శించిన వారిని ప్రశ్నించి ఉగ్రదాడికి సంబంధించి పూర్తి వివరాలు సేకరించే పనిలో అధికారులు ఉన్నారు.

## అందుతున్న మేకిన్ ఇండియా ఫలాలు

మన పరిశ్రమలు కొత్త భారత్‌ను ప్రపంచానికి పరిచయం చేస్తున్నాయి. భారత పారిశ్రామిక రథానికి చోదక శక్తిగా పనిచేస్తున్నాయి. మేక్ ఇన్ ఇండియాకు అసలైన మోడల్ గా నిలుస్తున్నాయి. భారత్ మారుతోంది. ఒప్పుడు ఎన్నో దిగుమతులు.. ఇప్పుడు అన్నీ ఉత్పత్తులే. మేకిన్ ఇండియా నినాదం క్రమంగా ప్రతిఫలాలను ఇస్తోంది. ప్రధాని మోదీ కలలు సాకారమవుతుండడంతో పాటు.. దేశం అన్ని రంగాల్లో పురోగమిస్తోంది. 2014లో ప్రతిష్టాత్మకంగా మేకిన్ ఇండియాను లాంచ్ చేశారు మోదీ. భారత్‌ను ప్రపంచంలో టాప్ ఉత్పత్తి దేశంగా మార్చేందుకు కలలు కన్నారు. దీనికోసం పక్కా ప్రణాళికలతో ముందుకు సాగారు. పదేళ్ల తర్వాత ఇప్పుడు దాని ప్రతిఫలాలను దేశం చూస్తోంది. 2014లో దేశంలో 80శాతం మొబైల్ ఫోన్లను దిగుమతి చేసుకునే పరిస్థితుల్లో ఉంటే.. ఇప్పుడు 99.9శాతం మొబైల్స్ ఇక్కడే ఉత్పత్తి అవుతున్నాయి. అంతేకాదు.. యూకే, నెదర్లాండ్స్, ఆస్ట్రియా, ఇటలీ, సౌతాఫ్రికా వంటి దేశాలకు ఎగుమతులు కూడా సాగుతున్నాయి. డిఫెన్స్ ప్రొడక్షన్‌తోపాటు.. అంతరిక్షం, ఎలక్ట్రిక్ వాహనాలు, సెమీకండక్టర్ల తయారీ, నిర్మాణ రంగం, రైల్వే ఇన్‌ఫ్రాలోనూ అద్భుత ఫలితాలను సాధిస్తోంది.స్వదేశీ కంపెనీలైన పతంజలి, టాటా, అమూల్ వంటివి ఇండియన్ గ్రోత్ స్టోరీని మారుస్తున్నాయి.స్వదేశీ ఉద్యమం స్వాతంత్ర పోరాటంలో కీలకమైన ఘట్టం. ఇప్పుడు మరోసారి అదే స్వదేశీ ఉద్యమం.. భారత్ స్వయ సంవృద్ధి పయనాన్ని నిర్దేశిస్తోంది. ఇది ఆర్థిక స్వావలంబనను మాత్రమే కాదు.. జాతీయ గౌరవాన్ని, సాంస్కృతిక గుర్తింపును ఇనుమడింపజేస్తోంది. స్వదేశీ ఉత్పత్తులను కొనుగోలు చేయాలనే భావన, తద్వారా జాతీయ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేయాలన్న ఆకాంక్ష ఈ మధ్య కాలంలో పెరుగుతోంది. ఆర్థిక వ్యవస్థ బలోపేతం ద్వారా అంతర్జాతీయ స్థాయిలో భారత్‌ను శక్తివంతమైన ఆర్థిక వ్యవస్థగా నిలిపే కార్యక్రమంలో అనేక స్థానిక పరిశ్రమలు నిరంతరం పనిచేస్తున్నాయి.భారత్ పరిశ్రమకు నిదర్శనంగా నిలిచే పతంజలి.. ఈ విషయంలో ఎంతో ముందడుగు వేసింది. బ్రాండ్ భారత్ ను ప్రమోట్ చేయడంలో ఎంతో ముందుంది. భారత్ ఆత్మ అయిన ఆయుర్వేదాన్ని ప్రపంచ దేశాలకు పెద్ద ఎత్తున తీసుకెళ్తోంది. స్వదేశీ పారిశ్రామికోద్యమంలో ప్రధానమైన 'మేడ్ ఇన్ ఇండియా ను పతంజలి తమ కోర్ బిజినెస్ ప్రిన్సిపల్‌గా పాటిస్తోంది. ప్రపంచానికి ఆయుర్వేదాన్ని అందించిన భారత్ నుంచి ఆ బ్రాండ్ తెలిసేలా పతంజలి.. ఆయుర్వేద, సహజ ఉత్పత్తులైన సబ్బులు, నూనెలు, ఔషధాలు, ఇతర ఆహార పదార్థాలను ఇంటింటికీ చేరుస్తోంది. గడచిన 15 ఏళ్లలో పతంజలిని ప్రతి ఇంటిలో ఉపయోగించే పేరుగా మలిచి అసలైన అర్థం చెప్పింది.అంతేకాదు.. వందేళ్లకు పైగా భారత్ ఇండస్ట్రీకి చిరునామాగా నిలిచిన టాటా గ్రూప్, రిలయన్స్ జియో, అమూల్ డైయిరీ వంటివి కూడా భారత్‌లోనే కాదు.. ప్రపంచవ్యాప్తంగా పేరున్న ప్రొడక్టులు. బ్రాండ్ స్వదేశీ అన్నదాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ కూడా ఎక్కువగా ప్రోత్సహిస్తున్నారు. ఎక్కువగా స్వదేశీ ఉత్పత్తులు వాడమని ఆయన తరుచుగా చెబుతూనే ఉన్నారు. 2020 లోని ఓ ప్రసంగంలో స్వదేశీని ప్రచారం చేయడం అనేది మన మంత్రం కావాలి. మన ఉత్పత్తులను ఉపయోగించాలి. అదే ఆత్మనిర్భర భారత్‌కు అసలైన పునాది " అని ఆయన స్పష్టంగా చెప్పారు. రసాయన రహిత వ్యవసాయాన్ని చేపట్టాలని ఆయన తరచుగా చెబుతున్నారు. ఇది స్వావలంబనలో ఓ భాగమన్నారు. ఈ నినాదం కేవలం ఆర్థిక బలోపేతానికి ఇచ్చింది మాత్రమే కాదు. సమాజిక, పర్యావరణ అంశాలను కూడా దృష్టిలో ఉంచుకుని ప్రధాని ఆ పిలుపునిచ్చారు.ఇటీవల అంతర్జాతీయంగా జరుగుతున్న పరిణామాలను దృష్టిలో ఉంచుకుంటే స్వదేశీ ఆవశ్యకత మనకు అర్థం అవుతుంది. ఇది దిగుమతులపై పడుతున్న భారాన్ని తగ్గించడమే కాదు. మన స్థానిక రైతులు, కుటీర పరిశ్రమలు, కళాకారులకు చాలా ప్రోత్సాహాన్నిస్తుంది. స్వదేశీ ఉత్పత్తులను ఉపయోగించాలని ఇప్పటికే మొదలైన ఆలోచన మరింత బలోపేతం కావాలిసిన అవసరం ఉంది . స్వదేశీ ఉద్యమం కొనుగోలుకు సంబంధించిన నిర్ణయం మాత్రమే కాదు.. జాతి నిర్మాణానికి సంబంధించిన ఓ ముందడుగు. మేక్ ఇన్ ఇండియాతో, డిజిటలైజేషన్, సాంకేతిక పురోగతి అనేక రంగాలలో కూడా కనిపించింది. ఎలక్ట్రానిక్స్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్‌లో స్వావలంబన పెరిగింది. మొబైల్ తయారీలో భారతదేశం అగ్ర దేశంగా మారింది. ఆపిల్, శాంసంగ్ సహా అనేక ఇతర ప్రపంచ కంపెనీలు భారతదేశంలో మొబైల్ తయారీ యూనిట్లను ఏర్పాటు చేశాయి. 2014లో, భారతదేశంలో కేవలం 2 యూనిట్లు మాత్రమే ఉత్పత్తి చేసేవి. ఇది 2020 నాటికి 200 కంటే ఎక్కువ యూనిట్లకు పెరిగింది.మేక్ ఇన్ ఇండియా రక్షణ రంగంలో స్వావలంబనను ప్రోత్సహించింది. భారతీయ కంపెనీలు ఇప్పుడు సైనిక పరికరాలు, ఆయుధాల ఉత్పత్తికి పెద్ద ఎత్తున సహకరిస్తున్నాయి. రక్షణ రంగంలో ఎఫ్‌డీఐ పరిమితిని ప్రభుత్వం 74 శాతానికి పెంచింది. తేలికపాటి యుద్ధ విమానం 'తేజస్' సహా అనేక స్వదేశీ రక్షణ పరికరాల ఉత్పత్తి ఈ చొరవలో ముఖ్యమైన భాగం.మేక్ ఇన్ ఇండియా ఇతర ప్రధాన విజయాలు 2023-24లో రూ. 1.55 లక్షల కోట్ల విలువైన ఖాదీ విక్రయాలు పీఎల్ఐ పథకం కింద రూ.1.28 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఇది 8.5 లక్షలకు పైగా ఉద్యోగాలను సృష్టించింది. 4 లక్షల కోట్లకు పైగా ఎగుమతులు పెరిగాయి. 2020లో టాయ్‌ల కోసం జాతీయ కార్యాచరణ ప్రణాళికను అమలు చేసినప్పటి నుంచి ఎగుమతులు 239 శాతం పెరిగాయి.

# కలకలం రేపుతున్న సర్వే

విజయవాడ, ఏప్రిల్ 30,

ఏపీలో కూటమి అధికారంలోకి వచ్చి దాదాపు 11 నెలలు అవుతోంది. ప్రభుత్వం పాలనతో పాటు సంక్షేమ పథకాలపై ఫుల్ ఫోకస్ పెట్టింది. అయితే క్షేత్రస్థాయిలో కొంతమంది ఎమ్మెల్యేల పనితీరుపై తీవ్ర విమర్శలు ఉన్నాయి. దీనిపై ఇప్పటికే సీఎం చంద్రబాబు పలుమార్లు నేరుగా ఎమ్మెల్యేలకు హెచ్చరించారు. పనితీరు మార్చుకోవాలని సూచించారు. అయినా కొంతమంది ఎమ్మెల్యేల పనితీరులో మార్పు రావడం లేదు. తాజాగా విలువడిన ఓ సర్వే ఈ విషయాన్ని చెబుతోంది. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఈసారి కూటమి కచ్చితంగా ఘనవిజయం సాధిస్తుందని చెప్పిన సర్వే నిపుణుల్లో ప్రవీణ్ పుల్లట ఒకరు. ఆయన చెప్పిన అంచనాలు ఎన్నికల్లో దాదాపు నిజమయ్యాయి. దీంతో కూటమి ఘనవిజయం సాధించింది. అయితే ఇప్పుడు అదే ప్రవీణ్ పుల్లట కూటమి ప్రభుత్వంలో ఎమ్మెల్యేల పనితీరుపై సంచలన ట్వీట్ చేశారుకూటమి అధికారంలోకి వచ్చిన తరువాత చాలామంది పనితీరు ఆశాజనకంగా లేదని ఇప్పటికే పలుమార్లు ట్వీట్ల రూపంలో తన సర్వే అంశాలను వెల్లడించారు ప్రవీణ్ పుల్లట. అయితే తాజా గణాంకాల ప్రకారం ఈసారి 41 మంది కూటమి ఎమ్మెల్యేలకు మళ్లీ టిక్కెట్ రాదని.. వచ్చినా ఓడిపోతారని సోషల్ మీడియాలో సంచలన ట్వీట్ చేశారు. దీంతో ఇది రాజకీయ వర్గాల్లో చర్చకు దారి తీస్తోంది. కూటమి ప్రభుత్వం ఏడాది పూర్తి చేసుకోనున్న తరుణంలో మరిన్ని సంచలన విషయాలు బయటపెడతానంటూ ప్రవీణ్ పుల్లట మరో ట్వీట్ చేశారు. 92 శాతం వన్ టైం ఎమ్మెల్యేలు మొదటిసారి.. చివరిసారి అంటూ మరో కామెంట్ కూడా పెట్టారు. అయితే ఇది ఎవరి గురించి అన్న విషయం మాత్రం చెప్పలేదు. అయితే ప్రవీణ్ పుల్లట త్వరలో మరిన్ని అంశాలు బయట పెడతారా? లేకుంటే హింట్స్ తో సరి పెడతారా? అన్న దానిపై ఉత్కంఠ కొనసాగుతోంది.ఏపీలో కూటమిఅంతులేని మెజారిటీతో గెలిచింది. 164 అసెంబ్లీ సీట్లతో ఏకపక్ష విజయం సాధించింది. అయితే ప్రభుత్వం ప్రజల అంచనాలకు చేరుకోలేకపోతోందన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి. ఇంకా సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోకపోవడం, అటు పాలన సైతం సజావుగా సాగకపోవడం వంటి కారణాలతో ప్రభుత్వం పై అసంతృప్తి ఉంది. కానీ ఏడాది పాలన కూడా పూర్తి కాకపోవడంతో అది వ్యతిరేకత కు టర్న్ కాలేదు. అయితే ఎన్నికలకు ముందు కూటమికి అనుకూలంగా ఉండే ప్రవీణ్ పుల్లట సర్వే.. ఇప్పుడు వ్యతిరేకంగా మారడం మాత్రం మూడు పార్టీల్లో ఒక రకమైన ఆందోళన కనిపిస్తోంది. ముఖ్యంగా ఎమ్మెల్యేల పనితీరు బాగా లేదన్న విమర్శలు వస్తున్న తరుణంలో సీఎం చంద్రబాబు కఠిన చర్యలకు ఉపక్రమించాలన్న డిమాండ్ వినిపిస్తోంది2024 ఎన్నికల్లో చాలామంది కొత్తవారికి అవకాశం ఇచ్చారు. దాదాపు 80 నుంచి 100 మంది కొత్తగా ఎన్నికైన వారే. ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత ఎన్డీఏ శాసనసభ పక్ష సమావేశం నిర్వహించారు చంద్రబాబు. ప్రజలు బాధ్యతతో ఈ విజయాన్ని కట్టబెట్టారని.. దీనిని నిలుపుకోవాల్సిన అవసరం ఉందని కూడా చెప్పుకొచ్చారు. ప్రజల నుంచి వ్యతిరేకత రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్క ఎమ్మెల్యే పై ఉందని తేల్చి చెప్పారు. అటు తర్వాత కూడా వర్క్ షాపులు నిర్వహించి మరి చాలా అంశాలపై గట్టిగానే హెచ్చరికలు పంపారు. అయినా సరే కొంతమంది ఎమ్మెల్యేల వ్యవహార శైలిలో మార్పు రావడం లేదు. మరి ఈ సర్వే తోనైనా జాగ్రత్త పడతారా? లేదా? అన్నది తెలియాలి.

## సింహాచలం దుర్ఘటన దురదృష్టకరం

అమరావతి

సింహాచలంలో గోడ కూలడం మూలంగా క్యూ లైన్ లో ఉన్న ఎనిమిది మంది భక్తులు మృతి చెందారని తెలిసి తీవ్రగ్భ్రాంతికి లోనయ్యానని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. చందనోత్సవ సమయాన ఈ దుర్ఘటన చోటు చేసుకోవడం దురదృష్టకరం. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియచేస్తున్నాను. వారికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుంది. విశాఖపట్నం జిల్లా అధికారుల నుంచి ఈ ఘటన వివరాలు తెలుసుకున్నాను. భారీ వర్షాల మూలంగా గోడ కూలిందని తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించానని వెల్లడించారు.

## ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ లతో సహాయక చర్యలు

విశాఖపట్నం

హోంమంత్రి అనిత సింహాచలంలో గోడకూలిన ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. గోడకూలిన ప్రాంతంలో సహాయక చర్యలను పర్యవేక్షించారు. సింహగిరి బస్టాండ్ నుంచి ఎగువకు వెళ్లే మార్గంలో షాపింగ్ కాంప్లెక్స్ వద్ద రూ.300 టికెట్ క్యూలైన్ పై సిమెంట్ గోడ కూలింది. ఎన్టీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ నేతృత్వంలో క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. సింహాచలం రూ.300 క్యూలైన్లో జరిగిన గోడ కూలిన దుర్ఘటన వద్ద ఎన్.డి.ఆర్.ఎఫ్., ఎస్.డి.ఆర్.ఎఫ్., ఫైర్, పోలీస్ శాఖ సిబ్బంది సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు. ఘటనా స్థలంలో సహాయక చర్యలను హోంమంత్రి అనిత,జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్ దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు.

## సింహాచలం చందనోత్సవంలో భక్తుల మృతిపై మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్‌గ్భ్రాంతి

తాడేపల్లి

విశాఖ జిల్లా సింహాద్రి అప్పన్న స్వామి చందనోత్సవంలో గోడ కుప్పకూలి భక్తులు మృతి చెందడంపై మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్‌గ్భ్రాంతి వ్యక్తం చేశారు. చందనోత్సవం సందర్భంగా రూ. 300 టికెట్ క్యూలైన్ పై గోడ కుప్పకూలి భక్తులు మృత్యువాత పడటంపై తీవ్రవిచారం వ్యక్తం చేశారు. స్వామివారి నిజరూప దర్శనానికి వచ్చిన భక్తులు ఇటువంటి దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమన్నారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ వారికి మెరుగైన వైద్యం అందించాలని, మరణించిన భక్తుల కుటుంబాలను ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

# సామాజిక పెన్షన్లలో భారీగా అక్రమాలు

వియవాడ, ఏప్రిల్ 30,

ఏపీ ప్రభుత్వం అమలు చేస్తోన్న సామాజిక పెన్షన్లలో భారీగా అక్రమాలు వెలుగు చూస్తున్నాయి. వేల సంఖ్యలో అనర్హులను గుర్తిస్తున్నారు. వికలాంగుల పెన్షన్లలో ఇప్పటి వరకు 65వేల మంది అనర్హులను గుర్తించారు. పెన్షన్ల తనిఖీ పూర్తయ్యేనాటికి ఈ సంఖ్య మరింత పెరుగనుంది.ఏపీలో సామాజిక పెన్షన్ల తనిఖీలో తవ్వే కొద్ది అక్రమాలు వెలుగు చూస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున అనర్హులకు పెన్షన్లు చెల్లిస్తున్నారని ప్రజా ప్రతినిధులు ఫిర్యాదు చేయడంతో ఏపీ ప్రభుత్వం వికలాంగుల పెన్షన్ల తనిఖీ చేపట్టింది. వికలాంగులకు రూ.6 వేల నుంచి రూ.15వేల వరకు పెన్షన్లు చెల్లిస్తుండటంతో పెద్ద ఎత్తున అనర్హులు వాటిని దక్కించుకుంటున్నారు.ఏపీప్రభుత్వం అందిస్తోన్న సామాజిక పెన్షన్లను తప్పుడు ధృవీకరణ పత్రాలతో పొందుతున్నవారి డొంక కదులుతోంది. గత మూడు నెలలుగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం సామాజిక పెన్షన్లను వైద్య బృందాలతో తనిఖీ చేయిస్తోంది. ఈ క్రమంలో బోగస్ సర్టిఫికెట్లతో పెన్షన్లు పొందుతున్న వారిని పెద్ద సంఖ్యలో గుర్తించారు.ఏపీలో నెలకు రూ.6 వేలు నుంచి రూ.15వేల వరకు సామాజిక పెన్షన్లను చెల్లిస్తున్నారు. ఈ క్రమంలో తొలిదశలో రూ.15వేల పెన్షన్లు పొందుతున్న వారిలో అనర్హులను గుర్తించి వాటిని తొలగించారు.రెండో దశలో మార్చి నుంచి రూ.6 వేల పెన్షన్ పొందుతున్న వారికి క్షేత్ర స్థాయి పరీక్షలు నిర్వహించిన అనర్హులను తొల గిస్తున్నారు. శారరీక వైకల్యంలో భాగంగా అయిదు విభా?గాల్లో ప్రతి నెల 8లక్షల మందికి రూ.6 వేల పెన్షన్ చెల్లిస్తున్నారు.ఈ ఏడాది ఫిబ్ర వరి నుంచి ఆరోగ్య శాఖ, సెర్ప్ అధికారుల బృందాలు వైకల్య నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నాయి. లబ్దిదారులను ఎంపిక చేసిన ఆసుపత్రులలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని ప్రభుత్వం సూచించింది.మొత్తం పెన్షనర్లలో 4లక్షల మంది ఆర్థోపెడిక్ సమస్యలు ఉన్న వారున్నారు. మిగిలిన వారిలో ఈఎన్టీ, కంటి చూపు లోపం, మానసిక వైకల్యం ఇతర సమస్యలున్న వారున్నారు.ఇప్పటి వరకు 3 లక్షల మందికి వైద్య పరీక్షలు పూర్తి చేయగా వారిలో సుమారు 65 వేల మంది అనర్హులను గుర్తించారు. పది వేల మందికి వైకల్యం ఉన్నా.. పెన్షన్ పొందే స్థాయిలో శారీరక వైకల్యం లేదు.శ్రీకాకుళం, విజయనగరం, తూర్పుగోదావరి, కృష్ణా జిల్లాలో అనర్హులుఅధికంగా ఉన్నట్లు గుర్తించారు. నెల్లూరు, అనంత పురం, కర్నూలు, తిరు పతి జిల్లాల్లో అనర్హులు పట్టుబడుతున్నారు.అంగవైకల్యం, మానసిక, ఈఎన్టీ సమస్యలున్న వారికి నవంబర్ వరకు పరీక్షలు నిర్వహిస్తారు. నెలకు రూ.15 వేల పెన్షన్ పొందే 24,091 మందిలో 7,256 మంది అనర్హులను గతంలోనే గుర్తించారు. మిగిలిన 70% లో 31.29% మంది రూ.6వేల పెన్షన్‌కు మాత్రమే అర్హత ఉంది.తక్కువ వైకల్యం ఉన్న వారికి 40శాతానికి పైగా వైకల్యంగా నమోదు చేయడంతో వారికి రూ.6వేల పెన్షన్ లభిస్తోంది.

# అంతు చిక్కని కమల వ్యూహం



ఏలూరు, ఏప్రిల్ 30,

ఇతర రాష్ట్రాలతో పోలిస్తే భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ లో కొత్త పంథాను ఎంచుకుంది. మిగిలిన రాష్ట్రాల్లో ఇతర పార్టీల నుంచి వచ్చిన నేతలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తూ వస్తున్నారు. అంతే కాదు వారికి పదవులను కేటాయించడంలోనూ ముందుంటున్నారు. కానీ ఆంధ్రప్రదేశ్ లోమాత్రం పూర్తి భిన్నంగా నిర్ణయాలు తీసుకుంటుంది. గత కొన్నేళ్ల నుంచి బీజేపీ ఆంధ్రప్రదేశ్ లో తీసుకున్న నిర్ణయాలను పరిశీలిస్తే పట్టు బిగించుకోవడానికి, పార్టీ బలోపేతానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, అంతే కాకుండా పార్టీని నమ్ముకున్న వారికి అన్యాయం జరగదని బలమైన సంకేతాలను కూడా పార్టీ కేంద్ర నాయకత్వం క్యాడర్ లోకి పంపే ప్రయత్నం చేస్తుంది. సీనియర్ నేతలను కూడా పక్కన పెట్టి పార్టీ కోసం పనిచేసిన వారికి పదవులను కట్టబెడుతుండటం చర్చనీయాంశమైంది. పొరుగు రాష్ట్రమైన తెలంగాణను తీసుకుంటే అక్కడ ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి పదవులు ఇచ్చారు. డీకే అరుణ కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘకాలం పనిచేసి వచ్చినప్పటికీ ఆమెకు పార్టీ ఉపాధ్యక్షురాలిగా నియమించడమే కాకుండా తర్వాత పార్లమెంటు టిక్కెట్ కూడా ఇచ్చారు. అలాగే కొండా విశ్వేశ్వర్ రెడ్డికి కూడా ఎంపీ సీటును కేటాయించారు. అదే మాదిరిగా టీఆర్ఎస్ లో సుదీర్ఘకాలం ఉండి వచ్చిన ఈటల రాజేందర్ కు కూడా ప్రాధాన్యత ఇస్తూ పార్లమెంటుకు ఎన్నికయ్యేలా చర్యలు తీసుకుంది. కాకపోతే తెలంగాణలోనూ కేంద్ర మంత్రి పదవులు మాత్రం పార్టీని నమ్ముకున్న వారికే ఇచ్చింది. కిషన్ రెడ్డి, బండి సంజయ్ లు తొలి నుంచి బీజేపీలో కిందిస్థాయి నుంచి పనిచేసి వచ్చిన వారికి అవకాశం కల్పించింది. రాజ్యసభ స్థానం కూడా సుదీర్ఘకాలం పార్టీ కోసం పనిచేసిన లక్ష్మణ్ కు ఇచ్చింది. తమిళనాడులో కూడా అన్నాడీఎంకే నుంచి వచ్చిన నేతకు పార్టీ పగ్గాలు అప్పగించింది. అదే తరహాలో ఆంధ్రప్రదేశ్ లోనూ కాంగ్రెస్ పార్టీ నుంచి వచ్చిన పురంద్రీశ్వరికి, కన్నా లక్ష్మీనారాయణకు పార్టీ అధ్యక్ష బాధ్యతలను అప్పగించారు. ఇక మంత్రి పదవుల విషయానికి వచ్చే సరికి పార్టీలో కొత్తగా చేరిన వారికి కాకుండా బీజేపీ సిద్ధాంతాలను నమ్మిన వారికి అందలం ఎక్కించారు. రాష్ట్ర మంత్రిగా సత్యకుమార్ యాదవ్ ను ఎంపిక చేశారు. అలాగే కేంద్ర మంత్రి పదవి కూడా నరసాపురం నుంచి తొలి సారి ఎన్నికైన భూపతి రాజు శ్రీనివాసవర్మను ఎంపిక చేశారు. ఈ నిర్ణయాలన్నీ పార్టీ క్యాడర్ లో ఉత్సాహం నింపగా కూటమి లోని మిత్ర పక్షాలే ఒకింత ఆశ్చర్యపోవాల్సిన పరిస్థితి. సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న... తాజాగా విజయసాయిరెడ్డి రాజీనామాతో ఖాళీ అయిన రాజ్యసభ స్థానంలో జరుగుతున్న ఉప ఎన్నికకు సంబంధించి కూడా ఎవరికీ తెలియని పేరున్న నేతను ఎంపిక చేశారు. ఆంధ్రప్రదేశ్ రాజ్యసభ సభ్యుడిగా నేడు బీజేపీకి చెందిన పాక వెంకట సత్యనారాయణ నామినేషన్ దాఖలు చేశారు. భీమవరానికి చెందిన పాక వెంకట సత్యనారాయణను అనూహ్యంగా బీజేపీ ఎంపిక చేసింది. పాక వెంకట సత్యనారాయణ బీజేపీ క్రమశిక్షణ సంఘం కమిటీ ఛైర్మన్ గా వ్యవహరిస్తున్నారు. ఆయనను ఎంపిక చేయడంతో బీజేపీలో సుదీర్ఘకాలంగా పనిచేసిన వారికి పదవులు ఇస్తున్నట్లయింది. పాక వెంకట సత్యానారాయణ ఎంపిక తో బీజేపీ స్ట్రాటజీఏందో అర్థమవుతుంది. బీజేపీ చాలా ముందు చూపుతో ఇలా వ్యవహరిస్తుందన్న కామెంట్స్ బలంగా వినిపిస్తున్నాయి.

## అనంతపురంలో 'అమ్మ రాజీనామా' కథ.. పాపకు ఏమీ కాని ఓ తల్లి' లేఖ

అనంతపురం , ఏప్రిల్ 30,

అమ్మ రాజీనామా.. ఇది ఒక సినిమా పేరు.. కానీ రియల్ లైఫ్‌లోనూ ఓ తల్లి అమ్మ పదవికి రాజీనామా చేసింది. కొన్ని అనివార్య కారణాలతోనే అమ్మ పదవికి న్యాయం చేయలేకపోతున్నానని.. పొత్తిళ్లలో ఉండాల్సిన తన పసిపాపను తీసుకెళ్లి రోడ్డు పక్కన వదిలేసింది. శిశువుకు చక్కగా స్నానం చేయించి ఓ బేబీ బెడ్‌లో పడుకోబెట్టి రోడ్డు పక్కన ఉంచింది. తాను అమ్మ పదవికి రాజీనామా చేస్తున్నట్లుగా ఓ లేఖను రాసి.. అందులో తన పాపను రోడ్డుపై ఎందుకు అలా అనాథగా వదిలి వెళ్లాల్సి వచ్చిందో వివరించింది. ఆ లేఖలో చివరిగా రాసిన ఐదు పదాలు ఎమోషనల్‌గా ఉన్నాయి.అనంతపురంలోని విజయనగరం కాలనీ అది.. అప్పుడే పుట్టిన ఆడ శిశువును రోడ్డు పక్కన వదిలేసి వెళ్లారు. పసికందు ఏడుపు విని అక్కడికి వెళ్లిన స్థానికులు చిన్నారిని అక్కున చేర్చుకున్నారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా.. వారు పాపను తీసుకెళ్లి ఆస్పత్రిలో చేర్చారు.. ఆ తర్వాత ఐసీడీఎస్ అధికారులు అక్కడికి వచ్చారు. చిన్నారిని తమ సంరక్షణలో ఉంచేందుకు తీసుకెళ్లారు. అయితే శిశువు దగ్గర తల్లిదండ్రులు రాసిన లేఖను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.ఆ లేఖలో.. 'ప్రియమైన మేడం, సార్ గారికి నా నమస్కరాలు.. నా కూతుర్ని నేను పోషించలేను.. మీరే నా కూతురికి ఒక మంచి జీవితం ఇవ్వాలని కోరుకుంటూ.. మీ దగ్గర వదిలి వెళ్లిపోతున్నాను. తన జీవితం బాగుండాలి.. తనని మీరే బాగా చూసుకోవాలని వేడుకుంటున్నాను. నేను చనిపోతున్నాను. నా కూతుర్ని బాగా చూసుకోండి సార్ ప్లీజ్.. ఒక తల్లిగా నా ఆవేదన.. పాపకి ఏమీ కాని ఓ తల్లి' అంటూ ఓ నోట్‌ను ఆ చిన్నారి పాప పక్కనే వదిలేసి వెళ్లారు. పాపను రోడ్డు పక్కన వదిలేసి ఈ లేఖ ఉంచింది ఎవరు అన్న కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు.. దగ్గరలోని సీసీ ఫుటేజ్‌ను పరిశీలించే పనిలో ఉన్నారు. అలాగే అనంతపురం పోలీసులు పాప గురించి ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉన్న స్థానికుల్ని అడిగి తెలుసుకుంటున్నారు.

భారత శక్తి

గురువారం, 1 మే 2025

## బాధిత కుటుంబాలకు అండగా వుంటాం

తాడేపల్లి  ఏప్రిల్ 30,

సింహాచలం లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద జరిగిన దుర్ఘటన నన్ను తీవ్ర ఆవేదనకు గురిచేసిందని మంత్రి నారా లోకేష్ అన్నారు. . ఈ ఘటనలో గాయపడిన వారికి విశాఖ కేజీ హెచ్ ఆసుపత్రిలో చికిత్స జరుగుతోంది. బాధితులకు మెరుగైన చికిత్స కోసం అవసరమైతే ప్రైవేటు ఆసుపత్రులకు తరలించాల్సిందిగా యంత్రాంగాన్ని ఆదేశించాం. పోలీసులు, ఎస్డీఆర్ ఎఫ్ బృందాలు సహాయ చర్యల్లో పాల్గొంటున్నాయి. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా. వారి కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని అన్నారు..

## బసవేశ్వరుడు అభ్యుదయవాది

హైదరాబాద్

లింగాయత్ సమాజ్ కు ఆరాధ్య దైవమైన శ్రీశ్రీశ్రీ  మహాత్మా బసవేశ్వరుడి 892వ జయంతిని  ఆ సమాజ్ ప్రతినిధులు భాగ్యనగరంలో ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం, వీరశైవ సమాజము-సికింద్రాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో  ట్యాంక్ బండ్ పై ఉన్న బసవేశ్వరుడి విగ్రహానికి ఎం ఏల్ సి కవిత పూలమాల వేసి నివాళులర్పించారు.

కవిత మాట్లాడుతూ బసవేశ్వరుడు సమాజంలో కుల, వర్ణ, లింగ బేధాలు లేవని, అందరం సమానమేనని,  సుమారు గత ఎనిమిది వందల సంవత్సరాల క్రితమే చాటి చెప్పారని సంఘం నాయకులు తెలిపారు. అందుకనే బసవేశ్వరుడిని బసవన్న, బసవుడు, విశ్వగురు అని పిలుస్తారన్నారు. సమాజంలో కుల వ్యవస్థను, వర్ణ భేదాలను, లింగ వివక్షతను సమూలంగా వ్యతిరేకించిన అభ్యుదయ వాది అని పేర్కొన్నారు.

## బసవేశ్వర విగ్రహానికి మంత్రి పొన్నం నివాళులు

హైదరాబాద్

మహాత్మా శ్రీ బసవేశ్వర 892 వ జయంతి సందర్భంగా ట్యాంక్ బండ్ వద్ద శ్రీ బసవేశ్వర విగ్రహానికి మంత్రి పొన్నం ప్రభాకర్,పార్లమెంట్ సభ్యులు సురేష్ షెట్కార్ నివాళులు అర్పించారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ సమాజంలో సమాజం మీద అవగాహన కల్పించిన మొదటి గురువు బసవేశ్వరుడు. బసవేశ్వరుడు జగత్ గురువుగా వారి జయంతి వేడుకల్లో ట్యాంక్ బండ్ పై వారి విగ్రహానికి నివాళులు అర్పించడం జరిగింది. వారు చూపిన మార్గంలో నడుస్తూ సర్వేజనా సుఖినోభవంతు అందరూ బాగుండాలని.. అందరూ పరస్పరం గౌరవించుకుంటూ వారు ఇచ్చిన శాంతి సందేశం పాటించినట్లయితే  ఎక్కడ ఉద్రిక్త వాతావరణలు ఉండవని అన్నారు.

బసవేశ్వరుడి చరిత్ర తెలుసుకునే విధంగా ఉండాలని ఆకాంక్షిస్తూ బసవేశ్వరుడి జీవిత చరిత్ర ఈ తరానికి తెలవాల్సిన అవసరం ఉందని అన్నారు.

## ఘనంగా బసవేశ్వరుడి జయంతి

హైదరాబాద్

లింగాయత్ సమాజ్ కు ఆరాధ్య దైవమైన శ్రీశ్రీశ్రీ  మహాత్మా బసవేశ్వరుడి 892వ జయంతిని...  ఆ సమాజ్ ప్రతినిధులు భాగ్యనగరంలో ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం, వీరశైవ సమాజము-సికింద్రాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో... ట్యాంక్ బండ్ పై ఉన్న బసవేశ్వరుడి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బసవేశ్వరుడు (1134?1196) హైందవ మతాన్ని సంస్కరించిన ప్రముఖులలో ఒకరని... ఆయన సమాజంలో కుల, వర్ణ, లింగ బేధాలు లేవని, అందరం సమానమేనని... సుమారు గత ఎనిమిది వందల సంవత్సరాల క్రితమే చాటి చెప్పారని సంఘం నాయకులు తెలిపారు. అందుకనే బసవేశ్వరుడిని బసవన్న, బసవుడు, విశ్వగురు అని పిలుస్తారన్నారు. సమాజంలో కుల వ్యవస్థను, వర్ణ భేదాలను, లింగ వివక్షతను సమూలంగా వ్యతిరేకించిన అభ్యుదయ వాది అని పేర్కొన్నారు. లింగాయత ధర్మం స్థాపించారు. బసవేశ్వరుడు బోధించిన సంప్రదాయమే అనంతర కాలంలో "లింగాయత ధర్మం"గా స్థిరపడిందన్నారు. అందుకే ప్రధాని నరేంద్ర మోదీ నూతనంగా నిర్మించిన పార్లమెంట్ ఆవరణలో బసవేశ్వరుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించారని తెలిపారు.

## మద్యం మత్తులో కారు డ్రైవర్ హల్ చల్

రంగారెడ్డిపెద్ద అంబర్ పేట్ ఔటర్ రింగురోడ్డు వద్ద కారు బీభత్సం సృష్టించింది. మద్యం మత్తులో  డివైడర్  పై నుండి వచ్చి ఎదురుగా వస్తున్న వాహనాలను కారు డ్రైవర్  ఢీ కొట్టాడు. ఒక్క కారు, రెండు బైకులను ఢి కొట్టింది. ఘటనలో పలువురికి గాయాలు అయ్యాయి. వారిని హాస్పిటల్ కు తరలించారు. కారు లో మద్యం బాటిల్స్ లభ్యం అయ్యాయి. జాతీయ రహదారి పై భారీగా ట్రాఫిక్ జామ్ అయింది...

## జాంబియా కుంటలో మహిళ మృతదేహం

సంగారెడ్డి

అమీన్ పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గుర్తు తెలియని మహిళ మృతిదేహం లభ్యం అయింది. నరేగూడెం గ్రామంలో జాంబియా కుంట లో మృతిదేహం నీళ్లలో  తెలింది. స్థానికులు అందించిన సమాచారంతో పోలీసులు చేరుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.. మృతి దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి  తరలించారు.

# గ్రాండ్ గా గ్రౌండ్ ప్లానింగ్...

విజయవాడ, ఏప్రిల్ 30,

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏ పనిచేసినా చాలా పకడ్బందీగా చేస్తారు. ఆయన డ్రీమ్ ప్రాజెక్టును లాంచ్ చేయడానికి ఎప్పుడైనా గ్రాండ్ గానే ప్లాన్ చేస్తారు. దానివల్ల ప్రచారంతో పాటు హైప్ క్రియేట్ అవుతుందని, దాని వల్ల రాష్ట్రానికి ఎంతో ఉపయోగముంటుందని చంద్రబాబు భావిస్తారు. ఇప్పటి వరకూ పదిహేనేళ్ల పాటు ముఖ్యమంత్రిగా పనిచేసిన కాలంలోనూ ప్రతి పనికీ రాజకీయాన్ని జోడించి తనకు కీర్తి ప్రతిష్టల స్థాయిని మరింత పెంచేలా చంద్రబాబు డిజైన్ చేస్తారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోనూ ఇప్పటికీ హైదరాబాద్ ఐటీ రంగంలో అభివృద్ధి చెందిందని అన్నా, నేటికీ హైదరాబాద్ అత్యధికంగా ఆదాయాన్ని ఆర్జించి పెట్టే ప్రాంతంగా తీర్చిదిద్దింది ఎవరన్నా ప్రత్యర్థులు సయితం చంద్రబాబు వైపు వేళ్లు చూపించాల్సిందే.సంపద పెరుగుతుందని... అదే చంద్రబాబు నాయుడు కోరుకునేది. కావాల్సింది. అందుకే తాజాగా అమరావతి రాజధాని పునర్మిరాణ పనుల ప్రారంభం పేరిట చంద్రబాబు చేస్తున్న హడావిడి వెనక కూడా అంతే బలీయమైన ఆకాంక్ష ఉందంటున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ రాజధాని పనులకు శంకు స్థాపనలు చేసి వెళ్లిన తర్వాత ఈ ప్రాంతంలో రియల్ ఎస్టేట్ ధరలు మరింత పెరుగుతాయని ఆయనకు తెలుసు. నిర్మాణ పనులు ప్రారంభమయిన తర్వాత ఇక్కడ ఒక్కసారిగా భూముల ధరలకు రెక్కలు వచ్చి రియల్ వ్యాపారం ఊపందుకుని పరోక్షంగా ప్రభుత్వానికి కూడా సంపద చేకూరుతుందని చంద్రబాబు అంచనా వేస్తున్నారు. అదే సమయంలో అనేక సంస్థలు కూడా అమరావతిలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తాయని చంద్రబాబు ఆశిస్తున్నారు. . అమరావతి పునర్నిర్మాణం పేరుతో ఖర్చు పెట్టే ప్రతి పైసా రాష్ట్రానికి అంతే వేగంగా తిరిగి వస్తాయని చంద్రబాబు భావిస్తున్నారు. అందుకోసమే కొంత ఆర్భాటమైనా తాను అనుకున్నది చేసి తీరాలన్న పట్టుదలతో చంద్రబాబు ఉన్నారు. ఒకటి కాదు..రెండు కాదు.. లక్షల కోట్ల రూపాయలు ప్రభుత్వానికి అదనంగా సంపదను సమకూర్చుకోవాలంటే ఆ మాత్రం రిస్క్ తీసుకోక తప్పదు. వాస్తవానికి అయితే మరో ఏ ముఖ్యమంత్రి అయినా రాజధాని పునర్నిర్మాణ పనులు పేరిట ఇంత పెద్ద స్థాయిలో సభను ఏర్పాటుచేయరు. కానీ చంద్రబాబు ఆలోచన మాత్రం వేరుగా ఉంటుంది. అమరావతి కల సాకారమయితే తన పేరు చిరస్థాయిగా మిగిలిపోతుందన్న భావనతో ఆయన ఒక్కొక్క అడుగూ ముందుకు వేస్తున్నారు.. ప్రధాని నరేంద్ర మోదీ రావడంతో కొంత హైప్ రావడమే కాకుండా ఈ కార్యక్రమంతో చంద్రబాబుకు తన ఇమేజ్ కూడా మరింత పెరుగుతుందని తెలుసు. ఒకవైపు అభివృద్ధి మరొకవైపు సంక్షేమాన్ని కలగలుపుతూ తీసుకెళ్లేది చంద్రబాబు మాత్రమేనని ఇప్పటికే ప్రజలు నమ్ముతారు. ఆ నమ్మకం చెక్కు చెదరకుండా ఉండేందుకే చంద్రబాబు నాయుడు అమరావతి రాజధాని నిర్మాణ పనుల కు శంకుస్థాపన కార్యక్రమానికి భారీగా ప్లాన్ చేసినట్లు స్పష్టంగా అర్థమవుతుంది. మరొక వైపు దేశంలోనే అమరావతి బ్రాండ్ ఇమేజ్ పెరగడం ఖాయమని చంద్రబాబు అంచనా వేస్తున్నారు. మొత్తం మీద చంద్రబాబు నాయుడు ఆలోచనలు గ్రౌండ్ అయితే మాత్రం గ్రాండ్ సక్సెస్ అయినట్లేనని అనుకోవాల్సి ఉంటుంది.

# వ్యాపారం మీది, పెట్టుబడి ప్రభుత్వానిది

నెల్లూరు, ఏప్రిల్ 30,

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత యువతకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించే అంశంపై ఎక్కువ దృష్టి పెట్టింది. ప్రతి ఇంటికి వ్యాపారవేత్తలను సిద్ధం చేస్తానంటూ ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు ప్రభుత్వం ఆ దిశగా చాలా ప్రయత్నాలు చేస్తోంది. ఆ హామీలో భాగంగా ప్రభుత్వం కొత్తగా ఓ స్కీమ్ తీసుకొచ్చింది. దీని ద్వారా ఔత్సాహికులు సొంతగా వ్యాపారాలు చేసుకోవడమే కాకుండా పది మందికి పని కల్పించేందుకు వీలు అవుతుంది. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ కార్పొరేషన్ ద్వారా ఔత్సాహికులకు లోన్ ఇచ్చే స్కీమ్‌ను ప్రభుత్వం తీసుకొచ్చింది. ఇందులో లోన్ తీసుకున్న వారంతా వ్యవసాయం, దాని అనుబంధ సంస్థలు, రవాణా, పరిశ్రమలు, సేవల రంగం, వ్యాపార రంగాల్లో నిలదొక్కుకునేలా ప్రయత్నాలు చేయవచ్చు. ఉపాధి పొందడమే కాకుండా తోటి వారికి కూడా పని కల్పించే అద్భుతమైన అవకాశానని ప్రభుత్వం కల్పిస్తోంది. ప్రస్తుతానికి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా లోన్‌లు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. మే పదో తేదీ వరకు అప్లై చేసుకోవడానికి గడువు ఇచ్చింది. ఇలా ఎస్సీ కార్పొరేషన్ ద్వారా లోన్ తీసుకొని 32 రకాల వ్యాపారాలు చేసుకోవచ్చు. ఇందులో కొన్నింటికి మినిమం అర్హత పెట్టారు. మరికొన్నింటికి అసలు ఎలాంటి విద్యార్హత లేకుండానే అప్పులు ఇవ్వబోతున్నారు. ఈ స్కీమ్ పొందాలంటే అర్హతలు ఏంటీ?ఎస్సీ కార్పొరేషన్ ద్వారా వచ్చే లోన్ పొందాలంటే లబ్ధిదారుడు ఏదైనా ాఅ కమ్యూనిటీకి చెందినవారై ఉండాలి. కుల ధ్రువీకరణ పత్రం కలిగి ఉండాలి. ఏపీకి చెందిన వ్యక్తులే ఈ స్కీమ్‌కు అర్హులు. లబ్ధిదారుడి వయస్సు 21 నుంచి 50 సంవత్సరాల మధ్య ఉండాలి. లబ్ధిదారుడు దారిద్ర్యరేఖకు దిగువన (ఃఖఒ) వర్గంలో ఉండాలి.

మొదటి లబ్ధిదారుడు  వెబ్‌సైట్‌లోకి వెళ్లి ప్రాథమిక వివరాలు నమోదు చేయాలి. అనంతరం యూజర్ ఐడి ఒ పాస్‌వర్డ్ వస్తుంది. యూజర్ ఐడి అంటే రిజిస్ట్రేషన్ కోసం ఇచ్చిన మొబైల్ నంబర్. పాస్‌వర్డ్ అంటే ఆ నెంబర్‌కు వచ్చే ాఖ దీని ఆధారంగా లాగిన్ అవ్వాలి. అనంతరం రెండో దశలో లబ్ధిదారుడు తన దరఖాస్తు పూర్తి చేయడానికి అడ్రెస్, కులం, విద్యార్హతలు, పథకం వివరాలు పూర్తి చేసి స్కీమ్‌లోకి లాగిన్ అవ్వాలి. అప్లై చేసిన తర్వాత దరఖాస్తుదారుడు అప్లికేషన్ ప్రింట్ తీసుకోవాలి.  ఎస్సీ కార్పొరేషన్ మూడు విభాగాల్లో రుణాలు ఇస్తుంది. మొదటి విభాగంలో ఉన్న వారికి రూ.3 లక్షలలోపు పెట్టుబడి వ్యయం యూనిట్లు అందజేస్తారు. రెండో విభాగంలో రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలలోపు వారికి పెట్టుబడి సాయం అందజేస్తారు. మూడో జాబితాలో రూ. పది లక్షలపైన ఆర్థిక సాయం చేస్తారు. మొదటి కేటగిరిలో లబ్ధిదారులకు ప్రభుత్వం 60 శాతం సాయం చేస్తుంది. బ్యాంకులు 35 శాతం రుణం ఇస్తాయి. ఐదు శాతం లబ్ధిదారులు వాటా పెట్టుకోవాల్సి ఉంటుంది. గరిష్టంగా ఈ కేటగిరిలో లక్ష రూపాయల వరకు సబ్సిడీ పొందవచ్చును. రెండో కేటగరిలో ప్రభుత్వం నుంచి 40 శాతం సాయం అందనుంది. బ్యాంకులు 55 శాతం వరకు రుణాలు ఇస్తాయి. మిగిలిన ఐదు శాతం లబ్ధిదారులు పెట్టుబడి పెట్టుకోవాలి. ఈ కేటగిరిలో ఇచ్చే రాయితీలు ఇతర ఫెసిలిటీసే మూడో కేటగిరికి కూడా వర్తిస్తాయి.

# సాకేకు ప్రమోషన్

అనంతపురం, ఏప్రిల్ 30,

2024 ఎన్నికల ఫలితాలతో డీలాపడిన వైసీపీలో పునరుత్తేజం తెచ్చేందుకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలోనే పార్టీలో పదవుల భర్తీ చేపడుతున్నారు. క్షేత్ర స్థాయి నుంచి పార్టీని పునర్నిర్మించాలని భావిస్తున్న వైఎస్ జగన్.. ఆ క్రమంలో పలు స్థానాలకు ఇంఛార్జులను, సమన్వయకర్తలను నియమిస్తున్నారు. తాజాగా శింగనమల నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్తగా మాజీ మంత్రి సాకే శైలజానాథ్‌ను.. వైఎస్ జగన్ నియమించారు. 2024 ఎన్నికల్లో శింగనమల నియోజకవర్గం నుంచి వీరాంజనేయులును వైఎస్ జగన్ బరిలో నిలిపారు. సిట్టింగ్ ఎమ్మెల్యే అయిన జొన్నలగడ్డ పద్మావతిని కాదని.. వీరాంజనేయులను బరిలో దింపారు. టిప్పర్ డ్రైవర్‌గా పనిచేసిన నేపథ్యం ఉన్న వీరాంజనేయులుకు టికెట్ ఇవ్వటం అప్పట్లో చర్చనీయాంశమైంది. అయితే టీడీపీ అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ చేతిలో వీరాంజనేయులు ఓటమి పాలయ్యారు.అయితే తాజా రాజకీయ పరిస్థితుల్లో సాకే శైలజానాథ్‌ను శింగనమల వైసీపీ ఇంఛార్జిగా జగన్ నియమించారు. గతంలో కాంగ్రెస్ పార్టీలో పనిచేసిన సాకే శైలజానాథ్ 2025 ఫిబ్రవరిలో వైఎస్ జగన్ సమక్షంలో వైసీపీ కండువా కప్పుకున్నారు. అప్పటి నుంచి వైసీపీ తరుపున కూటమి ప్రభుత్వ విధానాలపై గళమెత్తుతున్నారు. తాజాగా ఆయనకు నియోజకవర్గ బాధ్యతలు అప్పగిస్తూ జగన్ నిర్ణయించుకోవడం విశేషం. మరోవైపు కాంగ్రెస్ పార్టీ ద్వారా సాకే శైలజానాథ్ రాజకీయ రంగ ప్రవేశం చేశారు. శింగనమల నుంచి 2004, 2009లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీచేసి విజయం సాధించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో మంత్రిగా కూడా పనిచేశారు.అయితే రాష్ట్ర విభజన తర్వాత ఏపీలో కాంగ్రెస్ పరిస్థితి దిగజారింది. ఎన్నికల్లో అన్ని స్థానాల్లో అభ్యర్థులను కూడా బరిలో దింపలేని పరిస్థితికి చేరుకుంది. అయినప్పటికీ సాకే శైలజానాథ్ కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగారు. 2022లో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా కూడా సాకే శైలజానాథ్ పనిచేశారు. అయితే 2024 ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు శైలజానాథ్ టీడీపీలో చేరతారనే ప్రచారం జరిగింది. జేసీ దివాకర్ రెడ్డిని కలవడంతో సాకే శైలజానాథ్ టీడీపీలో చేరబోతున్నారంటూ వార్తలు వచ్చాయి. అయితే ఆయన కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా శింగనమల నుంచి పోటీ చేసి మూడో స్థానంలో నిలిచారు. ఆ తర్వాత ఈ ఏడాది ప్రారంభంలో వైఎస్ జగన్‌ను కలిసిన సాకే శైలజానాథ్ వైసీపీలో చేరారు. ఇప్పుడు శింగనమల వైసీపీ ఇంఛార్జిగా  నియమితులయ్యారు.

# టార్గెట్ గొట్టిపాటి..

ఒంగోలు, ఏప్రిల్ 30

వైయస్సార్ కాంగ్రెస్ అధినేత ప్రకాశం జిల్లాపై దృష్టి పెట్టారు. ప్రధానంగా అద్దంకి నియోజకవర్గం పై ఫుల్ ఫోకస్ పెట్టారు. అక్కడ మంత్రి గొట్టిపాటి రవికుమార్ హవాకు బ్రేక్ వేయాలని చూస్తున్నారు. సమర్థుడైన నాయకుడిని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జిగా తేవాలని చూస్తున్నారు. 2029 ఎన్నికల్లో గొట్టిపాటి రవికుమార్ ను ఓడించే నేతను తేవాలన్నది జగన్మోహన్ రెడ్డి ప్లాన్. ఈ క్రమంలో సీనియర్ నేత కరణం బలరామకృష్ణమూర్తి సేవలను వినియోగించుకోవాలని చూస్తున్నారు. ఎలాగైనా 2029లో అసెంబ్లీలో గొట్టిపాటి రవికుమార్ అడుగుపెట్టకూడదు అన్నది జగన్మోహన్ రెడ్డి ప్లాన్.అద్దంకి అంటే ముందుగా గుర్తుకొచ్చేది కరణం బలరాం. ఆ నియోజకవర్గంలో తనకంటూ ఒక ముద్ర చాటుకుంటూ వచ్చారు. కానీ గొట్టిపాటి రవికుమార్ కు బ్రేక్ వేయలేకపోయారు. కాంగ్రెస్ పార్టీ ద్వారా పొలిటికల్ ఎంట్రీ ఇచ్చిన రవికుమార్ వరుసగా ఐదు సార్లు గెలుస్తూ వచ్చారు. అద్దంకిలో అయితే నాలుగు సార్లు వరుస విజయంతో తనకంటూ ఒక ముద్ర చాటుకున్నారు. రెండున్నర దశాబ్దాలుగా అక్కడ రాజకీయాలను శాసిస్తున్నారు. ముఖ్యంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి కొరకరాని కొయ్యగా మారిపోయారు. అందుకే రవికుమార్ హవాకు బ్రేక్ వేయాలని చూస్తున్నారు జగన్మోహన్ రెడ్డి.2004లో పొలిటికల్ ఎంట్రీ ఇచ్చారు గొట్టిపాటి రవికుమార్ తొలిసారిగా మార్టూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలిచారు. అసెంబ్లీలో అడుగుపెట్టారు. 2009 పునర్విభజనతో మార్టూరు అద్దంకిగా మారింది. దీంతో గొట్టిపాటి రవికుమార్ అద్దంకికి మారాల్సి వచ్చింది. ఆ ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి కరణం బలరాం పై పోటీ చేసి గెలిచారు రవికుమార్. 2014 ఎన్నికల నాటికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు రవి కుమార్. ఆ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు. తర్వాత తెలుగుదేశం పార్టీలోకి ఫిరాయించారు. 2019 ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా మూడోసారి అద్దంకి నుంచి పోటీ చేసి గెలిచారు. ఎన్ని రకాల ఇబ్బందులు ఎదురైనా తెలుగుదేశం పార్టీలో కొనసాగారు. 2024 ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. మంత్రిగా ఎన్నికయ్యారు. 2024 ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా హనీమిరెడ్డినిబరిలో దించారు జగన్మోహన్ రెడ్డి. ఈయన వైవి సుబ్బారెడ్డి కి సన్నిహితుడు. అయితే ఓటమి తర్వాత హనీమిరెడ్డి నియోజకవర్గంలో కనిపించడం లేదు. దీంతో ఇక్కడ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచే నాయకుడు లేకుండా పోయారు. అందుకే ఇప్పుడు సమర్థవంతుడైన నేత కోసం జగన్మోహన్ రెడ్డి అన్వేషిస్తున్నారు. ఈ క్రమంలోనే కరణం బలరామకృష్ణకు కబురు చేశారు. అద్దంకి నియోజకవర్గ బాధ్యతలు తీసుకోవాలని సూచించారు. మొన్నటి ఎన్నికల్లో చీరాల నుంచి కరణం బలరాం కుమారుడు వెంకటేష్ వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. అయితే కరణం బలరాం టిడిపిలోకి వెళ్ళిపోతారని ప్రచారం జరుగుతోంది. సరిగ్గా ఇటువంటి సమయంలోనే జగన్మోహన్ రెడ్డి పిలిచి బలరాం తో మాట్లాడినట్లు తెలుస్తోంది. త్వరలో అద్దంకి బాధ్యతలు బలరామకృష్ణకు అప్పగిస్తారని ప్రచారం జరుగుతోంది. అందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి.

## మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

విజయవాడ ఏప్రిల్ 30,

సింహాచలం ఘటన వివరాలను పాత్రికేయుల సమావేశంలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వివరించారు.

సింహాచలం శ్రీ వరాహ లక్ష్మి నరసింహ స్వామి ఆలయంలో నిజరూప దర్శనానికి విచ్చేసిన భక్తులు అనుకొని ప్రకృతి వైపరీత్యానికి గురై మృతి చెందడం ఒక దురదృష్టకరమైన సంఘటన... ప్రకృతి వైపరీత్యం వలన జరిగిన విపత్తని మంత్రి అన్నారు.

ముఖ్యమంత్రి  ఆదేశాల మేరకు  రెవెన్యూ శాఖ మంత్రులు అనగాని సత్య ప్రసాద్, రాష్ట్ర హోం మంత్రి అనిత ని రాష్ట్ర ప్రభుత్వం తరఫున హుటాహుటిన ఘటన జరిగిన స్థలానికి పంపడం జరిగింది. ఉదయం రెండు గంటలకు దర్శనాలు ప్రారంభమయ్యాయి. అదే సమయంలో భారీ ఈదురు గాలులతో భారీ వర్షం కురవడం జరిగింది.  కొండలపై నుంచి  భారీగా వర్షం నీరు చేరడంతో ప్రహరీ గోడ కింద ఉన్నటువంటి మట్టి అంతా కరిగి  కొత్తగా కట్టినటువంటి ప్రహరీ గోడ కూలింది.  అనేక ఆలయాలకు కేంద్ర ప్రభుత్వం పర్యాటక రంగం నుంచి ప్రసాదం స్కీం కింద ఆలయాల అభివృద్ధి నిర్మాణం జరుగుతుంది  ఒకవైపు శ్రీశైలం,  మరోవైపు కనకదుర్గమ్మ ఆలయం కొన్ని అభివృద్ధి పనులు ప్రసాదం స్కీం కింద పూర్తయ్యాయి. సింహాచలంలో కూడా  కొంతమేర ఆలయ అభివృద్ధి పనులు ప్రసాదం స్కీం కింద ప్రారంభమయ్యాయి.  అటు పర్యాటక రంగం,  ఇటు దేవాదాయ శాఖ పరివేక్షణలో ఈ నిర్మాణ పనులు జరుగుతాయి.  సింహాచలంలో జరిగే చందనోత్సవం ప్రభుత్వ పండుగగా  గుర్తించాం.  దేవాదాయ శాఖ మంత్రిగా నేను, రెవిన్యూ శాఖ మంత్రి,  హోం మంత్రి, అనువంశిక ధర్మకర్తగా అశోక్ గజపతిరాజు  దాదాపు రెండు నెలల నుంచి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నాం.  ప్రకృతి వైపరీత్యం తో దాదాపు 7 మంది ప్రాణాలు కోల్పోవడం జరిగింది.  ఘటనపై పూర్తి విచారణ చేయాలని అధికారులను ఆదేశించామని అన్నారు.

## మెడికేర్ సెలెక్ట్ పాలసీ విడుదల

హైదరాబాద్

టాటా ఏఐజీ జనరల్ ఇన్సూరెన్స్. కొత్త రిటైల్ ఆరోగ్య బీమా పాలసీ 'మెడికేర్ సెలెక్ట్'ను విడుదల చేసింది. రిటైల్ హెల్త్ పోర్టుఫోలియోతో పాటు బీమా వ్యాపారాన్ని మరింత పటిష్ఠం చేసుకునే లక్ష్యంతో ఈ పాలసీని తీసుకువచ్చినట్లు టాటా ఏఐజీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ ప్రతీక్ గుప్తా తెలిపారు. ఎలాంటి ఎంట్రీ వయసు లేకుండా, అందుబాటు ధరల్లో ఉండే ప్రీమియంతో ఈ సమగ్ర ఆరోగ్య బీమా పాలసీని రూపొందించినట్లు ఆయన చెప్పారు. ఎలాంటి వయోపరిమితులు లేకుండా ఈ పాలసీని అందరికీ ఆఫర్ చేస్తున్నట్లు గుప్తా పేర్కొన్నారు. టాటా ఏఐజీకి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ కీలక మార్కెట్లుగా ఉన్నాయని, గత ఏడాది కాలంలో కంపెనీ రిటైల్ హెల్త్ విభాగం ఇక్కడ మూడింతల వృద్ధిని నమోదు చేసిందని ఆయన చెప్పారు. తెలుగు రాష్ట్రాల్లో 1,600కు పైగా హాస్పిటల్స్ నెట్వర్క్తో పాటు 14,000 మంది అడ్వైజర్లను టాటా ఏఐజీ కలిగి ఉందన్నారు. హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, విజయవాడ, విశాఖపట్నం, నెల్లూరుల్లో టాటా ఏఐజీ జనరల్ ఇన్సూరెన్స్ కార్యాలయాలను కలిగి ఉందన్నారు.

## పరీక్ష రాసి ..... తిరిగి రాని లోకానికి

మేడ్చల్


గుర్తు తెలియని వాహనం ఢీకొని  విద్యార్థిని మృతి చెందిన సంఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది .మేడ్చల్ పోలీసులు తెలిపిన  వివరాలు ప్రకారం కామారెడ్డి జిల్లా లింగంపేట్ మండల్ నల్లమడుగుల తండా కు చెందిన ధనావత్ అర్చన (16) తన అన్నతో కలిసి మంగళవారం సాయంత్రం సీఎంఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో  టీజీఈఏపిసిఈటి పరీక్ష రాసేందుకు వచ్చింది. పరీక్ష రాసిన అనంతరం రాత్రి కండ్ల కోయలో తన బంధువుల ఇంట్లో ఉండి తెల్లవారుజామున తన అన్నతో ద్విచక్ర వాహనంపై నల్లమడుగుల తాండ వెళ్తున్న క్రమంలో  మేడ్చల్ లో గుర్తుతెలియని వాహనం ద్విచక్ర వాహనాలు ఢీ కొట్టింది. దీంతో అర్చన అక్కడికక్కడే మృతి చెందగా అన్న తీవ్ర గాయాలయ్యాయి. సంఘటనా స్థలానికి చేరుకొని మేడ్చల్ పోలీసులు అర్చన మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం  ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు మేడ్చల్ పోలీసులు తెలిపారు.

# ఈ తరానికి ఆదర్శనీయుడు పుచ్చలపల్లి సుందరయ్య

( పెండ్యాల రామ్ కుమార్, మంథని )

పుచ్చలపల్లి సుందరయ్య ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు, తెలంగాణా రైతాంగ సాయుధ పోరాట వీరుడు, స్వాతంత్ర్య సమర యోధుడు. కమ్యూనిస్టు గాంధీగా పేరొందిన సుందరయ్య తెలుగునాట కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతలలో ప్రముఖుడు. కులవ్యవస్థను నిరసించిన ఇతను అసలు పేరు పుచ్చలపల్లి సుందరరామిరెడ్డి లోని రెడ్డి అనే కులసూచికను తొలగించుకున్నాడు. సహచరులు ఇతనును "కామ్రేడ్ పి.ఎస్." అని పిలిచేవారు. ఇతను నిరాడంబరతతో ఆదర్శ జీవితం గడిపాడు. స్వాతంత్ర సమరంలోని అనేక ఉద్యమాల్లో పాల్గొన్నాడు. సుందరయ్య భార్య కూడా సీపీఐ-ఎంలోని ముఖ్య నాయకురాలు. తెలంగాణ ప్రజల పోరాటం - దాని పాఠాలు, విశాలాంధ్రలో ప్రజారాజ్యం వంటి పుస్తకాలు, నివేదికలు రాశాడు. పార్లమెంటు సభ్యునిగా సుదీర్ఘ కాలం పనిచేశాడు, ఆ సమయంలో పార్లమెంటుకు కూడా సైకిల్ మీద వెళ్ళేవాడు.

పుచ్చలపల్లి సుందరయ్య, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా విడవలూరు మండలం, అలగానిపాడు గ్రామంలో ఒక భూస్వామ్య




కుటుంబంలో 1913, మే 1 న జన్మించాడు. తండ్రి వెంకటరామిరెడ్డి, తల్లి శేషమ్మ. తల్లిదండ్రులు ఇతనికు సుందరరామిరెడ్డి అని పేరు పెట్టారు. ఆరేళ్ళ వయసులో తండ్రి మరణించాడు. ప్రాథమిక విద్యను వీధిబడిలోనే పూర్తిచేసాడు. తరువాత అక్కయ్య వాళ్ళ ఇంటివద్ద ఉంటూ తిరువళ్ళూరు, ఏలూరు, రాజమండ్రి, మద్రాసు లలో చదివాడు. ఇతనిని "కమ్యూనిస్టు గాంధీ" అంటారు. పార్లమెంటు భవనంలో చప్రాసీల సైకిళ్లతోపాటు ఇతని సైకిలు కూడా స్టాండులో ఉండేది. రాష్ట్ర విధానసభలోనూ అదే సైకిలును ఉపయోగించాడు. పెళ్ళి చేసుకున్న తర్వాత సంతానం కలిగితే తన ప్రజాసేవకు ఆ బంధాలు, బాంధవ్యాలు అడ్డంకగులుతాయని పెళ్ళికాగానే కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స చేయించుకొన్నాడు. తండ్రినుంచి వంశపారంపర్యంగా లభించిన ఆస్తిని నిరుపేద ప్రజలకు పంచివేశాడు.1985, మే 19న మద్రాసులోని అపోలో ఆస్పత్రిలో పుచ్చలపల్లి కన్నుమూశాడు. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలో ఆయన పేరుతో గ్రంథాలయం, ఆడిటోరియం, పార్కు ఏర్పాటయ్యాయి. గాంధీజీ నిరాడంబరత, ప్రకాశం వంటి ప్రజా సాన్నిహిత్యం, పటేలు వంటి పట్టుదల, నెహ్రూ వంటి రాజకీయ పరిణతి సుందరయ్యలో ఉన్నాయని పాతతరం నాయకులు వర్ణిస్తారు.

1952 లో సుందరయ్య మద్రాసు నియోజక వర్గం నుండి పార్లమెంటు రాజ్యసభకు ఎన్నికయ్యాడు. పార్లమెంటులో కమ్యూనిస్టు వర్గానికి నాయకుడయ్యాడు. తరువాత రాష్ట్ర శాసనసభకు ఎన్నికై, 1967 వరకు శాసన సభ సభ్యునిగా కొనసాగాడు. మళ్ళీ కొంత కాలం విరామం తరువాత 1978 లో శాసన సభకు ఎన్నికై, 1983 వరకు శాసన సభ సభ్యునిగా ఉన్నాడు. తను మరణించే సమయానికి సుందరయ్య ఆంధ్ర ప్రదేశ్‌లో పార్టీ సాధారణ కార్యదర్శి, కేంద్ర కమిటీ సభ్యుడు.

# సింహాచలం ఘటనకు కూటమి బాధ్యతారాహిత్యమే కారణం

తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ మీడియా సమావేశం నిర్వహించారు. సింహాచలంలో నరసింహస్వామివారి నిజరూప దర్శనం జరిగే కార్యక్రమంలో ఈరోజు ఉదయం ఏడుగురు దుర్మరణం చెందడం అత్యంత బాధాకరమని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక హిందూ ఆలయాల్లో చేస్తున్న ఘోరాలు, బాధ్యతా రాహిత్యంగా ప్రవర్తిస్తున్న తీరు అత్యంత దారుణం. ఆలయంలో ఇటీవల చేపట్టి నిర్మాణాల్లో నాణ్యత పూర్తిగా లోపించింది. గతంలో ఉన్న కాంట్రాక్టుల్ని రద్దు చేసి నాయకులకు సంబంధించిన వారికి కాంట్రాక్టులు విచ్చలవిడిగా దోచిపెడి పాల్పడుతున్నారు. పచ్చమీడియా వీరికి రక్షణ కవచంలా పనిచేస్తుందని వీరి నమ్మకం. రోజుకో వేషం వేసే సనాతన ధర్మాన్ని కాపాడే ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఏం చేస్తున్నారు. అధికారులు, పోలీస్ యంత్రాంగం ఎవరూ ప్రమాదం జరిగిన ప్రాంతంలో లేరని అక్కడ ఉన్న భక్తులు చెబుతున్నారు. ఇంత నిర్లక్ష్యం ఈ పచ్చ మీడియాకు కనపడదా. ఇటీవల తిరుపతిలో కూడా టికెట్లు ముందు ఇస్తామని భక్తులను ఒక పార్కులో పెట్టి తొపులాటకు కారణమయ్యారు. తిరుపతిలో ఏడుగురు చనిపోతే సనాతన ధర్మవాది అని చెప్పుకునే పవన్ కళ్యాణ్ క్షమాపణ చెప్పి చేతులు దులుపుకొన్నారు. శ్రీకూర్మంలో నక్షత్ర తాబేళ్ల వనంలో, అవి చనిపోతే ఎంతో నిర్లక్ష్యంగా కనీసం పోస్టుమార్టం చేయకుండా వాటిని దహనం చేసేశారు. 100 గోవులు చనిపోతే ,ఎంత నిర్లక్ష్యంగా ఇప్పుడు ఏమైంది అని మాట్లాడడం ఎంత దారుణం. ఈ కూటమి ప్రభుత్వానికి ఇవేమీ పట్టించుకోరా. పవన్ కళ్యాణ్ ప్రతిదాన్ని ఒక పంచ్ డైలాగ్ లాగా చెప్పడం తప్ప చేసేదేమీ లేదు. భక్తులు ఆలయాల దగ్గర చనిపోతుంటే ఈ సనాతన ధర్మవాది ఏ ఆలయంలో మెట్లు కడుగుతున్నారు. ఎలా చనిపోయిన వారి ప్రాణాలను వెనక్కి తీసుకొస్తారో చెప్పాలి.

# మేడే ఒక చారిత్రాత్మక చైతన్య దినం

( పెండ్యాల రామ్ కుమార్, మంథని )

మే డే!.. కార్మిక దినోత్సవం? ప్రతి ఏడాది మే 1 వ తేదీ నాడు జరుపుకునే స్మారక దినం. చాలా దేశాలలో మే దినం అంతర్జాతీయ కార్మిక దినోత్సవం లేదా కార్మిక దినోత్సవం తో ఏకీభవిస్తాయి. ఇవి అన్నీ కూడా కార్మికుల పోరాటం మరియు కార్మికుల ఐక్యతను గర్తిస్తాయి.కొన్ని పురాణగాథలు కొన్ని రోజులను పండుగలుగా మార్చాయి. కొన్ని జాతీయ సంఘటనలు ఆ సమాజానికి పర్వదినాలు అవుతాయి. కొందరు మహనీయులు తమ రక్తాన్ని చిందించి కొన్ని రోజులను చారిత్రాత్మక రోజులుగా మారుస్తారు. మే డే ఒక చారిత్రాత్మక చైతన్య దినం. చికాగోలో వున్న కొంతమంది రక్తతర్పణం చేసి కేవలం తమ దేశంలో వుండే




కార్మికవర్గానికే కాకుండా ప్రపంచానికంతటికీ కొత్త వెలుగును అందించారు. మే డే ఒక చారిత్రాత్మక చైతన్య దినం. తమ హక్కుల కోసం రక్తార్పణం చేసి కార్మికవర్గానికే కాకుండా ప్రపంచానికి కొత్త వెలుగులు అందించిన చరిత్ర మే డే కు ఉంది. అందుకే నాడు కార్మికులు 8 గంటల పనిదినం కోసం పోరాడారు. ప్రాణాలు సైతం త్యాగం చేసి కార్మిక ప్రపంచానికి చీకటిని చెరిపేసి వెలుగునందించారు. వారి పోరాటం నేటి సమాజానికి సైతం స్ఫూర్తిమంతం... 19వ శాతాబ్దంలో పెట్టుబడిదారులు కార్మికులను చేస్తున్న దోపిడీని గ్రహించి మార్క్సిస్టు మూల పురుషుడు కార్ల్ మార్క్స్ ప్రపంచ కార్మికులారా ఏకం కండి... పోరాడితే పోయేదేమీ లేదు బానిస సంకెళ్లు తప్ప... అని ఇచ్చిన నినాదానికి కార్మికుల నుంచి ఉవ్వెత్తున స్పందిన వచ్చింది. ఇంగ్లాండ్ యూరోపియన్ దేశాల్లో పారిశ్రామిక రంగం వేగంగా అభివృద్ది చెందుతున్న సమయంలో అటు కార్మిక రంగం అంతేవేగంగా విస్తరించింది. ఈ పారిశ్రామిక విప్లవం ప్రారంభ దినాల్లో శ్రామికులను యాజమాన్యాలు, బానిసల్లా పనిచేయించుకునే వారు. కార్మికులకు కనీస సౌకర్యాలు, తగిన వేతనం, కల్పించకపోగా రోజుకు 18- 20 గంటలు పనిచేయించే వారు. దీంతో కార్మికులు మొదటిసారిగా 1806లో తిరుగుబాటుకు చేశారు. బ్రిటన్‌లో ప్రారంభమైన ఈ తిరుగుబాటు అమెరికా సంయుక్త రాష్ట్రాలతో పాటు యూరప్, ఫ్రాన్స్, జర్మనీ తదితర దేశాలకు పాకింది. 8 గంటలు పనిదినం, 8 గంట నిద్ర, 8 విశ్రాంతి కావాలంటూ అటు యూరప్ లోను, ఇటు అమెరికాలోని కార్మికులు ఉద్యమించారు. ఈ తిరుగుబాటు మొత్తానికి అమెరికా ఫెడరేషన్ ఆఫ్ లేబర్స్ యూనియన్ నాయకత్వం వహించింది. చికాగో నగరంలో 1886మే 1న హే మార్కెట్ ప్రాంతంలో కార్మికుల హక్కుల కోసం భారీ నిరసన ప్రదర్శన జరిపారు. ఈ ర్యాలీని చెదరగొట్టేందుకు అమెరికా ప్రభుత్వం పోలీసులను ఉసిగొల్పింది. దీంతో రెచ్చిపోయిన పోలీసులు ప్రదర్శనపై కాల్పులు జరిపారు. నలుగురు కార్మికులు తుపాకీ తూటాలకు బలయ్యారు. కాల్పులకు వ్యతిరేకంగా మే 4న మరో నిరసన సభ ఏర్పాటు చేశారు. ఈ సభను చెదరగొట్టే ప్రయత్నంలో పోలీసులు మరోసారి ప్రతాపాన్ని చూపారు. స్వైర విహారం చేశారు. దీంతో చికాగో లోని హే మార్కెట్ రక్తంతో పూర్తిగా తడిసి ముద్దైంది. అక్కడే ఆవిర్భవించింది ఈ అరుణపతాకం. ఆ విధంగా మే 1 ప్రపంచ కార్మిక వర్గ విప్లవపోరాట ఉద్యమ చరిత్రలు రక్తాక్షరాలతో లిఖించదగింది.

ఆనాటి పోరాటాలు ఒక్క చికాగో నగరమేగాక ప్రపంచం నలుమూలల వ్యాపించాయి. ఆ రకంగా మొదలైన మే డే నాటి నుంచి మన దేశంలో వామపక్షాల ఆధ్వర్యంలోని కార్మికులు, ఉత్సవాలను జరుపుతున్నారు. నాటి నుంచి నేటి వరకు అనేక రూపాల్లో కార్మికులు తమ పోరాటాలను కొనసాగిస్తూనే ఉన్నారు.

చఛారతదేశంలో...భారతదేశంలో చికాగో కంటే ముందే కలకత్తాలో కార్మికులు నిర్దిష్ట పనిగంటల కోసం హౌరా రైల్వేస్టేషన్‌లో 1862లో సమ్మెచేశారు. అప్పటివరకు ఆ రైల్వే కార్మికులు 10 గంటలు పనిచేసేవారు. అప్పుడే బెంగాల్ పత్రికల్లో పాలకవర్గానికి చెందిన అధికారులు ఎన్ని గంటలు పనిచేస్తారో మేము కూడా అన్ని గంటలే పనిచేస్తామని డిమాండ్ చేశారు. కాబట్టే అది విస్తృత స్థాయిలో ప్రజా పోరుగా మారలేదు. కాబట్టి ఆ సంఘటన ఉద్యమ స్వరూపాన్ని అందుకోలేదు.

1923లో మొదటిసారి మన దేశంలో 'మే డే'ను పాటించారు. 1920లో ట్రేడ్ యూనియన్ ఏర్పడటం మూలంగా అప్పటినుంచే కార్మికవర్గంలో చైతన్యం పెరగడం మొదలైంది. అప్పటినుంచే 'మే డే'ను పాటిస్తున్నారు. కానీ అసంఘటిత కార్మికవర్గం అన్ని రంగాల్లో వచ్చింది. 1985 తర్వాత చోటుచేసుకున్న ప్రైవేటీజేషన్, లిబరలైజేషన్, గ్లోబలైజేషన్ పరిణామాల వల్ల అసంఘటిత కార్మికవర్గాల కార్మిక చట్టాలు అమలుకు నోచుకోవడం లేదు.ముఖ్యంగా ఐ.టి.రంగంలో ఎంతోమంది ఆడపిల్లలు, యువకులు పనిచేస్తున్నారు. మార్కెట్ శక్తులు ఎక్కడ శ్రమను దోచుకునే అవకాశం వుంటే అక్కడ కంపెనీలు పెడుతున్నాయి. ఈ నేపథ్యంలో నిరుద్యోగాన్ని, బలహీనతలను ఆసరా చేసుకొని వాళ్ళచే 10, 12 గంటలు పనిచేయిస్తున్నారు. 1886లో ఆరంభమైన ఈ ఉద్యమం నేటికీ కార్మిక కర్తవ్యాన్ని తెలియజేస్తోంది. మార్కెట్ శక్తుల శ్రమ దోపిడీపై నిలదీయాల్సిన సమన్వయం ఆసన్నమైంది. ఈ నేపథ్యంలో ఆనాటి కార్మికవర్గ చైతన్యం మరోసారి వెల్లివిరియాలి. ఈరోజు మే డే మనందరిలో కొత్త స్ఫూర్తిని రగిలించాలి. ప్రపంచీకరణ, సామ్రాజ్యవాదం, పెట్టుబడిదారులు, బహుళజాతి కంపెనీలు మొదలైన పీడక వర్గాలు శ్రామిక దోపిడీకి, కార్మిక చట్టాల ఉల్లంఘనకు సంఘటితమవుతున్న తరుణంలోనే ప్రపంచ కార్మికవర్గం ఆ శక్తులను ప్రతిఘటించేందుకు ద్విగుణీకృత ఉత్సాహంతో పోరాడాలి. అందుకు కార్మిక శ్రేణులు ఏకం కావాలి. ఈ మేడే మనకు కొత్త స్ఫూర్తినిస్తుందని ఆశిద్దాం.

# ఎడారిగా మారుతున్న పాకిస్తాన్

లాహోర్, ఏప్రిల్ 30,

పహల్గామ్‌లో ఉగ్రవాద దాడి తర్వాత, భారతదేశం సింధు జల ఒప్పందం నుంచి దూరంగా ఉంది. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి, భారతదేశం, పాకిస్తాన్ మధ్య మూడు యుద్ధాలు జరిగాయి. కానీ సింధు జల ఒప్పందం కొనసాగింది. కానీ ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్ తన కార్యకలాపాలను మానుకోలేదు. ఇప్పుడు భారతదేశం ఒప్పందం నుంచి దూరంగా ఉండటంతో, పాకిస్తాన్ తన సాధారణ స్థాయిని బెదిరింపులకు దిగింది. భారతదేశం ఈ చర్యను యుద్ధానికి నాందిగా చూస్తామని పాకిస్తాన్ తెలిపింది. కానీ పాకిస్తాన్ ప్రభుత్వం మాత్రమే భయపడుతున్నట్లు కాదు. పాకిస్తాన్ ప్రజలు కూడా భయంతో ఉన్నారుపాకిస్తాన్ రైతు హోమ్లా కాకూర్ వార్తా సంస్థ రాయిటర్స్‌తో మాట్లాడుతూ, తన పంటల భవిష్యత్తు గురించి ఆందోళన వ్యక్తం చేశారు. నది నీటి మట్టం గణనీయంగా తగ్గిందని ఆయన అన్నారు. కూరగాయలు ఎండిపోతున్నాయి. భారతదేశం నీటిని ఆపివేస్తే, దేశం మొత్తం థార్ ఎడారిగా మారుతుందని ఆ రైతు అన్నారు. మేము ఆకలితో చనిపోతాము అని అన్నారు.పాకిస్తాన్ ప్రభుత్వ ప్రతిస్పందనపై జల అధికవేత్త, కన్సల్టింగ్ సంస్థ ఆక్స్‌ఫర్డ్ పాలసీ మేనేజ్‌మెంట్‌లో బృంద నాయకుడు వకార్ అహ్మద్ మాట్లాడుతూ, భారతదేశం ఒప్పందం నుంచి వైదొలగడం వల్ల కలిగే ముప్పును పాకిస్తాన్ తక్కువగా అంచనా వేసిందని అన్నారు. సింధు నది నుంచి ఒక్క చుక్క నీరు కూడా పాకిస్తాన్‌కు చేరకుండా చూస్తామని కేంద్ర జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్ చెప్పారు. పేరు వెల్లడించడానికి ఇష్టపడని ఒక అధికారి మాట్లాడుతూ, భారతదేశం కొన్ని నెలల్లో కాలువలను ఉపయోగించి తన పొలాలకు నీటిని మళ్లిస్తుందని చెప్పారు. అయితే, జలవిద్యుత్ ఆనకట్టల ప్రాజెక్టు పూర్తి కావడానికి 4 నుంచి 7 సంవత్సరాలు పడుతుంది.పాకిస్తాన్ నీటిని నిలిపివేయడం వల్ల వ్యవసాయం మాత్రమే ప్రభావితం కాదు. బదులుగా, నీటి కొరత విద్యుత్ ఉత్పత్తిని కూడా ప్రభావితం చేస్తుంది. ఆర్థిక వ్యవస్థకు పెద్ద దెబ్బ అవుతుంది. "ప్రస్తుతానికి మాకు వేరే మార్గం లేదు" అని కరాచీ పరిశోధన సంస్థ పాకిస్తాన్ వ్యవసాయ పరిశోధనకు చెందిన గస్రీబ్ షౌకత్ అన్నారు.

================

# ఆయుర్వేదంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్

హైదరాబాద్, ఏప్రిల్ 30,

భారత హెల్త్ కేర్ రంగం అద్భుతమైన పురోగతి సాధిస్తోంది. ఆధునిక సాంకేతికకు మూలికా, ఆయుర్వేద నివారణలను మిళితం చేయడం చేయడం ద్వారా మెరుగైన చికిత్స అందించడానికి, సంప్రదాయ, ఆయుర్వేదంతో కొత్త మందులు అందించడానికి అవకాశం ఏర్పడుతోందా?. భారతదేశంలో ఆరోగ్య సంరక్షణ భవిష్యత్తు వేగంగా అభివృద్ధి చెందుతోంది. వ్యాధి నిర్ధారణ, నివారణ, ఆవిష్కరణ, పరిశోధన ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నాయి. పతంజలి రీసెర్చ్ ఇన్స్టిట్యూట్, డాబర్ ఇండియా లిమిటెడ్ తో పాటు సన్ హెర్బల్స్ వంటి దేశంలోని అనేక కంపెనీలు, సంస్థలు ఆయుర్వేద మందుల కోసం క్లినికల్ ట్రయల్స్ నిర్వహిస్తున్నాయి. ఆరోగ్య సంరక్షణ మందుల తయారీలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఆయుష్మాన్ భారత్ , డిజిటల్ హెల్త్ మిషన్ వంటి ప్రభుత్వ కార్యక్రమాలు (గ్రామీణ , పట్టణ ప్రాంతాలలో ఆరోగ్య సంరక్షణ సేవలకు అవకాశాలను పెంచాయి.భారతదేశంలో ఆరోగ్య సంరక్షణ భవిష్యత్తు ఆవిష్కరణ , పరిశోధన ద్వారా వేగంగా మారుతోంది. దేశంలోని టెలిమెడిసిన్ , ఇ-సంజీవని వంటి వేదికలు మారుమూల రోగులకు ప్రత్యేక వైద్య సేవలు అందిస్తున్నాయి. వారి ఆరోగ్యాలను కాపాడుతున్నాయి. సాంకేతిక అభివృద్ధి, కృత్రిమ మేధస్సు, బయోటెక్నాలజీ , డిజిటల్ ఆరోగ్య పరిష్కారాల ద్వారా, దేశ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ సామాన్య ప్రజలకూ అందుబాటులోకి వస్తోంది. తక్కువ ధరల్లోనే ప్రభావవంతమైన వైద్యం అందుతోంది. క్షయ, ఉబకాయ సంబంధిత వ్యాధులను ముందస్తుగా గుర్తించడానికి అనుమతించే ఎక్స్-రేలు , సీటీ స్కాన్లను విశ్లేషించడానికి ఏఐ ని ఉపయోగిస్తున్నారు. టెలిమెడిసిన్‌లో ప్రాక్టో , 1ఎంజి వంటి ప్లాట్‌ఫామ్‌లు గ్రామీణ ప్రాంతాల్లో కూడా మంచి వైద్యులను సంప్రదించగలిగేలా చేస్తున్నాయి. పతంజలి పరిశోధనా సంస్థ (ఖీఖీఏ)లో 500 మందికి పైగా శాస్త్రవేత్తలు ఆయుర్వేదాన్ని ఆధునిక వైద్య శాస్త్రంతో కలిపి పరిశోధనలు చేస్తున్నారు. ఔషధాలను అభివృద్ధి చేస్తున్నారని కంపెనీ చెబుతోంది. పతంజలి టెలిమెడిసిన్ చొరవ , మూలికా ఉత్పత్తులు భారతదేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో తక్కువ ధరకు, ఆ ఆరోగ్య సంరక్షణ సేవలను అందుబాటులోకి తీసుకెళ్తున్నాయని పతంజలి తెలిపింది. పర్యావరణ అనుకూల ఉత్పత్తులు , సేంద్రీయ వ్యవసాయం ఇప్పుడు దేశంలో ట్రెండ్‌గా మారింది. "మా పరిశోధన పెట్టుబడి ఆయుర్వేదాన్ని ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడంలో ముఖ్యమైన పాత్ర పోషించాయి. పతంజలి చేసిన ఈ ప్రయత్నం ఆరోగ్య సంరక్షణ సేవలను మరింత అందుబాటులోకి తీసుకురావడమే కాకుండా, ప్రపంచ వేదికపై భారతదేశ వారసత్వాన్ని ప్రముఖంగా నిలబెడుతోంది." అని పతంజలి తెలిపింది.

================================

# జూలపల్లి లో పలువురికి సన్మానం.

కమాన్ పూర్

పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ మండలం జూలపల్లి గ్రామంలో గొల్ల కురుమలు పలువురిని బుధవారం సన్మానించారు. గత వారం రోజుల నుండి బీరన్న ఉత్సవాలు ఘనంగా నిర్వహించడం జరుగుతుంది ఈ కార్యక్రమంలో భాగంగా జూలపల్లి గ్రామ తాజా, మాజీ సర్పంచ్ బొల్లపల్లి శంకర్ గౌడ్ ని మరియు లైన్స్ క్లబ్ చైర్మన్ సానా రామకృష్ణారెడ్డి ని జూలపల్లిగొల్ల కురుమ సంఘం ఆధ్వర్యంలో సాల్వాతో సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కొమ్ము గోపాల్ , కొమ్ము వెంకన్న, కొమ్ము రాజయ్య, కొమ్ము కొమురయ్య, బండ సాయి శంకర్, కొమ్ము కుమార్,జంగిలికుమార్, మాదాసు మహేష్, నరే పర్వతాలు, బండ రాయలింగు, మారబోయిన ముత్యాలు, కొమ్ము రాయమల్లు,కోహెడ శ్రీనివాస్ మరియు గొల్ల కురుమ సంఘం సభ్యులు అందరు కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

# సెక్యూరిటీ చెక్ పోస్ట్ ను ప్రారంభించిన జియం

భద్రాద్రి కొత్తగూడెం

ఇల్లందు ఏరియా లోని జే.కే.ఓ.సి. ఖమ్మం రోడ్ నందు నూతనంగా ఏర్పాటు చేసిన సెక్యూరిటీ చెక్ పోస్ట్ ను ఏరియా జియం వి.కృష్ణయ్య ముఖ్య అతిధిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోయగూడెం నుండి ఇల్లందు సి.హెచ్.పి కి బొగ్గు రవాణా చేయు టిప్పర్ మరియు బాడిలారీల ను తనిఖీ చేయడంలో భాగంగా సెక్యూరిటీ సిబ్బంది అనుగుణంగా చెక్ పోస్ట్ ను ఏర్పాటు చేయడం జరిగింది అన్నారు అలాగే ఈరోజు నుండి కోయగూడెం నుండి వచ్చే బొగ్గు లారీలు తప్పనిసరిగా ఈ చెక్ పోస్ట్ నందు ఇన్ మరియు అవుట్ ఎంట్రీ చేసుకోవాలని లేనియెడల అట్టి బండిని సిహెచ్ పి నందు అన్లోడ్ చేయబడదని అలాగే కోయగూడెంలో లోడు ఇవ్వబడదని అన్నారు కావున బొగ్గు లారీ డ్రైవర్లు తప్పనిసరిగా ఈ చెక్ పోస్ట్ లో ఎంట్రీ చేయించుకోవాలని లేనియెడల తగు చర్యలు తీసుకోబడతాయని అన్నారు.

ఈకార్యక్రమంలో ఎస్.ఓ.టు జీ.ఎం రామస్వామి, డిజియం (పర్సనల్) జీవి.మోహనరావు, జే.కే.ఓ.సి పి.ఓ. కృష్ణ మోహన్,ఏరియా సెక్యూరిటీ అధికారి వి.అంజిరెడ్డి, రామదాస్,జూనియర్ ఇన్స్పెక్టర్ సంక గుర్తింపు సంఘం పిట్ కార్యదర్శి డి.వెంకటేశ్వర్లు, ప్రతినిధ్య సంఘం పిట్ కార్యదర్శి ఎల్.వీరన్న, ఇతర అధికారులు మరియు ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్జీ -2 ఏరియా లో 219 శాతం బొగ్గు ఉత్పత్తి ... ఏరియా జిఎం బి.వెంకటయ్య

కమాన్ పూర్

ఆర్జీ 2 ఏరియా సంభందించిన ఉత్పత్తి, ఉత్పాదకత ఓవర్ బర్డన్ వెలికితీత మరియు రవాణా వివరాలను తెలియ జేస్తూ ఏరియా జనరల్ మేనేజర్ బి.వెంకటయ్య మీడియా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.

2025-26 ఆర్ధిక సంవత్సరము ఏప్రిల్ మాసానికి సంబంధించి నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలలో 2,28,400 టన్నులకు గాను 4,99,990 టన్నులు (219%) మరియు ఓబీ వెలికితీతలో 55,00,000 క్యూబిక్ మీటర్లగాను 60,41,495 క్యూబిక్ మీటర్లతో 110 % ఓవర్ బర్డన్ వెలికి తీయడం జరిగిందని తెలిపారు. అలాగే ఈ నెలలో ఓసిపి-3 సిహెచ్ పి నుండి 8,95,936 టన్నుల బొగ్గును రవాణా చేయడం జరిగిందని ఏరియా జనరల్ మేనేజర్ బి.వెంకటయ్య తెలిపారు.

రాబోయే వర్షా కాలంలో బొగ్గు ఉత్పత్తికి ఇబ్బంది లేకుండా ఇప్పటి నుండే ప్రణాళికతో ముందుకు వెళ్లడం జరుగుతుందని, ఈ ఆర్థిక సంవత్సరంలో ముందుగానే వార్షిక లక్ష్యాలు సాధించాలనే లక్ష్యంతో ముందుకు వెళ్ళుతున్నట్లు ఏరియా జనరల్ మేనేజర్ బి.వెంకటయ్య తెలిపారు. వేసవి కాలంలో ఉద్యోగుల ఆరోగ్యం కోసం ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఉల్లిగడ్డలు మరియు మజ్జిగ ప్యాకెట్లు అందించడం జరుగుతుందని, ఉద్యోగుల సంక్షేమములో భాగంగా మన సంస్థ చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరాం చొరవతో సెక్టార్ 3 సింగరేణి హై స్కూల్ 8 ఇంక్లైన్ కాలనీ లో సిబిఎస్ఇ సిలబస్ ను అనుమతులు లభించయని, పోతన కాలనీలో కమ్యూనిటీ హాల్, వాకింగ్ ట్రాక్ మరియు గ్రంథాలయం ఏర్పాటు చేయడం జరిగిందని చైర్మన్ చేతుల మీదుగా ప్రారంభించడం జరుగుతుందని వారు తెలిపారు.ఈ సమావేశంలో ఏరియా ఇంజినీర్ నరసింహారావ్, ఎస్ఓ టు జిఎం ఏం.రాముడు, ఏజీఎం వర్క్ షాప్ ఎర్రన్న, డిజిఎం (పర్సనల్) & అధికార ప్రతినిధి ఎస్.అనిల్ కుమార్, డిజిఎం (ఐఈ) మురళీకృష్ణ, డీజీఎం ఫైనాన్స్ వెంకట రామచంద్ర, మరియు మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

# బైక్ వెనుక టైర్లో చున్నీ పడి మెడకు చుట్టేసి యువతి మృతి

విశాఖపట్నం

బైక్ వెనుక టైర్లో చున్నీ పడి మెడకు చుట్టేసి యువతి మృతి చెందింది.తూర్పుగోదావరి జిల్లా కేసనకుర్రుకు చెందిన కళ్యాణపు రామదుర్గ (28)కు మోహన్ కృష్ణ అనే వ్యక్తితో 9 నెలల క్రితం వివాహం జరిగింది. మోహన్ కృష్ణకు ఈ మధ్యే అచ్యుతాపురం సెజ్లో ఉద్యోగం రావడంతో వారి జీవితం మారిపోయిందని ఆనంద పడ్డారు.. కానీ ఇంతలోనే అనుకోని దుర్ఘటన జరిగింది. సోమవారం రాత్రి రామదుర్గకు చెవి నొప్పిగా ఉండటంతో భర్త హాస్పిటల్కు తీసుకెళ్తుండగా, బైక్ వెనుక టైర్లో చున్నీ పడి రామదుర్గ మెడకు చుట్టేసింది. స్థానికులు గమనించి చున్నీని కత్తిరించే సరికి రామదుర్గ కొనఊపిరితో ఉండగా.. హాస్పిటల్కు తరలించే లోపు మృతి చెందింది.

# ప్రతి 4 నెలలకు ఒక కమిషనర్...

## ఇదేం పాలనా... గ్రేటర్ హస్తవ్యస్తం

హైదరాబాద్, ఏప్రిల్ 30,

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్?.దేశంలోనే పెద్ద కార్పొరేషన్లలో ఒకటి. వేలాది కోట్ల రూపాయల బడ్జెట్. కోటి మందికి పైగా జనాభా. అలాంటి కార్పొరేషన్ లో పథకాలు అమలు చేయాలన్నా?ప్రాజెక్టులు టేకప్ చేయాలన్నా..పనులు -ప్రాధాన్యతలు-అవసరాలను బట్టి చేపట్టాలన్నా వాటిపై ఉన్నతాధికారులకు సరైన అవగాహన ఉండాలి.16నెలల్లో నలుగురు కమిషనర్లు?ఇదీ మన జీహెచ్ఎంసీ పరిస్థితి అన్న టాక్ తెలంగాణ రాజకీయవర్గాల్లో విన్పిస్తోంది. హైదరాబాద్ నగరాభివృద్ధికి జీహెచ్ఎంసీ అనేది గుండెకాయ లాంటిది. అలాంటి జీహెచ్ఎంసీలో పట్టుమని 16నెలలు కూడా కాలేదు. అప్పుడే నలుగురు కమిషనర్లు మారారు. దీంతో నగరాభివృద్ధి కొంత కుంటుపడుతోందన్న టాక్ రాజకీయవర్గాల్లో విన్పిస్తోంది. ఎందుకంటే జీహెచ్ఎంసీ 625 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించిన భారీ లోకల్ బాడీ. చావు పుట్టుకల లెక్కల నుండి మొదలుకొని వేలాది కోట్ల రూపాయల ప్రాజెక్టుల టేకప్ వరకు అనేక పనులు సిటిజన్స్ కు చేసి పెట్టాల్సిన సంస్థ.ఇలాంటి ముఖ్యమైన గ్రేటర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పోస్ట్ అంటే అంత ఆషామాషి కాదు. ఉదయం పారిశుద్ధ్యం నుండి మొదలుకొని రాత్రి స్ట్రీట్ లైట్స్ వరకు పనులన్నింటినీ చక్కబెట్టాలి. ఇలాంటి ముఖ్యమైన కార్పొరేషన్ లో అన్ని పనులను అధికారులతో సమన్వయంతో కలిసి ముందుకు తీసుకెళ్లాలి. ఒక్కమాటలో చెప్పాలంటే బల్దియా బాస్..ఆల్ ఇన్ వన్ అని చెప్పాలి. అయితే జీహెచ్ఎంసీకి వస్తున్న అధికారులు ముచ్చటగా మూడు-నాలుగు నెలలు కాకముందే సీటు మారడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.2023 సాధారణ ఎన్నికల కంటే కొద్ది నెలల ముందే జీహెచ్ఎంసీకమిషనర్ గా వచ్చిన రోనాల్డ్ రోస్ ను ఎన్నికలు పూర్తైన తర్వాత ఏడు నెలల్లోనే కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మార్చింది. ఆ స్థానంలో అమ్రపాలి కాటానుగా నియమించింది. రెండు నెలలు ఇంచార్జిగా కొనసాగించి ఆ తర్వాత పూర్తిస్థాయిలో మరో రెండు నెలలు అవకాశం కల్పించింది.అమ్రపాలి కేవలం 4 నెలలు మాత్రమేజీహెచ్ఎంసీ కమిషనర్ గా పనిచేశారు. ఆ తర్వాత ఆమె ఏపీకి వెళ్లిపోవడంతో ఆమె స్థానంలో ఇలంబర్తిని గ్రేటర్ కమిషనర్ గా నియమించింది ప్రభుత్వం. జీహెచ్ఎంసీలో రిపోర్టు చేసే కంటే ముందే జార్ఖండ్ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల కమిషన్ కేటాయించడంతో ఝార్ఖండ్ నుండే నెల రోజులపాటు గ్రేటర్ పరిస్థితిని చక్కబెట్టారు జీహెచ్ఎంసీ కమిషనర్ గా ఉన్న ఇలంబర్తి. 2024 నవంబర్ 14 నుండి పూర్తిస్థాయి బాధ్యతలు తీసుకున్న ఇలంబర్తి..కేవలం 5 నెలల్లోనే మళ్లీ ట్రాన్స్ ఫర్ అయ్యారు. ఇప్పుడు ఇలంబర్తి స్థానంలో ప్రభుత్వం ఆర్ వి కర్ణన్ నుజీహెచ్ఎంసీ నూతన బాస్ గా నియమించింది.జీహెచ్ఎంసీపై పట్టు సాధిస్తున్న తరుణంలో ఈ విధంగా 4నెలలోకోసారి కమిషనర్లను మార్చడంతో పాలన గాడి తప్పుతుందన్న వాదనలు గ్రేటర్లో వినిపిస్తున్నాయి. మొదట్లో రోనాల్డ్ రోస్ జిహెచ్ఎంసిపై పట్టు సాధించి అనేక పనులను వేగంగా కంప్లీట్ చేసే తరుణంలోనే ఆయన ట్రాన్స్ ఫర్ కాగా?తాజాగా ఇలంబర్తి కూడా బదిలీ కావడం చూస్తుంటే బల్దియా పాలన ఏడాది కాలంగా మూడు అడుగులు ముందుకు రెండు అడుగులు వెనక్కి అన్న చందంగా తయారైందిఇటీవల కాలంలో జిహెచ్ఎంసిలోని అనేక అక్రమాలపై ఫోకస్ చేశారు ఇలంబర్తి. ఉన్నతాధికారులందరూ పనుల్లో ఉండేటట్లు ఆయా విభాగాల్లో ఉన్న లోపాలను గుర్తించి వేగంగా సిటిజన్స్ కు సేవలు అందేలా ఆదేశాలు జారీ చేశారు. ఒక్కొక్క విభాగంలోని లోపాలను గుర్తించి వాటిలో జరిగిన అక్రమాలపై విజిలెన్స్ విచారణలు కూడా చేయించారు. ఇంజనీరింగ్ విభాగంలో పలు సర్కిళ్లలో పనులు కాకుండానే బిల్లులు చెల్లించారన్న ఆరోపణలపై విచారణ జరిపించారు.అందులో కొన్ని అంశాల్లో అక్రమాలు జరిగినట్లు గుర్తించిన కమిషనర్..చర్యలకు ఉపక్రమించే తరుణంలోనే తాజాగా ట్రాన్స్ ఫర్ అయ్యారు. బర్త్ అండ్ డెత్..మలేరియా విభాగంలో కూడా విజిలెన్స్ ఎంక్వైరీ చేయించి ప్రాథమికంగా కొన్ని చర్యలు తీసుకున్నారు. ఇక పన్నుల వసూళ్లలోనూ..ఫిర్యాదులు అందడంతో వాటిని కూడా పరిష్కరించి వ్యవస్థను గాడిన పెట్టారు ఇలంబర్తి. అందువల్లే ఈ ఏడాది 2వేల,40 కోట్ల రూపాయల ఆస్తి పన్నును వసూలు చేసి రికార్డును క్రియేటర్ చేసింది జీహెచ్ ఎంసీ.రోనాల్డ్ రోస్, అమ్రపాలి?తాజాగా ఇలంబర్తి..జీహెచ్ ఎంసీ కమిషనర్లుగా పాలనపై ఫోకస్ పెట్టి తమదైన ముద్ర వేసే సమయంలోనే వారిని మార్చి వేస్తుండడం కారణంగా బల్దియా పాలన గాడిన పరిస్థితి లేకుండా పోయింది. అయితే ఇలా వరుసగా కమిషనర్లు మారడం వెనుక ప్రజాప్రతినిధుల హస్తం ఉందన్న చర్చ సాగుతోంది. మరి ఇప్పటివరకు మారిన ముగ్గురు అధికారులు కూడా ముక్కుసూటిగా వ్యవహరిస్తారన్న పేరుంది. జీహెచ్ఎంసి మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు, ఎమ్మెల్యేలు, మంత్రులు?ఇలా ఎవరు చెప్పినా ఎన్ని ఒత్తిళ్లు చేసినా నిబంధనల ప్రకారమే వీరంతా నడుచుకున్నారు.మేయర్ కార్యాలయంలో పనిచేసే రిటైర్డ్ ఉద్యోగుల ఎక్స్ టెన్షన్ విషయంలోనూ?లిమిట్ కు మించి చేసిన బిల్లుల చెల్లింపుల్లోనూ కమిషనర్లందరూ చాలా స్ట్రిక్ట్ గా వ్యవహరించారని బల్దియాలో టాక్. ఇక ఉద్యోగుల ట్రాన్స్ ఫర్స్ విషయంలోనూ?నిబంధనలు పాటించని నిర్మాణాల ఆక్యుపెన్సీవ్ సర్టిఫికెట్ల జారీ చేసే విషయంలోనూ నగర ప్రజా ప్రతినిధుల మాటలు భే ఖాతరు చేశారన్న వాదనలు ఉన్నాయి. మేయర్ కార్యాలయంతో పాటు ప్రజా ప్రతినిధుల విషయంలో కొనసాగిన గ్యాప్ వల్లే కమిషనర్లు మారుతున్నారా అనే అంశానికి బల్దియా ప్రధాన కార్యాలయంలో అవుననే సమాధానం వస్తుందన్న టాక్ విన్పిస్తోంది.అయితే త్వరలోనే జీహెచ్ఎంసీకి ఎన్నికలు జరగబోతున్నాయి. ఇలాంటి సమయంలో ముక్కుసూటిగా ఉండే ఇలంబర్తిని ట్రాన్స్ ఫర్ చేసి.. ఆర్వీ కర్ణన్ ను నూతన కమిషనర్ గా నియమించడం వెనుక ఏదో మర్మం ఉందనే చర్చ జోరుగా సాగుతోంది.

## 117 సవర్ల బంగారం దోచేసిన దుండగులు

## చీరాల, పువ్వాడవారి వీధిలో భారీ చోరీ

చీరాలవువ్వాడ వీధిలో వుంటున్న మువ్వల శివప్రసాదరావు,భార్య పద్మావతి లు మంగళవారం రాత్రి హాస్పిటల్ కు వెళ్ళి తిరిగి వచ్చేలోపు ఇంటిని దొంగలు దోచేశారు. ఆ దంపతులు ఇంటికి తిరిగి రాగానే చోరీ జరిగిందని గుర్తించారు. కప్ బోర్డ్ లోని 117 సవర్ల బంగారం,1,60,000 నగదు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నట్లు వన్టౌన్ సీఐ సుబ్బారావు బుధవారం చెప్పారు.

## హోటల్లో ఘోర అగ్నిప్రమాదం, 14 మంది మృతి

కోల్కొత్తలో ఘోర అగ్నిప్రమాదం జరిగింది. మంగళవారం రాత్రి సెంట్రల్ కోల్కతాలోని ఒక హోటల్లో మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో 14 మంది మృతి చెందారని పలువురు తీవ్రంగా గాయపడ్డారని నగర పోలీస్ కమిషనర్ మనోజ్ కుమార్ వర్మ వెల్లడించారు.చికిత్స కోసం క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించామని చెప్పారు. ఈ ఘటనపై సమాచారం అందగానే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకు వచ్చారన్నారు.

అలాగే సహాయక చర్యలు సైతం వారు చేపట్టారని వివరించారు. హోటల్లో చిక్కుకున్న పలువురిని వారు రక్షించారని తెలిపారు. అయితే ఈ ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదన్నారు. ఈ అగ్ని ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని పేర్కొన్నారు. అందుకోసం ఓ ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు.

## అప్పన్న సన్నిధిలో విషాదం.. ఇబ్బంది లేకుండా దర్శనం

విశాఖపట్నం

సింహాద్రి అప్పన్న చందనోత్సవంలో అపశృతి చోటుచేసున్న విషమయం తెలిసిందే. భారీ వర్షానికి రూ.300 క్యూలైన్ దగ్గర గోడ కూలి 8 మంది భక్తులు మృతి చెందారు. ఈ ఘటనపై స్పందించిన హోం మంత్రి అనిత, కలెక్టర్ హరేంధిర ప్రసాద్, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు సహాయక చర్యలు చేపట్టాయి. ప్రస్తుతం అక్కడ పరిస్థితి అదుపులోకి రావడంతో భక్తులు స్వామివారి దర్శనం చేసుకుంటున్నారు. అధికారులు దగ్గర ఉండి పర్యవేక్షిస్తున్నారు.

## ఆపరేషన్ కగార్ ను నిలిపివేయాలి

యాదాద్రి భువనగిరి

సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో సిపిఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాన్ వెస్లీ మీడియా సమావేశం నిర్వహించారు. , ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రాష్ట్ర కార్యదర్శి జూలకంటి రంగారెడ్డి పాల్గొన్నారు.

జాన్ వెస్లీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరు తో కర్రగుట్టలను చుట్టుముట్టి మావోయిస్టులను, ఆదివాసులను చంపుతున్నారు మావోయిస్టులు చర్చలకు సిద్ధమని లేఖ రాసినానీ కేంద్ర ప్రభుత్వం చర్చలు జరపడం లేదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం మావోయిస్టు లతో శాంతియుతంగా చర్చలు జరపాలి. తెలంగాణ ముఖ్యమంత్రి కి అందాల పోటీలపై ఉన్న శ్రద్ధ ప్రజాసమస్యలను పరిష్కరించడం మీద లేదని అన్నారు.

## అంతరాష్ట్ర మోటార్ సైకిల్ దొంగల ముఠా అరెస్ట్

## జిల్లా యస్పీ శరత్ చంద్ర పవార్

నల్గొండ

గత కొన్ని రోజులుగా వరుసగా తెలంగాణ లోని దామరచర్ల, నల్గొండ పట్టణం, నార్కట్పల్లి, ఇబ్రహీంపట్నంమరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మార్టూర్, పొన్నూరుపట్టణాలలో రాత్రి సమయంలో ఇంటి ముందు పార్క్ చేసి ఉన్న మోటార్ సైకిల్ల దొంగతనాలకు పాల్పడుతున్న ముఠా ను నల్గొండ పోలీసులు అరెస్టు చేసారు. నిందితులనుంచి పద్నాలుగు ఖరీదైన మోటార్ సైకిల్ లు స్వాధీనం చేసుకున్నారు.నిందితులు నలమాలయెర్రబ్బాయి ఏ లూథర్, గుంజి అంకమ రావు, మట్టిపల్లి శ్రీకాంత్ లను అరెస్టు చేసి రిమాండ్ కు పంపించారు.

## హత్య కేసులో నిందితుల అరెస్టు

కాకినాడ

ఈనెల 27వ తేదీన కాకినాడలో జరిగిన యువకుడి హత్య చేసిన కేసును కాకినాడ టూటౌన్ పోలీసులు ఛేదించారు.. బుధవారం కాకినాడ డీఎస్పీ కార్యాలయంలో కాకినాడ సబ్ డివిజన్ పోలీస్ అధికారి మనీష్ దేవరాజ్ పాటిల్ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేసు వివరాలను మీడియాకు వివరించారు.. కాకినాడ బ్యాంక్ వీధికి చెందిన మీసాల గౌతమ్ ఆటో డ్రైవర్ గా పనిచేస్తున్నాడు. ఆదివారం ఉదయం ఆటో దగ్గరకు వెళ్తుండగా అతని స్నేహితులైన నలుగురు యువకులు ఆటో డ్రైవర్ ఆపి మద్యం తాగడానికి డబ్బులు ఇవ్వమని అడిగారు లేవని చెప్పడంతో గొడవపడి కాంక్రీట్ సిమెంట్ రాళ్లతో గౌతం ముఖంపై బలంగా కొట్టారు తీవ్రంగా గాయపడిన మృతుడు అదే రోజు మృతి చెందాడని నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టి అరెస్ట్ చేశామని తెలిపారు..××

# మైండ్ గేమ్ లో మావోయిస్టులు

వరంగల్ , ఏప్రిల్ 30

బచావో కర్రెగుట్టల పేరుతో.. భద్రతా బలగాలు దూసుకెళ్లాయి. దాదాపు ఏడు రోజులుగా జల్లెడ పడుతున్నాయి. భారీ సంఖ్యలో మావోయిస్టులు ఉన్నారనే సమాచారంతో సాయుధ బలగాలు ముందుకెళ్లినా.. ఫలితం లేదనే కామెంట్స్ వినిపిస్తున్నాయి. అయితే.. మావోయిస్టులు కావాలనే భద్రతా బలగాలను కర్రెగుట్టల వైపు రప్పించారా.. బలగాల దృష్టి మరల్చి మరో ప్రాంతానికి వెళ్లారా అనే చర్చ జరుగుతోంది. మావోయిస్టులు మరేదో వ్యూహం పన్నారనే చర్చ నడుస్తోంది.రెండు వారాల కిందట మావోయిస్టులు ఓ లేఖను విడుదల చేశారు. తమ రక్షణ కోసం కర్రెగుట్టల్లో బాంబులు అమర్చామని.. ఆదివాసీలు ఇటువైపు రావొద్దని హెచ్చరించారు. ఆ లేఖ కాస్త చర్చనీయాంశంగా మారింది. అయితే.. రాజ్యానికి బలం ఎక్కువ అని తెలిసి.. తాము ఉన్నచోటును మావోయిస్టులు ఎందుకు చెప్తారనే ప్రశ్న ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఆ లేఖ ద్వారా బలగాలను ఇటువైపు రప్పించి.. మావోలు మరో ప్రాంతానికి వెళ్లారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.కర్రెగుట్టల్లో బాంబులు అమర్చినట్టు మావోయిస్టులు ప్రకటన చేసి.. అగ్రనేతలను సేఫ్ ప్లేస్కు తరలించినట్టు ప్రచారం జరుగుతోంది. వ్యూహాత్మకంగానే మావోలు ఈ ప్రకటన చేశారని.. తెలుస్తోంది. ఇతర రాష్ట్రాల్లోని అడవుల్లో కూంబింగ్ చేస్తున్న బలగాలు కూడా ఇక్కడికి రావడంతో.. మావోయిస్టులు వేరే ప్రాంతానికి సులభంగా వెళ్లి ఉంటారనే చర్చ జరుగుతోంది. దీనిపైనా బలగాలు ఆలోచిస్తున్నట్టు సమాచారం.నిజంగా మావోయిస్టులు కర్రెగుట్టల్లో ఉంటే.. బలగాలు డ్రోన్లు, హెలికాప్టర్ల ద్వారా ఆ ప్రాంతాన్ని నిశితంగా పరిశీలించాయి. కానీ.. ఆశించిన స్థాయిలో మావోల కదలికలు గుర్తించలేదు. అంటే అసలు కర్రెగుట్టల్లో వారు లేరనే కామెంట్స్ వినిపిస్తున్నాయి. ఒకవేళ ఉంటే.. ఇన్నిరోజులు కూంబింగ్ జరుగుతున్నా.. వేలాది మంది జవాన్లు జల్లెడ పడుతున్నా.. ఎవ్వరూ ఎందుకు కనిపించరనే ప్రశ్న.. హాట్ టాపిక్గా మారింది.వాస్తవానికి కర్రెగుట్టలు చాలా ఎత్తులో ఉంటాయి. ఒకవేళ నిజంగా మావోయిస్టులు ఆ గుట్టలపై ఉన్నారనుకున్నా.. వారికే అనుకూల పరిస్థితులు ఉంటాయి. బలగాలు కింది నుంచి గుట్టలపైకి ఎక్కాలి. ఈ క్రమంలో కాల్పులు జరిగితే.. ఇరువైలా భారీగా ప్రాణ నష్టం ఉండేది.. అని గతంలో ఆ ప్రాంతంలో పనిచేసిన ఓ రిటైర్డ్ పోలీస్ అధికారి వెల్లడించారు. ఇప్పటికే మావోయిస్టులు ఎత్తైన ప్రాంతంలో ఉంటే.. పైనుంచి కాల్పులు జరపడం ఈజీ అని ఆయన అభిప్రాయపడ్డారు.ప్రస్తుతం ఎండలు మండుతున్నాయి. కర్రెగుట్టల ప్రాంతంలో వడగాలులు బలంగా వీస్తున్నాయి. ఇలాంటి సమయంలో కూంబింగ్ సజావుగా సాగడం లేదని తెలుస్తోంది. ఇప్పటికే చాలామంది జవాన్లు వడదెబ్బకు గురయ్యారు అనే వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో బలగాలు ప్లాన్ మార్చుకున్నట్టు తెలుస్తోంది. ఇలా కూంబింగ్, దాడులు కాకుండా.. బేస్ క్యాంపులు ఏర్పాటు చేస్తే మంచిదనే అభిప్రాయానికి వచ్చినట్టు తెలుస్తోంది.

# ఆపరేషన్ లోకల్ లో కమలం

హైదరాబాద్, ఏప్రిల్ 30, (న్యూస్ పల్స్)

రాజకీయాల్లో ఇప్పటి వరకూ ఓ లెక్క, ఇప్పటి నుంచి మరో లెక్క అంటోంది బీజేపీ. లెక్కలు మారబోతున్నాయని ప్రత్యర్థులకు హెచ్చరిక సైరన్ చేస్తోంది. అధికారం దిశగా సరికొత్త వ్యూహా?లకు పదును పెడుతూ ముందుకు సాగుదాం అంటోంది బిజెపి అదిష్టానం. కేవలం మాటలు మాత్రమే కాదు, ఇప్పటికే ఆ దిశగా వేగంగా అడుగులు వేస్తున్నట్లు సంకేతాలందుతున్నాయి.తెలంగాణలో గతంతో పోల్చితే బీజేపి బాగా బలపడింది. ఒక్కమాటలో చెప్పాలంటే రాష్ట్ర రాజకీయాల్లో అధికార కాంగ్రెస్ తరువాత తామే అంటూ ఆ పార్టీ నేతలు మాంచి జోష్ మీదున్నారు. ప్రభుత్వంపై విమర్శలు, హైదరాబాద్ ఎమ్మెల్సీ ఎన్నిల?లో మతం కార్డు ప్రయోగించడం అందులో భాగమే అంటున్నారు. ఇలా రాష్ట్ర రాజకీయాల్లో బిజెపి నేతలు జోరు పెంచుతున్నారు.తెలంగాణ ఏర్పడిన నాటి నుంచి అధికారం కోసం ఉవ్విల్లూరుతున్న బిజెపి అధిష్టానానికి మాత్రం ఆ కల నెరవేరడం లేదు. కలగానే మిగులుతోంది. గత అసెంబ్లీ ఎన్నికల తరువాత నుంచి బిజెపి లెక్క మారింది. అదృష్టం జస్ట్ ఒక్క అడుగు దూరంలోనే ఉందని నాయకత్వం నమ్ముతోంది. తెలంగాణలో కాషాయ జెండా ఎగరడం ఖాయం, ఈసారి ప్రభుత్వం ఏర్పాటు చేయడం తథ్యం అనే ధీమాలో ఉన్నారు బిజెపి నేతలు.ఈసారి కేవలం మాటలు చెప్పడం కాదు, చేతల్లో చూపించాలని అధిష్టానం సీరియస్గా రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది. ఎన్నికలకు చాలా టైం ఉంది, ఇప్పడే ఎందుకంత తొందర అనుకుని వదిలేస్తే కుదరదు. ఇప్పటి నుంచి జనంలోకి వెళ్లాలి. పార్టీ క్యాడర్ను మరింత బలోపేతం చేసుకోవాలి. బలం, బలగం చేజారకుండా చేయడంతోపాటు బలహీనతలపై అందకంటే ఎక్కువ శ్రద్ధపెట్టాలని కేంద్ర పెద్దలు భావించారు. అందుకే తెలంగాణలో ఇప్పటి నుంచే ఆపరేషన్ లోకల్ మొదలు పెట్టాలని ఆదేశించినట్టు తెలుస్తోంది. ఈ ఆపరేషన్ లోకల్లో భాగంగా తెలంగాణలోని జిల్లాల వారీగా పార్టీ బలాలు, బలహీనతలు గుర్తించే బాధ్యతను కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి అప్పగించినట్లుగా సమాచారం. ముఖ్యంగా ఖమ్మం,వరంగల్ , నల్గండ జిల్లాలపై ప్రత్యేక దృష్టిపెట్టాలని ఫిక్సయ్యారట కేంద్రపెద్దలు. గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఈ జిల్లాలోనే పార్టీ బలహీనంగా ఉందని రాష్ట్ర నాయకత్వంతోపాటు, కేంద్రం సైతం ఓ క్లారిటీకి వచ్చినట్లు తెలుస్తోంది. ఈ మూడు జిల్లాల్లో పార్టీ బలాలు ,బలహీనతలు వెంటనే గుర్తించాలి. స్థానిక సమస్యలపై పోరాటం చేసేందుకు కార్యచరణ రూపొందించాలి. ఇతర పార్టీల నుంచి సమర్ధులైన నాయకులను ఆకర్షించాలి. పార్టీలో చేరికలపై ప్రత్యేక దృష్టిపెట్టి ప్రజాసమస్యలపై ప్రభుత్వాన్ని కదిలించేలా నిరసనలు, ఆందోళనలు చేసేందుకు బిజెపి నేతలు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాల?లో ఇప్పటికే ఏర్పడ్డ బూత్ కమిటీలు, మండల కమిటీలు, జిల్లా కమిటీల ఎన్నికపై మరోసారి క్రాస్ చెక్ చేసేందుకు ఇన్ ఛార్జ్ లను అధిష్టానం నియమించినట్లు తెలుస్తోంది. క్యాడర్ను ఉత్తేజపరిచే కార్యక్రమాలతోపాటు, ఆర్ ఎస్ ఎస్, విహెచ్పీ వంటి సంఘ్ పరివార్ సంస్థలతో కలసి ప్రజాసమస్యలపై పోరాటం చేయడం ద్వారా లోకల్ గా ప్రజల్లోకి వెళ్లాలని భావిస్తోంది. ఇలా ఓ వైపు ఈ జిల్లాలో నిర్మాణాత్మకంగా కార్యకర్తలను తయారు చేసుకోవడంతోపాటు, ప్రభుత్వం చేపట్టే ప్రజావ్యతిరేక విధానాలపై జనాన్ని సంఘటితం చేయడం, వారికి మద్దతుగా పోరాడుతూ బీజేపీ అంటే లోకల్, లోకల్ అంటే బిజెపి అనేలా ఇప్పటి నుంచి ప్రజలకు మరింత దగ్గరవ్వాలని భావిస్తోంది. ఇలా ఆపరేషన్ లోకల్ పై దృష్టిపెట్టడం ద్వారా అధికారం చేతి నుంచి కమలం వశం చేసుకొచ్చనే మాస్టర్ ప్లాన్తో తెలంగాణలో బీజెపి వ్యూహాత్మకంగా దూసుకోపోతోంది.

## వైఎస్ షర్మిల హౌస్ అరెస్ట్

విజయవాడ

రాష్ట్ర కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిలను పోలీసులు గృహ నిర్బంధం చేశారు. మే 2న ప్రధాని మోదీ అమరావతి పర్యటన నేపథ్యంలో ఇవాళ ఉద్దండరాయునిపాలెంలో 2015లో ప్రధాని మోదీ శంకుస్థాపన చేసిన ప్రాంతంలో పర్యటిస్తానని తెలిపారు. ఈ క్రమంలో పోలీసులు అప్రమత్తమై షర్మిలను విజయవాడలోని ఇంట్లో గృహ నిర్బంధం చేశారు. తనను ఎందుకు హౌస్ అరెస్ట్ చేశారు? ఆ కారణమేంటో రాష్ట్ర ప్రజలకు చెప్పాలంటూ షర్మిల ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ సంచలన వ్యాఖ్యలు

తాడేపల్లిగూడెం

పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న తాడేపల్లిగూడెం ఎంఎల్ఏ బొలిశెట్టి శ్రీనివాస్ నియోజక వర్గంలో తనపై వస్తున్న పలు ఆరోపణలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.ఈ సందర్భంగా బొలిశెట్టి మాట్లాడుతూ నాతో ఉన్న కొంతమంది నాయకులు నేను చనిపోవాలని కోరుకుంటున్నారని, నేను ఎన్డీఏ ఎమ్మెల్యే ని, నేను చనిపోతే బై ఎలక్షన్స్ వస్తే కొంతమంది ఎమ్మెల్యే అయిపోవాలని చూస్తున్నారని ఆయన భాదను వ్యక్తం చేశారు. ఎవరు త్యాగాల వల్ల నాకు ఎమ్మెల్యే సీటు రాలేదని మూడు పార్టీలు కలిపి నాకు మ్యాండేడ్ ఇచ్చారని, నేను గెలిచాక తాడేపల్లిగూడెం నియోజకవర్గ ప్రజల కోసం పనిచేస్తున్న అంతే గాని ఏ విధమైన అవినీతికి పాల్పడటం లేదన్నారు.అధికారులను ఇబ్బంది పెట్టి, బెదిరిస్తే సహించేది లేదని అధికారులను కాపాడుకుంటానన్నారు. కూటమి లో ఉంటూ నా వెనకాల ఈ విధమైన కుట్రలు చేయడం తగదని అన్నారు.నాకు పవన్ కళ్యాణ్ మెన్ డేట్ ఇస్తే , తాడేపల్లిగూడెం ప్రజల ఓట్ల వల్ల ఎమ్మెల్యే గా గెలిచాను.అంతేగానీ ఎవరి దయ దక్షిణ్యాల వలన నేను గెలవలేదు.మరో పిఠాపురం చేసేస్తాను అని అంటున్నారు నేనేమీ చేతికి గాజులు తొడుక్కొని కూర్చోలేదు.నేను స్థలాలు, పొలాలు పూడ్చ లేదు, నాకు ఓట్లు వేసిన ప్రజల కోసం నేను పని చేస్తున్నాను.ఏ తెలుగుదేశం పార్టీ కార్యకర్త ను నేను ఇబ్బంది పెట్టలేదు శాసన సభ్యుడిగా నా గౌరవం నాకు ఇవ్వండి అంతేచాలు.ఇకనైనా ఇటువంటి మాటలు మానుకోవాలని బొలిశెట్టు శ్రీనివాస్ అన్నారు

## కర్మయోగి పుస్తకం ఆవిష్కరణ

కాకినాడసీనియర్ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, కైట్ విద్యాసంస్థల గౌరవాధ్యక్షులు యం గోపాలకృష్ణ రాసిన కర్మయోగి పుస్తకాన్ని కాకినాడ జేఎన్టీయూ కళాశాలలో ఆవిష్కరించారు.ఈకార్యక్రమంలో కలెక్టర్ షాన్ మోహన్, కేంద్ర మాజీ మంత్రి ఎంఎం పల్లంరాజు, మేజర్ జనరల్ ప్రసాద్, ప్రొఫెసర్ మురళీకృష్ణ, కైట్ కాలేజ్ చైర్మన్ పోతుల విశ్వం, కైట్ డైరెక్టర్ ఐశ్వర్యలు ఈపుస్తకావిష్కరణలో పాల్గొని పుస్తకాలు చదవడం వల్ల జీవితంలో ఏ విధంగా ఉపయోగపడుతుందో విద్యార్థులకు తెలియజేశారు. అలాగే మాజీ ఐఏఎస్ అధికారి ఎం గోపాలకృష్ణ నాయుడు కాకినాడ ప్రాంతంలో గోదావరి ఎరువులు కర్మాగారాన్ని నిర్మించడానికి ఆయన కీలకపాత్ర వహించారని వక్తలు కొనియాడారు.ఈకార్యక్రమంలో కైట్ విద్యార్థులు,గోదావరి ఎరువుల కర్మాగారం విశ్రాంతి ఉద్యోగులు, వివిధ రాజకీయ నాయకులు యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు...

## మాజీ మంత్రి దేవినేని ఉమా కుమారుడి వివాహ వేడుకకు హాజరైన మంత్రి లోకేష్

విజయవాడమాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత దేవినేని ఉమామహేశ్వరరావు కుమారుడి వివాహ వేడుకకు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ హాజరయ్యారు. కృష్ణా జిల్లా కంకిపాడులోని ఆయానా కన్వెన్షన్ లో జరిగిన ఈ వివాహ మహోత్సవ వేడుకకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా హాజరయ్యారు.

## ధరణి దరఖాస్తులు..భూ భారతిలో పెట్టుకోవాలి

నల్గొండ, ఏప్రిల్ 30

రాష్ట్రంలోని భూములకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం భూ భారతి పోర్టల్‌ను తీసుకొచ్చిన విషయం తెలిసిందే. దీంతో భూ సమస్యలపై ధరణిలో చేసుకున్న అప్లికేషన్లను రిజెక్ట్ అవుతున్నాయి. భూ భారతి పోర్టల్ అందుబాటులోకి రావడం, అలాగే, కొత్త ఆర్వోఆర్ చట్టం అమల్లోకి రావడంతో పాత దరఖాస్తులు తిరస్కరణకు గురవుతున్నాయి.దరఖాస్తుదారులు భూ భారతి పోర్టల్లోనే మళ్లీ అప్లికేషన్ పెట్టుకోవాలని అధికారులు అంటున్నారు. త్వరలోనే తెలంగాణ వ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని, అందులోనూ మాన్యువల్గా దరఖాస్తులు చేసుకోవచ్చని అన్నారు. తెలంగాణలో భూ భారతి పోర్టల్ను తీసుకొచ్చే సమయానికి ధరణిలో 81,000కుపైగా దరఖాస్తులు పెండింగ్లో ఉన్నాయి.ధరణిలోని పెండింగ్ దరఖాస్తులను భూ భారతి పోర్టల్కు బదిలీ చేశారు. భూ భారతి చట్టం తీసుకురావడంతో పాటు తహసీల్దార్, అడిషనల్ కలెక్టర్, ఆర్డీవో, కలెక్టర్ స్థాయుల్లో అధికారాలను వికేంద్రీకరించడంతో చిన్నపాటి సమస్యలలు తహసీల్దార్, ఆర్డీవో స్థాయిలోనే పరిష్కారం అవుతాయి.దీంతో ధరణిలోని పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్లను సర్కారు ఆదేశించింది. అయినప్పకటికీ అధికారులు కారణాలు చెప్పకుండానే పాత దరఖాస్తులను తిరస్కరిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో రిపోర్టు సైతం పెట్టకుండానే తిరస్కరిస్తున్నట్లు తెలుస్తోంది.గతంలో పరిష్కారం కాని తమ భూ సమస్యలు ఇప్పుడైనా పరిష్కారం అవుతాయని చాలామంది రైతులు ఇప్పుడు దరఖాస్తులు చేసుకుంటున్నారు. పెట్టుకుంటున్నారు.

# ఎవ్వరిని గుర్తు పట్టని శ్రీ తేజ

హైదరాబాద్, ఏప్రిల్ 30,

సంధ్య థియేటర్‌లో జరిగిన తొక్కిసలాటలో గాయపడిన శ్రీతేజ్ ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యాడు. పుష్ప 2 సినిమా ప్రీమియర్ షో టైంలో హైదరాబాద్‌లోని సంధ్య థియేటర్‌లో తొక్కిసలాట జరిగింది. ఈ దుర్ఘటనలో ఫ్యామిలీ సినిమా చూడటానికి వెళ్లిన శ్రీతేజ్ ఫ్యామిలీ ఇరుక్కుంది. అక్కడ జరిగిన తొక్కిసలాటలో తల్లి చనిపోయింది. తీవ్ర గాయాలు పాలైన శ్రీతేజ్ అప్పటి నుంచి చికిత్స పొందుతున్నాడు. తాజాగా డిశ్చార్జ్ అయ్యాడు. పుష్ప 2 సినిమా విడుదల సందర్భంగా డిసెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా ప్రీమియర్ షోలు వేశారు. దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన భాస్కర్, తన భార్య రేవతి, కుమారుడు శ్రీతేజ్ సంధ్య థియేటర్‌కు వెళ్లారు. భారీగా జనం రావడం, అదే టైంలో పుష్ప 2 హీరో అల్లు అర్జున్ ఫ్యామిలీతో కలిసి అదే థియేటర్‌కు వచ్చాడు. ఈ క్రమంలో తొక్కిసలాట జరిగింది. థియేటర్‌లో జరిగిన తొక్కిసలాటలో భాస్కర్ భార్య రేవతి, కుమారుడు శ్రీతే చిక్కుకున్నారు. ఈ దుర్ఘటనలో రేవతి స్పాట్‌లోనే ప్రాణాలు కోల్పోగా... కొనఊపిరితో ఉన్న శ్రీతేజ్‌ను ఆసుపత్రిలో చేర్పించారు. తీవ్ర గాయాలు పాలైన శ్రీతేజ్‌ను సికింద్రాబాద్ కిమ్స్‌లో చికిత్స అందించారు. అప్పటి నుంచి వైద్యుల పర్యవేక్షణలో ఉన్న శ్రీతేజ్ చావు అంచు నుంచి సురక్షితంగా బయటపడ్డాడు. ఇప్పుడు ఆరోగ్యం నిలకడగా ఉండటంతో బాలుడిని వైద్యులు డిశ్చార్జ్ చేశారు. శ్రీతేజ్‌ను ఇంకా కొన్ని సమస్యలు వెంటాడుతున్నాయని వైద్యులు చెబుతున్నారు. అందుకే ఆసుపత్రి నుంచి రిహాబిలిటేషన్ సెంటర్‌కు తరలించారు. అక్కడ పదిహేను రోజులు చికిత్స అందిస్తారు. అంటే ఫిజియోథెరపీ చేస్తారు. అనంతరం ఇంటికి పంపిస్తారు.తేజ్ కిమ్స్ లో మొత్తం 4 నెలల 25 రోజులు చికిత్స పొందాడు. దాదాపు 15 రోజుల క్రితం ఇంటెన్సివ్ కేర్ యూనిట్ నుండి తేజ్ ను జనరల్ వార్డుకు తరలించారు. శ్రీతేజ్ పరిస్థితి ఇప్పుడు స్థిరంగా ఉందని, ఇన్ ఫెక్షన్లు లేవని వైద్యులు నిర్ధారించారు. అయితే, ఫిజియోథెరపీ, పునరావాస కేంద్రంలో నిరంతర సంరక్షణను సూచించారు. దాదాపు 15 రోజుల పాటు ఫిజియోథెరపీ పొందిన తర్వాత ఇంటికి తీసుకెళ్లచని పేర్కొన్నారు.శ్రీతేజ్ ప్రస్తుత పరిస్థితి పై ఆయన తండ్రి భాస్కర్ మాట్లాడారు. "తేజ్ కళ్ళు తెరిచాడు. మేము అతనికి ఫీడింగ్ ట్యూబ్ ద్వారా ద్రవ పోషకాహారం అందిస్తున్నాము. అయితే, అతని మెదడు ఇంకా పూర్తిగా కోలుకోలేదు. అతను మనలో ఎవరినీ గుర్తించలేకపోతున్నాడు. ఎక్కువ కాలం ఆసుపత్రిలో ఉండటంతో ఇన్ఫెక్షన్ ప్రమాదం పెరుగుతుందని, పునరావాసం కోలుకోవడానికి సహాయపడుతుందని వైద్యులు సూచించారు. శ్రీతేజ్‌కు జీవితాంతం సంరక్షణ అవసరం" అని భాస్కర్ చెప్పారు.. అయితే తన బిడ్డ ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడని కానీ తమను ఇంకా గుర్తు పట్టడం లేదని అంటున్నారు. తన చెల్లి ఆసుపత్రికి వచ్చి మాట్లాడుతున్నా శ్రీతేజ్ స్పందించడం లేదని వాపోయారు. ఇంకా ఆసుపత్రిలో ఉంటే కొన్ని ఇన్ఫెక్షన్‌లు వచ్చే ప్రమాదం ఉందని వైద్యులు చెప్పారని తెలిపారు. ఫుడ్ తీసుకుంటున్నాడని అందుకే కంగారు పడాల్సిన పని లేదని వైద్యులు చెప్పినట్టు తెలిపారు. ఇప్పటి వరకు ఆసుపత్రి వర్గాలు తమకు డబ్బులు గురించి అడగలేదని డిశ్చార్జ్ టైంలో కూడా ఎలాంటి ఒత్తిడి చేయలేదని అన్నారు

## వెల్ల మందు శతాబ్ది ఉత్సవ వేడుకలు

రామచంద్రపురంరామచంద్రపురం మండలం వెల్ల గ్రామంలో గుండుబోగుల సూర్యారావు కామెర్ల వైద్య నిలయం ( వెల్ల మందు ) శతాబ్ది ఉత్సవ వేడుక పండుగ వాతావరణం లో నిర్వహించారు.

ఈ శతాబ్ది వేడుకకు ముఖ్య అతిధిగా కేంద్ర భారీ పరిశ్రమలు ఉక్కుశాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ హాజరయ్యారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అధ్యక్షతన జరిగిన ఈ వేడుక కు విశిష్ట అతిధిలుగా రాష్ట్ర కార్మిక మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు పాల్గొన్నారు.ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప,మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు తదితరులు హాజరయ్యారు.కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మమాట్లాడుతూ కామెర్ల వ్యాది కి ఇంగ్లిష్ మెడిషన్ అందుబాటులో లేని రోజుల్లో మందు కనుగొని ధనాపేక్ష లేకుండా మందులిచ్చి లక్షలాధి ప్రజల ప్రాణాలను కాపాడిన గుండుబోగుల సూర్యారావు చిరస్మరనీయుడని అన్నారు.పావలా నుంచి ప్రారంభమైన వెల్ల మందు నేడు రూపాయలకే మందునిస్తూ ప్రజల ఆరోగ్యాన్ని సూర్యారావు కుటుంబం కాపాడుతోంది. వెల్లమందు పితామహుడు గుండుబోగుల సూర్యారావు కు పద్మశ్రీ అవార్డు ఇవ్వాలని ప్రధాని నరేంద్ర మోడీ ని కోరుతానని అన్నారు.వెల్ల గ్రామానికి రాష్ట్ర, దేశ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకు వచ్చిన మహానీయుడు గుండుబోగుల సూర్యారావు. ప్రతీ ఆదివారం రాష్ట్రం లోని వివిధ ప్రాంతాలనుంచి వెల్ల గ్రామానికి ఆర్టీసీ ప్రత్యేక బస్ లు నడిపిస్తుందంటే వెల్ల ముందుకు ఉన్న ప్రత్యేకత అర్ధమవుతుంది.

# దోస్త్..కు అంతా సిద్ధం

హైదరాబాద్, ఏప్రిల్ 30,

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న డిగ్రీ కాలేజీల్లో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) నోటిఫికేషన్ ఇంకా వెలువడలేదు. ఇంటర్ ఫలితాలు వచ్చి వారం రోజులు గడుస్తున్నా దోస్త్ షెడ్యూల్‌పై ఎలాంటి ప్రకటన వెలువడలేదు. దీంతో డిగ్రీ ప్రవేశాలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదలపై సందిగ్ధత నెలకొంది. సాధారణంగా ఇంటర్ ఫలితాలు వెలువడిన మరుసటి రోజే డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు దోస్త్ షెడ్యూల్ జారీ చేసేవారు. ఈసారి ఫలితాలు వచ్చి వారం రోజులైనా నోటిఫికేషన్ ఎప్పుడు వెలువడుతుందో ఉన్నత విద్యామండలి చెప్పలేకపోతుంది. ఈసారి రెండు విడతల్లోనే దోస్త్ ద్వారా ప్రవేశాలు నిర్వహించి జూన్ 16 నుంచి తొలి సెమిస్టర్ తరగతులను ప్రారంభించాలని ప్లాన్ చేసింది. ఇంకా దోస్త్ ప్రకటన వెలువడక పోవడంతో అకగమిక్ ఇయర్ ఆలస్యమయ్యే అవకాశం కనిపిస్తుందిఈసారి దోస్త్‌లో బకెట్ విధానాన్ని తొలగించాలని కొద్దిరోజుల క్రితం ఉన్నతవిద్యామండలి కార్యాలయంలో జరిగిన యూనివర్సిటీ వీసీ సమావేశంలో ఏకగ్రీవంగా నిర్ణయించారు. అయితే ఆ నిర్ణయం తీసుకునే అధికారం ఉన్నత విద్యామండలికి గానీ వీసీలకు గానీ లేదు. దీంతో విద్యాశాఖ కస్సున లేచింది. తమకు సమాచారం ఇవ్వకుండా, తమ ఆమోదం లేకుండా ఎలా నిర్ణయం తీసుకుంటారని ప్రశ్నించినట్లు సమాచారం. ఈ క్రమంలోనే పది రోజుల క్రితం వీసీలతో సమావేశం నిర్వహించినా.. ఆ సమావేశానికి సంబంధించి తీర్మానాల కాపీ (మినిట్స్) ఇంతవరకు అందలేదు. దాంతో ఉన్నత విద్యామండలి నోటిఫికేషన్ జారీలో జాప్యం నెలకొంది.ఆంధ్రప్రదేశ్ విద్యా హక్కు చట్టం కింద ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ షెడ్యూల్‌లో మార్పులు చేసినట్లు సమగ్రశిక్షా అభియాన్ ప్రాజెక్టు డైరెక్టర్ బి శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. మొదట ప్రకటించిన షెల్యూల్ ప్రకారం ఏప్రిల్ 28న నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం కావాల్సి ఉండగా దానిని మే 2కు వాయిదా వేశామన్నారు. మే19 వరకు స్వీకరన ఉంటుందని వెల్లడించారు.

# కాళేశ్వరం తప్పంతా బీఆర్ఎస్ ప్రభుత్వానిదే

## కుండబద్దలు కొట్టిన ఎన్ ఎస్ డీఏ నివేదిక

హైదరాబాద్, ఏప్రిల్ 30

కాళేశ్వరం ప్రాజెక్టుపై ఎన్‌డీఎస్ఏ నివేదికను విడుదల చేసింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఆనకట్టలపై అధ్యయనం చేసిన ఎన్డీఎస్ఏ నిపుణుల కమిటీ తుది నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి అందించింది. ఈ మేరకు సీఎస్ శాంతి కుమారికి ఎన్‌డీఎస్ఏ ఛైర్మన్ అనిల్ జైన్ ఇటీవల లేఖ రాశారు. బ్యారేజీల నిర్వహణ లోపాలే ఈ సమస్యలకు కారణమన్నారు. మేడిగడ్డలోని బ్లాక్‌లను పూర్తిస్థాయిలో పరీక్షించాలని నివేదికలో పేర్కొంది. .

మేడిగడ్డ బ్యారేజ్ ఘటన

2023 అక్టోబర్ 21 – మేడిగడ్డ బ్యారేజీలోని 7వ బ్లాక్ 20 నంబర్ పిల్లరు కుంగిపోయింది.

2023 అక్టోబర్ 22 – కాళేశ్వరం చీఫ్ ఇంజినీర్, సీడీఓలు బ్యారేజీ కుంగిన ప్రాంతాన్ని పరిశీలించి దీనిపై రాష్ట్ర ప్రభుత్వానికి ప్రాథమిక నివేదిక అందించింది.

2023 అక్టోబర్ 25 – నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నిపుణుల బృందం ఇంజినీరింగ్ చీఫ్, ఎల్ అండ్ టీ బ్యారేజీ నిర్మాణ సంస్థ ప్రతినిధులు బ్యారేజీ కుందిన ప్రాంతాన్ని పరిశీలించారు. అక్టోర్ 28వ తేదీన రామగుండం ఈఎన్సీ ఎన్డీఎస్ఏ బృందానికి బ్యారేజీ వివరాలు అందించారు.

2023 నవంబర్ 1న – నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నిపుణులు మేడిగడ్డ బ్యారేజీ కుంగడానికి కారణాలతో నివేదికను రూపొందించింది. నవంబర్ 4న తెలంగాణ ప్రభుత్వానికి సమర్పించింది.

2024 ఫిబ్రవరి 13న మేడిగడ్డ బ్యారేజీ కుంగిన నేపథ్యంలో మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం, బ్యారేజీలను పరిశీలించి సమగ్ర నివేదిక అందించాలని రాష్ట్రప్రభుత్వం ఎన్డీఎస్ఏను కోరింది. కాళేశ్వరం మూడు బ్యారేజీలను పరిశీలించేందుకు ఎన్డీఎస్ఏ ఏడుగురు నిపుణులతో కమిటీ ఏర్పాటు చేసింది.

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవకతవకలపై న్యాయ విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు మాజీ జడ్జి జస్టిస్ పినాకి చంద్రఘోష్ ను తెలంగాణ ప్రభుత్వం నియమించింది.

ఏప్రిల్ 24, 2025న ఎన్డీఎస్ఏ కాళేశ్వరం ప్రాజెక్టుపై తుది నివేదిక సమర్పించింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లపై అధ్యయనం చేసిన నిపుణుల కమిటీ...ప్రజాధనంతో నాణ్యత లేకుండా బ్యారేజీలను నిర్మించి ఘోరవైన మానవ నిర్మిత విపత్తును సృష్టించారని నివేదిక పేర్కొంది. బ్యారేజీ నిర్మాణంలో వైఫల్యం, క్వాలిటీ కంట్రోల్ లేకపోవడం, బ్యారేజీల ఆపరేషన్, మెయింటెనెన్స్ వైఫల్యాలను ఎన్డీఎస్ఏ కమిటీ ఎత్తి చూపించింది.ఎన్‌డీఎస్ఏ నివేదికపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మంగళవారం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వ కక్కుర్తి వల్ల రాష్ట్రానికి చాలా నష్టం జరిగిందని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో తీవ్రమైన లోపాలు ఉన్నట్లు ఎన్‌డీఎస్ఏ నివేదిక ఇచ్చిందన్నారు. ఈ నివేదిక ఇచ్చిన తర్వాత కూడా బీఆర్ఎస్ నేతలు సిగ్గుపడటం లేదని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి విమర్శించారు.ఎక్కువ కమిషన్ల కోసం కక్కుర్తి పడి బీఆర్ఎస్ నేతలు కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టారని ఆరోపించారు. కమిషన్ల కోసమే కాళేశ్వరం ప్రాజెక్టు డీపీఆర్ అంచనాను భారీగా పెంచుకుంటూ పోయారని మండిపడ్డారు. రూ.80 వేల కోట్లకు అనుమతులు తీసుకుంటే, ఇప్పటికే రూ.లక్ష కోట్లు దాటిపోయిందని తెలిపారు.వివిధ పేర్లతో కార్పొరేషన్లు ఏర్పాటు చేసి రుణాలు తెచ్చారు. అధికశాతం వడ్డీకి స్వల్పకాలిక రుణాలు తీసుకుని బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టు నిర్మాణం చేపట్టింది. ప్రాజెక్టు బీఆర్ఎస్ హయాంలోనే కూలిపోయింది. పార్లమెంట్ చట్టం ద్వారా ఏర్పడిన ఎన్‌డీఎస్ఏపై బీఆర్ఎస్ నేతలు చౌకబారు విమర్శలు చేస్తున్నారు" – మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

ఉత్తమ్ మాటలన్నీ అబద్దాలే

కాళేశ్వరం ప్రాజెక్టుపై ఎన్డీఎస్ఏ నివేదిక మీద మంత్రి ఉత్తమ్ మాటలన్నీ అబద్ధాలేనని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. మేడిగడ్డలో అవినీతి జరిగిందని ఎన్డీఎస్ఏ నివేదికలో ఎక్కడా చెప్పలేదన్నారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభపై చర్చ జరుగుంతోందనే అక్కసుతో ప్రజల దృష్టి మళ్లించేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తుందన్నారు. ఎన్డీఎస్ఏ ఎన్డీయే ప్రభుత్వ జేబు సంస్థగా మారిందని హరీశ్‌రావు విమర్శించారు.

## గ్రూప్-1 టీజీపీఎస్సీ సింగిల్ బెంచ్ ఉత్తర్వులను రద్దుకు నిరాకరించిన సీజే ధర్మాసనం

హైదరాబాద్ ఏప్రిల్ 30లగ్రూప్-1 టీజీపీఎస్సీ దాఖలు చేసిన అప్పీలు పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు బుధవారం విచారణ జరిపింది. సింగిల్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని టీజీపీఎస్సీ కోరింది. అయితే, సింగిల్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేసేందుకు సీజే ధర్మాసనం నిరాకరించింది. ఇవాళ సింగిల్ బెంచ్‌లో విచారణ జరుగనున్నందున జోక్యం చేసుకోలేమని ధర్మాసనం స్పష్టం చేసింది. సింగిల్ బెంచ్‌లోనే పిటిషన్లపై తేల్చుకోవాలని ధర్మాసనం తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు సూచించింది. గ్రూప్-1 మెయిన్స్ మూల్యాంకనంలో అక్రమాలు జరిగాయంటూ పలువురు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే.పరీక్షా కేంద్రాల కేటాయింపులోనూ నిబంధనలు పాటించలేదంటూ అభ్యర్థులు ఆరోపించారు. రీకౌంటింగ్‌లో మార్కులు, టీజీపీఎస్సీ జారీ చేసిన మెమో మార్కులకు తేడాలున్నాయని పిటిషన్లు హైకోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ఈ పిటిషన్లను విచారించిన సింగిల్ బెంచ్ ధర్మాసనం ఈ నెల 17న మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

# కమలం, గులాబీ కలిసి పనిచేస్తాయా

## మరిన్ని ఆయుధాలు ఇచ్చిన కేసీఆర్

వరంగల్, ఏప్రిల్ 30

బీఆర్ఎస్ ఆవిర్భవించి 25 ఏండ్లయిన సందర్భంగా హన్మకొండ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించిన భారీ బహిరంగ సభ జనసమూహంగా విజయవంతమయినా, వేదిక నుండి పార్టీ శ్రేణులకు సరైన సందేశం ఇవ్వకుండా దశ దిశ లేని సభగా ముగిసింది. సభలో ఏకైక వక్త అయిన పార్టీ చీఫ్ కేసీఆర్ నుండి రావాల్సిన పంచ్‌లు రాలేదు. ఆయన హావభావాల్లో కూడా మునుపటి వేడి కనిపించలేదు. ఇటు కాంగ్రెస్, అటు బీజేపీపై సమాన స్థాయిలో విమర్శల వాన కురిపిస్తారని భావించినా తేడా కనిపించింది. పార్టీ నేతలకు, కార్యకర్తలకు ఎజెండా నిర్ణయిస్తారనుకున్నా బీఆర్ఎస్‌లో ఆ ఉత్సాహం ఎక్కడా కనిపించ లేదు.ఎల్కతుర్తి సమావేశం కోసం బీఆర్ఎస్ శ్రేణులు రాష్ట్ర వ్యాప్తంగా గ్రామగ్రామల నుండి ఎంతో ఉత్సాహంగా తరలి వచ్చారనడంలో ఎలాంటి సందేహాలు లేవు. పెద్దఎత్తున జనప్రవాహం ఉన్నా సభ వేదికపై కేసీఆర్‌లో తడబాటు కనిపించింది. సభకు వచ్చిన జనాలను చూస్తుంటే ఏడాదిన్నర కాంగ్రెస్‌పై ప్రజల ఆగ్రహం కనిపిస్తుందని ఆయన చేసిన వ్యాఖ్యల్లో కొత్తదనం ఏమీ లేదు. కేసీఆర్ సభలకు పెద్ద ఎత్తున జనాలు రావడం కొత్తేమీ కాదు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల సమయంలో కూడా బీఆర్ఎస్ సభలకు భారీగా ప్రజలొచ్చినా ప్రతికూల ఫలితాలు వచ్చాయనేది మరవకూడదు. జనాలు రావడం ఒకెత్తయితే, దాన్ని అనుకూలంగా మల్చుకోవడం మరో ఎత్తు.రాష్ట్రంలో పదిహేను నెలల కాంగ్రెస్ పాలనపై ప్రజా వ్యతిరేకత ఏర్పడిందని కేసీఆర్‌తో పాటు బీఆర్ఎస్ శ్రేణులు కూడా భావిస్తున్నా, ఆ వ్యతిరేకత బీఆర్ఎస్‌కు సానుకూలంగా మారుతుందా అనే దానిపై అంచనాలు తప్పే అవకాశాలున్నాయి. అసెంబ్లీ ఎన్నికల అనంతరం లోక్‌సభ ఎన్నికల్లో, ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఉనికే లేకుండా ఆ స్థానాన్ని బీజేపీ భర్తీ చేస్తుందని ఫలితాలే నిరూపిస్తున్నాయి.బీఆర్ఎస్‌కు ఒక వైపు కాంగ్రెస్ నుండి మరో వైపు బీజేపీ నుండి గట్టి సవాళ్లు ఎదురవుతున్నాయి. ఈ దశలో ఎల్కతుర్తి సభలో కాంగ్రెస్‌ను పెద్ద ఎత్తున విమర్శించిన కేసీఆర్ బీజేపీపై కేవలం రెండే నిమిషాలు మాట్లాడడం ఆశ్చర్యకరం. బీఆర్ఎస్‌కు బీజేపీ నుంచి కూడా గట్టి పోటీ ఎదురవుతున్నా ఆయన ఆ పార్టీని అంతగా పట్టించుకోకపోవడంతో పలు సందేహాలకు తావిస్తున్నాయి.బీజేపీ, బీఆర్ఎస్ ఒకటే అని ఇప్పటికే విమర్శిస్తున్న వారికి కేసీఆర్ తీరు మరిన్ని ఆయుధాలు అందించినట్టు ఉంది. పదకొండేళ్ల బీజేపీ పాలనలో తెలంగాణకు పదకొండు రూపాయలు కూడా ఇవ్వలేదని విమర్శించిన కేసీఆర్ బీజేపీని ఎందుకు తీవ్రంగా తూర్పారపట్టలేదు..? ఈ పదకొండేళ్లలో కేసీఆర్ పదేళ్ల పాలనలో పలుమార్లు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి కీలకాంశాల్లో బేషరుతగా మద్దతిచ్చారనేది వాస్తవం.పలుమార్లు బీజేపీ చేతిలో భంగపడ్డ కేసీఆర్ బహిరంగ సభలో కఠినంగా ఎందుకు వ్యవహరించలేదు. మావోయిస్టుల ఏరివేతలో భాగంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేపట్టిన కగార్ ఆపరేషన్ అంశాన్ని మాత్రమే సభలో ప్రస్తావించిన కేసీఆర్ వక్ఫ్ సవరణ చట్టంపై నోరు మెదపలేదు. కగార్ ఆపరేషన్ కూడా వామపక్షభావ సానుభూతిపరులను ఆకట్టుకోవడంలో భాగంగానే ప్రస్తావించారు. మొత్తం మీద బీజేపీపై కేసీఆర్ మెతకవైఖరి చూస్తుంటే రాజకీయాల్లో ఏమైనా జరగవచ్చనేది మరోసారి నిజం కావచ్చు.తెలంగాణ అస్తిత్వానికి బీఆర్ఎసే మారు పేరని చెప్పుకునే కేసీఆర్ దీనికి సంబంధించి సభల్లో కీలకాంశాలను ప్రస్తావించలేదు. తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమాలకు సంబంధించి పాత విషయాలను కేసీఆర్ మళ్లీ వల్లె వేశారు. రాష్ట్రం ఆవిర్భావం తర్వాత రెండు పర్యాయాలు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ మళ్లీ ఉద్యమాల విషయాలను ప్రస్తావిస్తే ప్రజల్లో సానుకూలత వచ్చే అవకాశాలు తక్కువే.రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చాక తెలంగాణ అస్తిత్వానికి సంబంధించి పరిణామాలు సంభవించినా కేసీఆర్ సభలో వాటి ప్రస్తావనే తేలేదు. సభలో 'జననీ జన్మభూమిశ్చ' అని కేసీఆర్ చెప్పినా తెలంగాణ తల్లి విగ్రహం మార్చడంపై, తెలంగాణ గేయంపై ఆయన సభాముఖంగా స్పందిస్తారని పార్టీ శ్రేణులు ఆశించినా నిరుత్సాహమే ఎదురైంది.కృష్ణా జలాలపై పక్క రాష్ట్రం ఏపీతో ఉన్న వివాదాలపై కేటీఆర్, హరీశ్‌రావు పలు మార్లు విమర్శలు చేసినా కేసీఆర్ నామమాత్రంగానే ప్రస్తావించారు. జలాలపై పూర్తి అవగాహన ఉన్న కేసీఆర్ కృష్ణా జలాలపై లోతుగా ప్రసంగిస్తారని ఆశించినా అలా జరగలేదు.రజతోత్సవ సభ కాబట్టి ఉద్యమ పార్టీ అయిన టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌ను ఎందుకు మార్చాల్సి వచ్చిందో కేసీఆర్ ప్రస్తావించాల్సింది. 'అబ్ కీ బార్ కిసాన్ సర్కార్' నినాదంతో జాతీయ రాజకీయాల్లో సత్తా చాటాలని తలచి భంగపడిన కేసీఆర్ జాతీయ నేతలకు కూడా దూరమయ్యారని ఈ సభ నిరూపించింది. గతంలో జాతీయ నాయకులను పలు సభలకు ఆహ్వానించిన కేసీఆర్ పార్టీ రజతోత్సవ సభకు ఏ జాతీయ నాయకుడిని పిలవకపోడమే నిదర్శనం.కాంగ్రెస్ సర్కార్ బీఆర్ఎస్ నేతలపై పలు కేసులు చేయడంతో పాటు, కాళేశ్వరం, విద్యుత్ కొనుగోళ్లపై ఎంక్వైరీ కమిషన్లు వేసింది. ఈ కేసులను కేసీఆర్ సభలో తిప్పి కొడుతారనుకున్నా ప్రస్తావించలేదు. తనును బీజేపీ ప్రభుత్వం అన్యాయంగా లిక్కర్ స్కాంలో ఇరికించిందని కవిత పలు మార్లు చెప్పినా కేసీఆర్ సభలో దాన్ని ఊసే ఎత్తలేదు.కాంగ్రెస్ అధికారం చేపట్టాక కులగణన, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ వంటి కీలక పరిణామాలు జరిగిన కేసీఆర్ సభలో వాటిపై ఎలాంటి ప్రస్తావన తేలేదు. కులగణన లెక్కలు తప్పంటూ హరీశ్‌రావు, కేటీఆర్ పెద్దఎత్తున విమర్శిస్తున్న తరుణంలో పార్టీ పెద్దగా స్పందించాల్సిన కేసీఆర్ దీన్ని విస్మయించారు. గతంలో తాము అమలు చేసిన పథకాల గురించి చెప్పిన కేసీఆర్ అదే సందర్భంలో కాంగ్రెస్ పార్టీ విఫలమైన అంశాలను గణాంకాలతో ప్రస్తావించి ఉంటే పార్టీ ప్రజలకు గట్టి సందేశం వెళ్లి ఉండేది.

కేసీఆర్‌ది ఆకట్టుకునే వాక్చాతుర్యం అనడంలో ఎలాంటి సందేహాలు లేవు. అయితే ఈ సభలో ఆయన ప్రజలకు దూరమయ్యారా అనిపించింది. అనర్గళంగా మాట్లాడే కేసీఆర్ కాగితం చూస్తూ మాట్లాడడం కొత్తదనమే. ఎన్నికల అనంతరం ఒకటి రెండు సార్లు మాత్రమే కేసీఆర్ బయటకు వచ్చిన సందర్భాలు ఉండడంతోనే ఆయన రాసుకొని మాట్లాడాల్సి వచ్చింది.అసెంబ్లీకి రావడంపై కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు విడ్డూరంగా ఉన్నాయి. మా పిల్లలు అడిగే ప్రశ్నలకే సమాధానం చెప్పలేని కాంగ్రెస్ ప్రభుత్వం నేను రావాలని అంటుందా అని కేసీఆర్ ఎదురు ప్రశ్నించడం ఆశ్చర్యకరం.ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాలు ప్రశ్నించడం, ప్రభుత్వం సమాధానం చెప్పడం ఒక భాగం. ఇందులో పిల్లలు పెద్దలు తేడా ఉండదు. అలా అనుకుంటే సభలో ప్రతిపక్ష నాయకుడి బాధ్యతలు ఆ పిల్లల్లోనే ఎవరికో ఒకరికి ఇవ్వచ్చు కదా!రజతోత్సవ భారీ సభతో పార్టీలోని అభిప్రాయభేదాలకు విరామం పడుతుందని ఆశించిన పార్టీ సానుభూతిపరులకు ఆశాభంగం కలిగింది. సభ ఏర్పాట్లపై మొదట్లో హరీశ్‌రావుకు ప్రాధాన్యతిచ్చినట్టు కనిపించినా సభలో హరీశ్‌రావును పక్కనపెట్టినట్టే ఉందని పార్టీ కేడర్ బలంగా విశ్వసిస్తుంది. ఎన్నడూ లేని విధంగా సభా ప్రాంగణంలో హరీశ్ రావు ఫొటో లేకుండా కేసీఆర్, కేటీఆర్ ఫొటోలతోనే ఫ్లెక్సీలు దర్శనమివ్వడం ఇందుకు ఊతమిస్తుంది.వివిధ కారణాలతో కేసీఆర్ క్రియాశీలకంగా లేకపోవడంతో పార్టీలో ఆధిపత్య పోరు పెరిగి కేటీఆర్, హరీశ్‌రావు, కవితల మధ్య మూడు ముక్కలాట సాగుతుందనేది బహిరంగ రహస్యమే. ఎల్కతుర్తి సభావేదికగా కేసీఆర్ దీనిపై పరోక్షంగానో, ప్రత్యక్షంగానో స్పందించుంటే పార్టీ శ్రేణులకు మార్గదర్శకంగా ఉండేది. రాబోయే రోజుల్లో తాను క్రియాశీలకంగా పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనబోతున్నట్టు ఆయన ప్రకటించుంటే పార్టీలో మూడు ముక్కలాటలకు తెరపడేది.బహిరంగ సభ సన్నాహక సమావేశాల్లో హరీశ్‌రావుకు కీలక బాధ్యతలు అప్పగించినట్టు అనిపించినా సభకు వచ్చేసరికి ఆయనను పూర్తిగా పక్కన బెట్టారనే అభిప్రాయం పార్టీ కార్యకర్తల్లో కలిగింది. సభ వేళ దగ్గరపడుతున్న కొద్దీ వ్యూహాత్మకంగా హరీశ్‌రావును దూరం చేశారు. అదే సమయంలో కేటీఆర్‌కు ఇస్తున్నట్టు భావం కలగకుండా కేసీఆరే పర్యవేక్షించారు. చివరికి సభ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పోస్టర్లలో కేసీఆర్‌తోపాటు, కేటీఆర్ ఫొటోలు ఏర్పాటు చేసి కేటీఆర్‌కు ఇస్తున్న ప్రాధాన్యతను చెప్పకనే చెప్పారు. దీంతో పార్టీలో హరీశ్‌రావుకు తీవ్ర అన్యాయం జరుగుతుందనే భావన పార్టీ వర్గాల్లో వ్యక్తమవ్వడం పార్టీలో ఇంటి పోరు పెంచడం ఖాయం.ఎన్నికలే డీఎన్ఏగా ఉన్న బీఆర్ఎస్ పార్టీ గతంలో ఎన్నికలంటే ఉరకలేసేది. ఇప్పుడు ఎన్నికలంటేనే వెనకడుగేస్తుంది. గతంలో పలు ఉప ఎన్నికలతో సత్తా చాటిన ఉద్యమ పార్టీ అసెంబ్లీ ఎన్నికల అనంతరం పలు ఎన్నికలకు దూరమవడం స్వయంకృతాపరాధం. అసెంబ్లీ ఎన్నికల పరాజయం షాక్ నుండి తేరుకోలేక లోక్‌సభ ఎన్నికల్లో నష్టపోయింది.అనంతరం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయకుండా కేసీఆర్ పార్టీ కేడర్‌కు తప్పుడు సందేశమిచ్చారు.

# వరి పంట కొనుగోలు వేగవంతం చేయాలి: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



ములుగు జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 30 (భారత శక్తి) : తాలు, తరుగు పేరిట కోతలు లేకుండా యాసంగి వరి పంట కొనుగోలును వేగవంతం చేయాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తెలిపారు.బుధవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, పౌర సరఫరాల శాఖ కమీషనర్ డి.ఎస్. చౌహాన్ ధాన్యం కొనుగోలుపై జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించ సమావేశాన్ని నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ములుగుజిల్లా కలెక్టర్ దివాకర టి. ఎస్., అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు తో కలిసి కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి పాల్గొన్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో యాసంగి పంట 2024-25 సంవత్సరంలో 54 లక్షల 89 వేల ఎకరాలలో సాగు జరిగిందని, 137.10 ఎల్.ఎం.టి. ధాన్యం ఉత్పత్తి అవుతుందని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా దాదాపు 70.13 ఎల్.ఎం.టి. ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంటుందని అన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 2.55 లక్షల రైతుల నుంచి 19.60 ఎల్.ఎం.టి. ధాన్యం కొనుగోలు చేశామని అన్నారు. మే నెలలో కొనుగోలు కేంద్రాలకు అధికంగా ధాన్యం రానున్న నేపథ్యంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. అకాల వర్షాలు కారణంగా రైతులు నష్టపోకుండా నాణ్యమైన ధాన్యాన్ని వేగవంతంగా కొనుగోలు చేయాలని మంత్రి సూచించారు. రానున్న 15 నుంచి 20 రోజుల పాటు సజావుగా ధాన్యం కొనుగోలు చేయడం ప్రభుత్వ అత్యంత ప్రాధాన్యత అంశమని అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద ఎటువంటి లోటుపాట్లు ఉండటానికి వీలులేదని అన్నారు. రైస్ మిల్లులకు బ్యాంక్ గ్యారెంటీ అడిగామని, ఏ అంశంలో మినహాయింపులు ఇవ్వడం కుదరదని మంత్రి పేర్కొన్నారు. రైస్ మిల్లర్లతో కలెక్టర్, ఉన్నతాధికారులు చర్చించాలని, జిల్లాలలో అవసరమైతే ఇంటర్మీడియట్ గోదాములకు కొనుగోలు చేసిన ధాన్యాన్ని తరలించాలని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 10 లక్షల మెట్రిక్ టన్నుల ఇంటర్మీడియట్ గోదాముల కేటాయింపు జిల్లాల వారీగా అవసరం బట్టి మంజూరు చేయాలని మంత్రి పౌర సరఫరాల శాఖ ఉన్నతాధికారులకు సూచించారు. ప్రభుత్వానికి ఆర్థికంగా ఇబ్బంది ఉన్నప్పటికీ రైతులకు సమస్య రాకుండా చూసుకోవాలని అన్నారు. ధాన్యం కొనుగోలుపై వివిధ రాజకీయ పక్షాలు, పత్రికలు, సామాజిక మాధ్యమాల ద్వారా చేస్తున్న దుష్ప్రచారాన్ని అధికారులు తిప్పి కొట్టాలని, ఎక్కడైనా నిజంగానే ఇబ్బందులు ఉంటే వాటిని సత్వరమే పరిష్కరించాలని మంత్రి సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు మాట్లాడుతూ, హెచ్ఎంటి, ఆర్ఎన్ఆర్, 1638 రకాల ధాన్యంలో నూకలు అధికంగా వస్తాయనే కారణంతో మిల్లర్లు తిరస్కరిస్తున్నట్లు గమనించడం జరిగిందని అన్నారు. రైస్ మిల్లు వద్ద క్వింటాల్ కు 5 కేజీలు తరుగు తీస్తున్నట్లు రైతులు ఆందోళన చెందుతున్నారని, కొనుగోలు కేంద్రాలలో గన్ని బ్యాగుల కొరత కూడా కొంత ఉందని అన్నారు. రాబోయే యాసంగి సీజన్ లో నూకలు అధికంగా వచ్చే వడ్ల విత్తనాలను పంట వేయకుండా రైతులలో అవగాహన కల్పించాలని మంత్రి అన్నారు.వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న పౌరసరఫరాల శాఖ కమీషనర్ డిఎస్ చౌహాన్ మాట్లాడుతూ, జిల్లాలో ఉన్న రైస్ మిల్లర్లు నిబంధనలు ప్రకారంనడుచుకునేలా కలెక్టర్లు పకడ్బందీగా పర్యవేక్షించాలని అన్నారు. ధాన్యం రవాణాకు వాహనాల ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవా లని, రైస్ మిల్లుల వద్ద ధాన్యం బస్తాలు అన్ లోడింగ్ ఆలస్యం కాకుండా చూడాలని, హమాలీల కొరత ఉండకుండా జాగ్రత్త పడాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్దకు పెద్ద ఎత్తున ధాన్యం వస్తున్నప్పటికీ వేగవంతంగా కొనుగోలు చేయడంలో కొంత ఆలస్యం జరుగుతుందని, వీటిని సంపూర్ణంగా నివారించాలని అన్నారు. ధాన్యం కొనుగోలు అంశంపై జిల్లా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించి ప్రత్యేకంగా మానిటర్ చేయాలని అన్నారు. రైస్ మిల్లర్లు తాలు, తరుగు పేరు మీద ఎటువంటి కోతలు లేకుండా జాగ్రత్తలు పాటించాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద గన్ని బ్యాగులు ఉండాలని రైతులకు నేరుగా ఇవ్వవద్దని, మనం కొనుగోలు చేసిన ధాన్యంనింపేందుకు మాత్రమే వినియోగించాలని అన్నారు. ఈ సమావేశంలో డిఎం సివిల్ సప్లయిస్ రా%శీ%పతి, డిసిఓ సర్దార్ సింగ్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# త్వరలో గ్రామాల్లో రెవెన్యూ సమావేశాలు

## -భూభారతి'తో నిర్ణీత గడువు లోపు భూ సమస్యలు పరిష్కారం
## -రైతులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు
## -వ్యక్తికి ఆధార్ భూమికి భూదార్
## -జియో కోఆర్డినేషన్ తో భూ పటం, సరైన సరిహద్దులు
## -ఉచిత న్యాయ సేవలు: కలెక్టర్ క్రాంతి వల్లూరు





సంగారెడ్డి,భారత శక్తి ప్రతినిధి, ఏప్రిల్ 30:నిర్ణీత గడువు లోపు భూ సమస్యల పరిష్కారానికి భూభారతి చట్టం దోహదపడుతుందని కలెక్టర్ క్రాంతి వల్లూరు సూచించారు.భూమి హక్కుల రికార్డులలో ఏవైనా లోటుపాట్లు, తప్పులు ఉంటే వాటిని సవరించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఈ నూతన ఆర్.ఓ.ఆర్ -2025 చట్టం వెసులుబాటు కల్పిస్తుందని అన్నారు.గుమ్మడిదల ,జిన్నారం మండల కేంద్రాలలో భూభారతి చట్టంపై బుధవారం రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టర్ ఈ కొత్త చట్టం వల్ల రైతులకు, ప్రజలకు చేకూరే ప్రయోజనాలు, చట్టంలో పొందుపర్చిన కీలక అంశాల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ ధరణి రికార్డులను భూ భారతిలో నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. ఎవరికైనా భూముల రికార్డుల విషయంలో తప్పులు ఉంటే, ఈ చట్టం అమలులోకి వచ్చిన ఏడాది కాలం లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అధికారులు గ్రామాలకు వచ్చి అర్జీలు స్వీకరిస్తారని అన్నారు. ఈ అర్జీలను పరిశీలించి నిబంధనలకు అనుగుణంగా తప్పులను సవరిస్తారని, ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే అప్పీలు చేసుకోవచ్చని తెలిపారు. మొదటి అంచెలో ఆర్డీఓ అప్పీలును పరిశీలించి తగు నిర్ణయం తీసుకుంటారని, అయినా సంతృప్తి చెందకపోతే కలెక్టర్ కు అప్పీల్ చేసుకోవచ్చని, ల్యాండ్ ట్రిబ్యునల్ ను కూడా అప్పీలు చేసుకునేందుకు భూభారతి చట్టం అవకాశం కల్పిస్తుందని వివరించారు. అప్పీలు చేసుకున్న సన్న చిన్నకారు, పేద రైతులకు ఉచిత న్యాయ సహాయం అందిస్తారని అన్నారు. రైతులు భూ సమస్యలపై కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా, నిర్దిష్ట కాల వ్యవధిలో వాటిని పరిష్కరించి, రైతుల భూములపై వారికి హక్కులు ఏర్పరుస్తూ, వారికి పూర్తి భరోసా కల్పించడం జరుగుతుందని అన్నారు. భవిష్యత్తులో ఎలాంటి వివాదాలకు ఆస్కారం లేకుండా పట్టా పాస్ బుక్కులలో సమగ్ర వివరాలతో, హద్దులను పేర్కొంటూ భూమి పటం (మ్యాప్) పొందుపరుస్తారని తెలిపారు. రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చేయడానికి ముందు సర్వే మ్యాప్ రూపొందించి పట్టా పాస్ బుక్కుకు జత పరుస్తారని అన్నారు.ఆధార్ తరహాలోనే భూముల వివరాలతో కూడిన భూధార్ నెంబర్ కేటాయిస్తారని తెలిపారు. ఈ చట్టంలో ఇంటి స్థలాలకు, ఆబాది, వ్యవసాయేతర భూములకు కూడా హక్కుల రికార్డు ఉంటుందన్నారు. ఎవరైనా మోసపూరితంగా హక్కుల రికార్డులు తారుమారు చేసి ప్రభుత్వ, భూదాన్, అసైన్డ్, దేవాదాయ, వక్ఫ్ భూములకు పట్టాలు పొందితే అలాంటి పట్టాలను రద్దు చేసే అధికారం భూభారతి ద్వారా అధికారులకు కల్పించారని వివరించారు. ధరణిలో కొన్ని భూ సమస్యల పరిష్కారానికి అవకాశం ఉండేది కాదని, అభ్యంతరాలు ఉంటే సివిల్ కోర్టులను ఆశ్రయించాల్సి వచ్చేదని గుర్తు చేశారు. ప్రస్తుతం తహసీల్దార్, ఆర్డీఓ లకు దరఖాస్తులు చేసుకుని సమస్యలు పరిష్కరించుకునేలా భూభారతి వెసులుబాటు కల్పిస్తుందని అన్నారు. సాదాబైనామా పెండింగ్ దరఖాస్తులను కోర్టు స్టే విధించడం వల్ల ధరణిలో పరిష్కరించేందుకు అవకాశం లేకపోయిందని, ప్రస్తుతం కొత్త ఆర్ ఓ ఆర్ చట్టంలో పెండింగ్ దరఖాస్తులను ఆర్డీఓలు పరిశీలించి క్రమబద్ధీకరిస్తారని తెలిపారు. అర్హులైన రైతులు ఈ చట్టంపై అవగాహనను పెంపొందించుకుని, భూ సమస్యలు ఉంటే గ్రామ సభలలో అధికారులకు అర్జీలు అందించి పరిష్కరించుకోవాలని, ధరణి పోర్టల్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ సూచించారు. త్వరలో గ్రామాల్లో రెవెన్యూ సమావేశాలు ఏర్పాటు చేయడంజరుగుతు%శీ%న్నదన్నారు.ఈ కార్యక్రమం లో అదనపు కలెక్టర్ మాధురి, జిల్లా వ్యవసాయ అధికారి శివ ప్రసాద్, పఠాన్ చెర్వు నియోజకవర్గం ప్రత్యేఅధికారి, దేవుజా, ఆర్డిఓ రవీంధర్ రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి , తహసిల్దార్లు పరమేష్, బిక్షపతి రెవెన్యూ అధికారులు,రైతులు, రైతు సంఘాలు, మహిళలు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# భూ భారతి చట్టం పై అవగాహన సదస్సులను తాడ్వాయి మండల రైతువేదికలో నిర్వహించిన : జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, ఏప్రియల్ 30: భూ భారతి చట్టం పై జిల్లాలోని ప్రజలకు అవగాహన కల్పించడానికి ప్రతీ మండల కేంద్రంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు. భూ భారతి చట్టం పై అవగాహన సదస్సులను జిల్లాలో ప్రారంభించడం జరిగిందని, అందులో భాగంగా బుధవారం కామారెడ్డి మండలం చిన్న మల్లారెడ్డి, రాజంపేట, తాడ్వాయి రైతువేదికలో నిర్వహించిన అవగాహన సదస్సులలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సెక్షన్ 4 ప్రకారం హక్కుల రికార్డుల్లో తప్పుల సవరణకు, భూమి హక్కులు ఉండి రికార్డుల్లో లేని వారు హక్కుల రికార్డులో నమోదు చేయించుకోవడానికి కొత్త చట్టం వచ్చిన సంవత్సరంలో గా దరఖాస్తు చేసుకోవచ్చు.సెక్షన్ 5 ప్రకారం వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చేసుకోవచ్చని తెలిపారు.సెక్షన్ 6 ప్రకారం సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారం జరుగుతుందని, 2014 జూన్ 2 కంటే ముందు గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయ భూమిని సాదా బైనామ ద్వారా కొనుగోలు చేసిన క్రమబద్ధీకరణ కోసం రైతులు పెట్టుకున్న దరఖాస్తులపై ఆర్డీఓ లు విచారణ చేసి అర్హత ఉన్న వారి నుండి ప్రస్తుత రిజిస్ట్రేషన్ , స్టాంప్ డ్యూటీ వసూలు చేసి సర్టిఫికెట్ జారీ చేస్తారని తెలిపారు. అట్టి వాటిని రికార్డు లలో నమోదు చేసి పట్టాదారు పాసు పుస్తకం ఇస్తారని తెలిపారు. వారసత్వంగా వచ్చిన భూములకు మ్యుటేషన్ చేసే ముందు నిర్ణీత కాలంలో విచారణ చేయడం జరుగుతుందని తెలిపారు. పాసు పుస్తకాలలో భూమి పటం, భూముల సమస్యలు పరిష్కారానికి రెండు అంచెల అప్పీల్ వ్యవస్త ఉంటుందని తెలిపారు. తహసీల్దార్ చేసిన మ్యుటేషన్లపై లేదా జారీచేసిన పాసుపుస్తకాలపై అభ్యంతరాలు ఉంటే ఆర్డీఓ కు అప్పీలు చేసుకోవచ్చని, ఆర్డీఓ ఇచ్చిన తీర్పు పై అభ్యంతరం ఉంటే జిల్లా కలెక్టర్ కు అప్పీలు చేసుకోవచ్చని, కలెక్టర్ ఇచ్చిన తీర్పు పై అభ్యంతరం ఉంటే భూమి ట్రిబ్యునల్ కు అప్పీలు చేసుకోవచ్చని తెలిపారు. ఆధార్ తరహాలో రైతులకు భూదార్ కార్డుల జారీ చేయడం జరుగుతుందని తెలిపారు. రైతులకు ఉచిత న్యాయ సహాయం అందించడం జరుగుతుందని తెలిపారు. ఇట్టి చట్టంలో ఏమైనా అభ్యంతరాలు, అనుమానాలు ఉంటే నివృత్త చేసుకోవచ్చని తెలిపారు. గతంలో ధరణీలో అప్పీలు కు ఆస్కారం లేనందున సివిల్ కోర్టుకు వెళ్ళవలసి ఉండేదని, ప్రస్తుతం తహసీల్దార్ ఇచ్చిన తీర్పులో అభ్యంతరం ఉంటే ఆర్డీఓ కు, ఆర్డీఓ తీర్పులో అభ్యంతరం ఉంటే కలెక్టర్ కు అప్పీలు. చేసుకోవచ్చని, కలెక్టర్ ఇచ్చిన తీర్పు అభ్యంతరం ఉంటే భూమి ట్రిబ్యునల్ కు అప్పీలు చేసుకునే ఆస్కారం ఉంటుందని తెలిపారు. హక్కుల రికార్డుల్లో ఉన్న వ్యక్తి లైసెన్సు గల సర్వేయర్ తో భూమి సర్వే చేయించుకొని మ్యాప్ తయారు చేయించుకున్నట్లయితే మండల సర్వేయర్ సరి చూసిన తర్వాత తహసీల్దార్ పాసుపుస్తమలో సర్వే మ్యాప్ ను ఉంచడం జరుగుతుందన్నారు. ఏ మైన భూ సమస్య ఉంటే సదరు పార్టీలకు నోటీసులు జారీ చేయాలని ఎవిడెన్స్ రికార్డు చేయాలనీ స్పీకింగ్ ఆర్డర్స్ స్పష్టమైన రీమార్కులతో నమోదు చేయాలని తెలిపారు. ప్రస్తుతం మీ సేవలో దరఖాస్తు పెడితే భూ భారతి చట్ట ప్రకారం విచారణ చేపట్టి నిర్ణీత సమయంలోగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. దీర్ఘకాలిక సమస్యలపై విచారణ చేసి స్పీకింగ్ ఆర్డర్స్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. భూ భారతి చట్టం లింగంపేట్ మండలంలో పైలెట్ ప్రాజెక్ట్ కింద అమలు జరుగుచున్నదని తెలిపారు.

ప్రజలందరూ భూ భారతి పై అవగాహన కల్పించుకోవాలని అన్నారు.ఆర్డీఓ వీణ మాట్లాడుతూ, భూ భారతి చట్టం గురించి వివరించారు. గత ధరణీ లో 33 మాడ్యూల్స్ ఉండేదని, ఈ భూ భారతి చట్టంలో కేవలం 6 మాడ్యూల్స్ తో భూముల యాజమానుల సమస్యలు తీర్చడానికి వీలు కలుగుతుందని తెలిపారు. భూముల విస్తీర్ణం, మార్పులు, చేర్పులకు అవకాశం ఉందని తెలిపారు. వారసత్వంగా వస్తున్న యజమానులకు పేరు మార్పులు చేయవచ్చని, దానికి ముందు కుటుంబ సభ్యులకు నోటీసులు జారీ చేసి ఆర్డీఓ పూర్తి విచారణ జరిపి అర్హత ఉన్న వారి నుండి ప్రస్తుత రిజిస్ట్రేషన్, స్టాంపు డ్యూటీ వసూలు చేసి సర్టిఫికెట్ జారీ చేస్తారనీ తెలిపారు. గతంలో ధరణీ లో అప్పీలు ప్రోవిజన్ లేదని, కేవలం సివిల్ కోర్టుకు వెళ్ళవలసి ఉండేదని తెలిపారు. భూభారతి చట్టంలో తహసీల్దార్ నిర్ణయించిన వాటిపై అభ్యంతరం ఉంటే ఆర్డీఓ కు అప్పీలు చేసుకునే ఆస్కారం ఉందని, ఆర్డీఓ ఇచ్చిన ఆదేశాలకు అభ్యంతరం ఉంటే కలెక్టర్ కు అప్పీలు చేసుకోవచ్చని, ఒక వేళ కలెక్టర్ ఇచ్చిన తీర్పు అభ్యంతరాలు ఉంటే భూమి ట్రిబ్యునల్ కు వెళ్లవచ్చని తెలిపారు.ఆయా అవగాహన సదస్సులలో పలువురు రైతులు ప్రసంగించారు.అంతకుముందు చట్టం పై రూపొందించిన వివరాలను ఆయా తహసీల్దార్లు వివరించారు. కార్యక్రమం ప్రారంభానికి ముందు భూ భారతి పై రూపొందించిన వీడియో ప్రదర్శించారు.ఈ సదస్సులో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లు, పాక్స్ చైర్మన్లు, ఆయా మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓ లు, రెవిన్యూ సిబ్బంది, గ్రామస్తులు, రైతులు, పలువురు ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.

# మేడే కార్యక్రమాన్ని భవన నిర్మాణ కార్మికులు విజయవంతం చేయాలి: భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు షేక్ సైదా

సూర్యాపేట జిల్లా బ్యూరో (భారత శక్తి) ఏప్రిల్ 30:సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ నియోజకవర్గ కేంద్రంలోని టౌన్ హాల్ నందు బుధవారం భవన నిర్మాణ కార్మికుల సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో హుజూర్ నగర్ భవననిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు షేక్ సైదా మాట్లాడుతూ మే 1న జరగబోయే మేడే కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘ సభ్యులు అందరూ పాల్గొనాలని అలాగే మొదటి జెండా టౌన్ హాల్ వద్దా రెండవది కూలీల అడ్డా వద్ద మూడవది అడ్డ రోడ్డు నందు ఆవిష్కరించడం జరుగుతుందని తెలిపారు. భవన నిర్మాణ కార్మిక సంఘం సభ్యులందరూ అత్యధికంగా పాల్గొని మేడే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని షేక్ సైదా కోరారు. ఈ కార్యక్రమంలో



గౌరవ అధ్యక్షులు బంకా శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వినాయక రావు, సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మతిస్థిమితం సరిగ్గా లేని మహిళ ను అక్కున చేర్చుకున్న కల్వారి కుమార్.

మంచిర్యాల, ఏప్రిల్ 30(భారత శక్తి): మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ బస్టాండ్ ఏరియాలో ఓ మతిస్థిమితం సరిగ్గా లేని మహిళా రోడ్డు పై వెళ్లుచున్న వాహనాలకు ఎదురుగా వెళ్లుచు వచ్చిపోయే వాహనదారులకు ఇబ్బంది కలిగిస్తుంది. అటు వైపు వెళ్లుచున్న మంచిర్యాల డి సి పి. ఏ.భాస్కర్ విషయాన్ని గమనించి శ్రీరాంపూర్ ఎస్సై సంతోష్ కు సమాచారం అందించి ఆ మతిస్థిమితం సరిగ్గా మహిళ ను మంచిర్యాల జిల్లా కేంద్రంలోని కల్వరి యువశక్తి అనాధ ఆశ్రమం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అనాధ వృద్ధుల మానసిక వికలాంగుల ఆశ్రమంలో చేర్పించమని ఆదేశించినారు. ఈ విషయాన్ని శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న %యా×% సంతోష్ ఆశ్రమ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్. కల్వరి కుమార్ అలియాస్ డాక్టర్ ములూకాల కుమార్ అట్టి విషయాన్ని చెప్పి తమ సిబ్బంది కి వాహనంలో



ఆశ్రమం నకు పంపించినారు. ఆశ్రమ వ్యవస్థాపక అధ్యక్షులు కల్వరి కుమార్ మాట్లాడుతూ ఇలాంటి మతిస్థిమితం సరిగ్గా లేనివారు ఇంకా చాలా మంది రోడ్లపై తిరుగుచున్నారు ప్రస్తుతం ఎండలు బాగా ఉన్నాయి అలాంటి వారు మీకు ఎక్కడైనా కనబడుతే నేరుగా నా సెల్ నెంబర్ 9701973636,9381018678 కు గాని పోలీస్ స్టేషన్ లో గాని సమాచారం అందించండి అలాంటి వారికి వేము ఎల్లవేళలా సేవ చేయడానికి సిద్ధంగా ఉన్నాం అలాగే మీ పెళ్లిరోజు మీ పిల్లల పుట్టినరోజు, మీ పెద్దల జ్ఞాపకార్ధం గా నైనా సరే సంవత్సరంలో ఒక్కరోజు భోజనాలు అందించి మాకు సహకరిస్తే మేము ఇంకా ఎక్కోవ మందుకి సేవ చేయగలం అని కుమార్ అన్నాడు ఈ కార్యక్రమం లో %బాూ×% నర్సయ్య, కానిస్టేబుల్స్ సత్యం, బాలకృష్ణ లతో పాటు తదితరులు పాల్గొని ఆశ్రమ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ కల్వరి కుమార్ ను అభినంధించినారు.

# నీట్ పరీక్షకు పకడ్బందీగా ఏర్పాట్లు: జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి




వైఎస్సార్ జిల్లా, ఏప్రిల్ 30(భారతశక్తి) : జిల్లాలో మే 4న నీట్ యూజీ- 2025 పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులకు సూచించారు. స్థానిక కలెక్టరేట్ లోని బోర్డు రూమ్ హాలు లో నీట్ పరీక్షలకు సంబంధించిన ఏర్పాట్లపై నీట్ యూజీ అధికారులు,విద్యా శాఖా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ... జిల్లాలో మొత్తం ఎనిమిది ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో ప్రొద్దుటూరులో రెండు పరీక్ష కేంద్రాలు, కడప జిల్లా కేంద్రంలో ఆరు పరీక్ష కేంద్రాలు ఉన్నాయని తెలిపారు.ఈ పరీక్షల్లో మొత్తం 2428 మంది విద్యార్థులు హాజరవుతారని ఆయన తెలిపారు. పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు ఆఫ్ లైన్లో విధానంలో జరుగుతుందని చెప్పారు. ఉదయం 11 గంటల నుంచి విద్యార్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారని పేర్కొన్నారు.పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ విధించి కట్టుబడ్డ భద్రత ఏర్పాటు చేయాలని పోలీసు శాఖ వారిని ఆదేశించారు.కస్టోడియన్ బ్యాంకుకు వచ్చిన పరీక్ష పేపర్లను సూపరింటెండెంట్లు, పోలీసు సహకారంతో తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. పోలీసు సిబ్బంది పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులు ఆదేశించారు.దివ్యాంగ విద్యార్థులకు పరీక్ష కేంద్రంలో వీల్ చైర్లను, సహాయకులను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.నీట్ యూజీ నియమ నిబంధనలను తప్పక పాటించాలని అధికారులను ఆదేశించారు.పరీక్షలకు హాజరగు అభ్యర్దులు సెల్ ఫోన్, లు ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతి లేవని తెలిపారు.పరీక్ష కేంద్రాల్లో ఎటువంటి విద్యుత్ అంతరాయం లేకుండా చూసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు.పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు మౌలిక వసతులైన టాయిలెట్స్, త్రాగునీరు ఉండేలా చూసుకోవాలన్నారు.పరీక్షా కేంద్రాలకు హాజరయ్యే విద్యార్థినీ, విద్యార్థులకు ఆర్.టి.సి బస్సులు తగు విధంగా ఉదయము సాయంత్ర వేళల్లో అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు.ప్రతి పరీక్ష కేంద్రంలో ఏఎన్ఎం, 108 వాహనాన్ని అందుబాటులో ఉంచాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద క్రౌడ్ గుమి కూడకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు.పరీక్ష కేంద్రము సమీపంలో ఎక్కడ కూడా జిరాక్స్ కేంద్రాలు లేకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు.

::ప్రొద్దుటూరు పరిధిలో రెండు పరీక్ష కేంద్రాలు::

1.అనిబిసెంట్ మున్సిపల్ హై స్కూల్, (మెయిన్), టి.బి రోడ్ ప్రొద్దుటూరు

2.వైయస్సార్ ఇంజనీరింగ్ కాలేజ్ ఆఫ్ యోగి వేమన యూనివర్సిటీ, కొర్రపాడు రోడ్డు, ప్రొద్దుటూరు

::కడప నగర పరిధిలో ఆరు పరీక్ష కేంద్రాలు::

1. ఎస్ కే ఆర్ అండ్ ఎస్ కే ఆర్ డిగ్రీ కాలేజ్ ఫర్ ఉమెన్, నాగరాజు పేట, కడప

2. ప్రభుత్వ జూనియర్ కళాశాల, (గర్ల్స్) హెడ్ పోస్ట్ ఆఫీస్ ఎదురుగా కడప

3. మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్, ఎం సి హెచ్ ఎస్ మెయిన్స్,అన్నమయ్య సర్కిల్ దగ్గర కడప

4. పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ, కడప

5. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులం,చిన్న చౌక్, కడప

6. వై ఆర్ జెడ్పిహెచ్ స్కూల్ (గర్ల్స్), జడ్పీహెచ్ఎస్ కాలనీ, చిన్నచౌక్,కడప

ఈ కార్యక్రమంలో డిఆర్ఓ విశ్వేశ్వర నాయుడు,జిల్లా విద్యాశాఖ అధికారి శంషుద్దీన్ ,కడప కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపల్ నీట్ సిటీ కోఆర్డినేటర్ మునిష్ మీనా, నీట్ ప్రొద్దుటూరు సిటీ కోఆర్డినేటర్ గంగయ్య, నీట్ యూజీ నోడల్ అధికారులు, ప్రభుత్వ కళాశాల ఉపాధ్యాయులు, ,ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు,తదితరులు పాల్గొన్నారు.




# గుమ్మడిదల సర్వే నంబర్ 109 రైతులకు కోటి రూపాయల పరిహారం ఇవ్వాలి: కలెక్టర్ కు బిఆర్ఎస్ నేత వినతి

గుమ్మడిదల (సంగారెడ్డి) భారత శక్తి ప్రతినిధి, ఏప్రిల్ 30: సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలంలోని సర్వే నంబర్ 109 భూముల వివాదంలో నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలని కోరుతూ బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతిని కలిసి వినతిపత్రం అందజేశారు.గుమ్మడిదల గ్రామ పరిధిలో ఉన్న సర్వే నెం: 109 లో మొత్తం 152 ఎకరాల భూమి రైతులకు అసైన్‌మెంట్ భూములుగా ఉంది. ఈ భూమిని రాష్ట్ర ప్రభుత్వం ఐటి ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు కోసం నోటిపై చేయడం జరిగినది.ఈ నిర్ణయానికి రైతులందరూ సానుకూలంగా మద్దతు తెలుపుతున్నారు. అయితే, గత ప్రభుత్వం ఈ భూమిని ల్యాండ్ పూలింగ్ విధానంలో తీసుకుంటూ, ప్రతి ఎకరాకు 600 గజాల భూమిని ప్రత్యామ్నాయంగా ఇచ్చే విషయాన్ని ప్రకటించింది. ఆ సమయంలో అంచనా విలువ సుమారు రూ.60 లక్షలుగా ఉండేది.కానీ ప్రస్తుతం భూముల ధరలు గణనీయంగా పెరిగిన నేపథ్యంలో, రైతులకు ప్రస్తుత మార్కెట్ విలువ ఆధారంగా న్యాయమైన పరిహారం అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో స్థానిక మాజీ జెడ్పిటిసి కుమార్ గౌడ్ మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి, బిఆర్ఎస్ నాయకులు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# అనిల్ హెల్త్ కేర్ హాస్పటల్ ను ప్రారంభించిన మంత్రి సీతక్క





ములుగు జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 30(భారత శక్తి):

ములుగు జిల్లా కేంద్రములో అనిల్ ప్రైవేట్ హాస్పటల్ ను రాష్ట్ర పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి పేదవాడికి ప్రైవేట్ వైద్యం, ప్రవేట్ హాస్పటల్ అందుబాటులో ఉండాలని అన్నారు. ములుగు జిల్లా వెనుకబడిన జిల్లా ఈ ప్రాంతం లో ఉన్న ప్రజలకు మెరుగైన వైద్యం కోసం పట్టణాలకు వెళ్లి చికిత్స చేసుకుంటున్నారని

మన ములుగు జిల్లా లో నే మెరుగైన వైద్యం అందిస్తే పట్టణాలకు పోకుండా వైద్యం చేసుకోవచ్చని మంత్రి సీతక్క అన్నారు. ఈ కార్యక్రమములో జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్ తో పాటు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జిల్లా మండల గ్రామ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# యాసంగి పంట కొనుగోలు వేగవంతం చేయాలి: రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రివర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి

(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, ఏప్రియల్ 30: యాసంగి పంట కొనుగోలు వేగవంతం చేయాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రివర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.

బుధవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి వర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు, పౌర సరఫరాల శాఖ కమీషనర్ డి.ఎస్. చౌహాన్ లతో కలిసి ధాన్యం కొనుగోలుపై జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించగా, జిల్లా కలెక్టర్ అధికారులు తాడ్వాయి మండల కేంద్రం నుండి హాజరయ్యారు.

ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో యాసంగి పంట 2024-25 సంవత్సరంలో 54 లక్షల 89 వేల ఎకరాలలో సాగు జరిగిందని, 137.10



ఎల్.ఎం.టి. ధాన్యం ఉత్పత్తి అవుతుందని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా దాదాపు 70.13 ఎల్.ఎం.టి. ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంటుందని అన్నారు.

రాష్ట్రంలో ఇప్పటి వరకు 2.55 లక్షల రైతుల నుంచి 19.60 ఎల్.ఎం.టి. ధాన్యం కొనుగోలు చేశామని అన్నారు. మే నెలలో కొనుగోలు కేంద్రాలకు అధికంగా ధాన్యం రానున్న నేపథ్యంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు.అకాల వర్షాలు కారణంగా రైతులు నష్టపోకుండా నాణ్యమైన ధాన్యాన్ని వేగవంతంగా కొనుగోలు చేయాలని మంత్రి సూచించారు. రానున్న 15 నుంచి 20 రోజుల పాటు సజావుగా ధాన్యం కొనుగోలు చేయడం ప్రభుత్వ అత్యంత ప్రాధాన్యతా అంశమని అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద ఎటువంటి లోటుపాట్లు ఉండటానికి వీలులేదని అన్నారు. రైస్ మిల్లులకు బ్యాంక్ గ్యారెంటీ అడిగామని, ఏ అంశంలో మినహాయింపులు ఇవ్వడం కుదరదని మంత్రి పేర్కొన్నారు. రైస్ మిల్లర్లతో కలెక్టర్, ఉన్నతాధికారులు చర్చించాలని, జిల్లాలలో అవసరమైతే ఇంటర్మీడియట్ గోదాములకు కొనుగోలు చేసిన ధాన్యాన్ని తరలించాలని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 10 లక్షల మెట్రిక్ టన్నుల ఇంటర్మీడియట్ గోదాముల కేటాయింపు జిల్లాల వారీగా అవసరం బట్టి మంజూరు చేయాలని మంత్రి పౌర సరఫరాల శాఖ ఉన్నతాధికారులకు సూచించారు. ప్రభుత్వానికి ఆర్థికంగా ఇబ్బంది ఉన్నప్పటికీ రైతులకు సమస్య రాకుండా చూసుకోవాలని అన్నారు. ధాన్యం కొనుగోలుపై వివిధ రాజకీయ పక్షాలు, పత్రికలు, సామాజిక మాధ్యమాల ద్వారా చేస్తున్న దుష్ప్రచారాన్ని అధికారులు తిప్పి కొట్టాలని, ఎక్కడైనా నిజంగానే ఇబ్బందులు ఉంటే వాటిని సత్వరమే పరిష్కరించాలని మంత్రి సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ, హెచ్ఎంటి, ఆర్ఎన్ఆర్, 1638 రకాల ధాన్యంలో నూకలు అధికంగా వస్తాయనే కారణంతో మిల్లర్లు తిరస్కరిస్తున్నట్లు గమనించడం జరిగిందని అన్నారు. రైస్ మిల్లు వద్ద క్వింటాల్ కు 5 కేజీలు తరుగు తీస్తున్నట్లు రైతులు ఆందోళన చెందుతున్నారని, కొనుగోలు కేంద్రాలలో గన్ని బ్యాగుల కొరత కూడా కొంత ఉందని అన్నారు. రాబోయే యాసంగి సీజన్ లో నూకలు అధికంగా వచ్చే వడ్ల విత్తనాలను పంట వేయకుండా రైతులలో అవగాహన కల్పించాలని మంత్రి అన్నారు.

వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న పౌరసరఫరాల శాఖ కమీషనర్ డిఎస్ చౌహన్ మాట్లాడుతూ, జిల్లాలో ఉన్న రైస్ మిల్లర్లు నిబంధనలు ప్రకారం నడుచుకునేలా కలెక్టర్లు పకడ్బందీగా పర్యవేక్షించాలని అన్నారు. ధాన్యం రవాణాకు వాహనాల ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని, రైస్ మిల్లుల వద్ద ధాన్యం బస్తాలు అన్ లోడింగ్ ఆలస్యం కాకుండా చూడాలని, హమాలీల కొరత ఉండకుండా జాగ్రత్త పడాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్దకు పెద్ద ఎత్తున ధాన్యం వస్తున్నప్పటికీ వేగవంతంగా కొనుగోలు చేయడంలో కొంత ఆలస్యం జరుగుతుందని, వీటిని సంపూర్ణంగా నివారించాలని అన్నారు. ధాన్యం కొనుగోలు అంశంపై జిల్లా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించి ప్రత్యేకంగా మానిటర్ చేయాలని అన్నారు. రైస్ మిల్లర్లు తాలు, తరుగు పేరు మీద ఎటువంటి కోతలు లేకుండా జాగ్రత్తలు పాటించాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద గన్ని బ్యాగులు ఉండాలని రైతులకు నేరుగా ఇవ్వవద్దని, మనం కొనుగోలు చేసిన ధాన్యం నింపేందుకు మాత్రమే వినియోగించాలని అన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మాట్లాడుతూ, జిల్లాలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతుల కోసం ప్యాడీ క్లీనర్స్, టార్ పాలిన్ లు, తూకం వేసే యంత్రాలు, తేమ కొలిచే మిషన్ లు సమకూర్చడం జరిగిందని, అలాగే వేసవి కాలంలో కొనుగోలు కేంద్రాల్లో త్రాగునీరు, నీడ, ఓ.ఆర్.ఎస్. ప్యాకెట్లు అందుబాటులో ఉంచడం జరిగిందని తెలిపారు.

కామారెడ్డి జిల్లాలో ఇప్పటివరకు 446 కొనుగోలు కేంద్రాల ద్వారా 22785 మంది రైతుల నుండి 181776 మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని, ఇందులో 59,354 మెట్రిక్ టన్నుల దొడ్డు రకం, 1,22,422 మెట్రిక్ టన్నుల సన్న రకం వరి ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు అకాల వర్షం వలన ఇబ్బంది కలుగకుండా ఉండేందుకు టార్పాలిన్ లను సమకూర్చడం జరిగినది. కొనుగోలు చేసిన ధాన్యం ను ట్యాబ్ ఎంట్రీ చేసి ఆయా మిల్లులకు సరఫరా చేయడం జరుగుచున్నదని తెలియజేశారు. ఇప్పటి వరకు 101038 మెట్రిక్ టన్నుల వరి ధాన్యం నకు 234.41 కోట్ల రూపాయలు ఆయా రైతులకు చెల్లించడం జరిగిందని, 5315 మంది రైతుల వద్ద కొనుగోలు చేసిన సన్నరకం వడ్లకు 25.89 కోట్ల బోనస్ చెల్లించడం జరిగిందని తెలిపారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ (రెవిన్యూ) వి.విక్టర్, ఆర్డీఓ వీణ, జిల్లా పౌర సరఫరాల అధికారి మల్లికార్జున్ బాబు, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ రాజేందర్, జిల్లా సహకార అధికారి రామ్ మోహన్, జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి రాజారాం, జిల్లా పంచాయతీ అధికారి మురళీ, జిల్లా మార్కెటింగ్ అధికారి రమ్య, తదితరులు పాల్గొన్నారు.

# 10వ తరగతి ఫలితాల విడుదల, బసవేశ్వర జయంతి కార్యక్రమాల్లో పాల్గొన్న సిఎం రేవంత్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్

(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, ఏప్రియల్ 30:10వ తరగతి ఫలితాల విడుదల, బసవేశ్వర జయంతి కార్యక్రమాల్లో సిఎం రేవంత్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ,తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత విద్యాశాఖపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు.

జిల్లాకు ఒకటి ఇంటగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూలు మొదలు పెట్టమన్నారు.

ప్రభుత్వ ఉపాధ్యాయులు ప్రభుత్వ విద్యాలయాల్లో విద్యార్థుల సంఖ్య పెంచే కార్యక్రమం చేపట్టాలని గ్రామ గ్రామాన తిరిగి విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేలా కౌన్సిలింగ్ చేయాలన్నారు.అలాగే ప్రభుత్వ ఉద్యోగులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలి అన్నారు.ఇంత వరకు పదో తరగతిలో సబ్జెక్టుల వారీగా గ్రేడ్లతో పాటు సీజీపీఏ ఇచ్చేవారు. కానీ..ఇకపై సబ్జెక్టుల వారీగా మార్కులు, గ్రేడ్‌లు ఇవ్వనున్నారని వెల్లడించారు. అలాగే ఈరోజు కుల వ్యవస్థను వ్యతిరేకించి%ొ%సమానత్వాన్ని ప్రబోధించిన అభ్యుదయవాది శ్రీ





బసవేశ్వర 892వ జయంతి సందర్భంగా ఆ మహనీయుడికి నివాళు అర్పించారు.

# కామారెడ్డిలో మే2 న మధ్యాహ్నం 3 గంటలకు కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశం



(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, ఏప్రియల్ 30: మే2 న మధ్యాహ్నం 3 గంటలకు కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశం శుభం కన్వెన్షన్ హాలు లో జరగనున్నది, ఇట్టి సమావేశంలో పాల్గొననున్న ప్రభుత్వ సలహాదారులు మాజీ మంత్రి షబ్బీర్ అలీ, పార్లమెంట్ సభ్యులు సురేశ్ కుమార్ శెట్కార్, వ్యవసాయ సలహాదారులు పోచారం శ్రీనివాసరెడ్డి, ఎల్లారెడ్డి శాసనసభ్యులు మదన్ మోహన్ రావ్, జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్ రావ్, ఆగ్రో చైర్మన్ కాసుల బల్ రాజు, మాజీ శాసన సభ్యులు ఏనుగు రవీందర్ రెడ్డి,మాజీ శాసనసభ్యులు సయ్యద్ యూసూఫ్ అలీ, జిల్లా కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంస్థలు అధ్యక్షులు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, మాజీ మున్సిపల్ చైర్మన్లు , మాజీ జెడ్పీటీసీలు, మాజీ ఎంపీపీ లు మాజీ మున్సిపల్ కౌన్సిలర్ లు మాజీ ఎంపీటీసీలు , సర్పంచులు నాయకులు కార్యకర్తలు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్ రావ్, మాజీ మున్సిపల్ చైర్మన్ కామారెడ్డి కోరారు.



# ప్లేఆఫ్స్‌నకు ఏ జట్టు ఎంతెంత దూరం?

ఐపీఎల్ 2025 సీజన్‌లో భాగంగా మంగళవారం కోల్‌కతా నైట్ రైడర్స్, దిల్లీ క్యాపిటల్స్‌కు మధ్య మ్యాచ్ జరిగింది. ఈ ఉత్కంఠ పోరులో కోల్‌కతా నైట్ రైడర్స్ 14 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ మ్యాచ్ ఫలితంతో ప్లేఆఫ్స్ సమీకరణాలు ఆసక్తికరంగా మారాయి. ఇక టీమ్‌ల వారీగా వాటి అవకాశాలను పరిశీలిస్తే..

ప్రస్తుతానికి టాప్ 1గా ఆర్సీబీ

పాయింట్ల పట్టికలో ఆర్సీబీ ) ప్రస్తుతానికి మొదటిస్థానంలో ఉంది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఖాతాలో ఇప్పటికే 14 పాయింట్లు ఉన్నాయి. ఇప్పటివరకు 10 మ్యాచ్‌లు ఆడిన ఆర్సీబీ 7 మ్యాచుల్లో విజయం సాధించింది. ఇంకా మిగిలిఉన్న నాలుగు మ్యాచుల్లో రజత్ పటీదార్ సేన కేవలం రెండు మ్యాచ్‌లు గెలిస్తే చాలు టాప్ 4లో నిలుస్తుంది. తద్వారా ప్లేఆఫ్స్ బెర్త్ ఖాయం చేసుకుంటుంది

ముంబయి ఇండియన్స్ ఇదే జోరు కొనసాగిస్తే..

ముంబయి ఇండియన్స్ జట్టు తాను ఆడిన 10 మ్యాచుల్లో 6 విజయాలు సాధించింది. 12 పాయింట్లతో పట్టికలో రెండో స్థానంలో కొనసాగుతోంది. హార్దిక్ పాండ్య సారథ్యంలో జట్టు వరుసగా అయిదు మ్యాచుల్లో విజయకేతనం ఎగురవేసింది. మిగిలిన నాలుగు మ్యాచుల్లో 3 విజయాలు సాధిస్తే టాప్ 4లో నిలుస్తుంది. రెండు విజయాలతోనూ ప్లేఆఫ్స్‌కు వెళ్లే అవకాశాలు ముంబయి ముంగిట ఉన్నాయి.

గుజరాత్ టైటాన్స్‌కు పెద్ద కష్టమేం కాదు!

గుజరాత్ టైటాన్స్ ఇప్పటివరకు ఆడిన 9మ్యాచుల్లో 6 విజయాలు సాధించింది. 12 పాయింట్లతో ప్రస్తుతానికి పట్టికలో మూడో స్థానంలో ఉంది. ఈ టీమ్ ఇంకా 5 మ్యాచులు ఆడాల్సిఉంది. శుభ్‌మన్ గిల్ నాయకత్వంలో జట్టు కనీసం రెండు మ్యాచుల్లో విజయం సాధించినా ప్లేఆఫ్స్‌నకు అవకాశాలుంటాయి. మూడు మ్యాచుల్లో విజయం సాధిస్తే మాత్రం నేరుగా టాప్ 4లోకి దూసుకుపోతుంది.

దిల్లీ క్యాపిటల్స్ పరాజయాల పరంపర ఆగితేనే..

ఇప్పటివరకు 10 మ్యాచ్‌లు ఆడిన దిల్లీ క్యాపిటల్స్ 6 మ్యాచుల్లో విజయం సాధించింది. కానీ గత 6 మ్యాచుల్లో వరుసగా నాలుగు మ్యాచుల్లో ఓటమి పాలైంది. అయినప్పటికీ అక్షర్‌పటేల్ సారథ్యంలోని దిల్లీ జట్టు పాయింట్ల పట్టికలో నాలుగో స్థానంలో ఉంది. వీరికి మరో నాలుగు మ్యాచులు ఉన్నాయి. వీటిలో కనీసం 2 గెలిస్తేనే ప్లేఆఫ్స్ రేసులో నిలుస్తారు.

పంజాబ్ కింగ్స్.. కుదిరితే 3.. లేదంటే కనీసం 2

పంజాబ్ కింగ్స్ (9 మ్యాచుల్లో 5 విజయాలు సాధించింది. కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో మ్యాచ్ వర్షార్పణం కారణంగా 11 పాయింట్లతో అయిదో స్థానంలో ఉంది. మరో 5 మ్యాచులు ఆడాల్సిఉంది. వీటిలో కనీసం మూడింట్లో విజయం సాధించాల్సి ఉంటుంది. రెండు విజయాలతోనూ టాప్ 4లో నిలిచే అవకాశాలను కొట్టిపారేయలేం.

లఖ్‌నవూకు లక్ కలిసి రావాలంటే...!

ఐపీఎల్ వేలంలో భారీ ధర పలికిన రిషభ్ పంత్... ఆటకు ఆ స్థాయిలో న్యాయం చేయలేకపోతున్నాడు. ఇప్పటివరకు లఖ్‌నవూ 10 మ్యాచ్‌లు ఆడితే 5 మ్యాచుల్లో మాత్రమే విజయం సాధించింది. అయినా లఖ్‌నవూకు ద్వారాలైతే ఇంకా పూర్తిగా మూసుకుపోలేదు. మిగిలిన నాలుగు మ్యాచుల్లో కనీసం మూడింట్లో అయినా విజయం సాధిస్తే టాప్4లో స్థానం దక్కించుకోవచ్చు.

కోల్‘కథ’ మారాలంటే!

అజింక్య రహానే సారథ్యంలోని కోల్‌కతా నైట్‌రైడర్స్ (%ఖశీశ్రీఎఫ్ఖ ఖఅఅస్త్రష్ట్ర =అనవతీం%) తాము ఆడిన 10 మ్యాచుల్లో కేవలం నాలుగింట్లో మాత్రమే విజయం సాధించింది. మిగిలిన నాలుగు మ్యాచుల్లో కనీసం మూడింట్లో అయినా తప్పక విజయం సాధిస్తేనే ప్లేఆఫ్స్‌నకు ఏమైనా అవకాశం ఉంటుంది.

రాజస్థాన్‌కు స్థానం దక్కాలంటే...

రాజస్థాన్ రాయల్స్ ( జట్టు తమకు మిగిలిన నాలుగు మ్యాచుల్లో విజయం సాధిస్తే మొత్తం 14 పాయింట్లకు చేరుకుంటుంది. ఈ పాయింట్లతో టాప్-4కు వెళ్లడం కష్టమే అయినా... ఇతర జట్ల ఫలితాల ఆధారంగా ప్లేఆఫ్స్‌నకు వెళ్లొచ్చు.

హైదరాబాద్ అన్నింట్లోనూ గెలిస్తేనే!

భారీ అంచనాలతో ఐపీఎల్ 2025 సీజన్‌ను ప్రారంభించిన సన్‌రైజర్స్ హైదరాబాద్ తన పేలవ ప్రదర్శనతో అభిమానులను నిరాశ పరిచింది. ఇంకా తమకు మిగిలిఉన్న అయిదు మ్యాచులకు అయిదింట్లోనూ వరుసగా విజయం సాధిస్తే ప్లేఆఫ్స్‌లో స్థానం దక్కించుకోవచ్చు.

ఫ్.. చెన్నై సూపర్‌కింగ్స్!

ఇప్పటివరకు తొమ్మిది మ్యాచ్‌లు ఆడిన చెన్నై సూపర్ కింగ్స్ కేవలం రెండింట్లో మాత్రమే విజయం సాధించింది. ఇంకా అయిదు మ్యాచులు మిగిలిఉన్నాయి. వీటన్నింటిలోనూ విజయం సాధించినా ప్లేఆఫ్స్‌నకు చేరడం దాదాపు అసాధ్యం. చెన్నై సూపర్‌కింగ్స్ టాప్ 4లో నిలవాలంటే నిజంగా ఏదైనా అద్భుతమే జరగాలి.

# రహానే కోలుకోవడానికి రెండు మూడు రోజులు పట్టొచ్చు: అనుకుల్ రాయ్



ఐపీఎల్ 2025 సీజన్‌లో భాగంగా మంగళవారం దిల్లీ క్యాపిటల్స్ తో కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టు తలపడింది. ఈ పోరులో దిల్లీ క్యాపిటల్స్ 14 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. అయితే ఈ మ్యాచ్ సందర్భంగా కోల్‌కతా కెప్టెన్ అజింక్య రహానే గాయపడ్డాడు. చివరి తొమ్మిది ఓవర్లలో జట్టును సునీల్ నరైన్ ముందుండి నడిపించాడు.

షార్ట్ కవర్‌లో ఫీల్డింగ్ చేస్తున్న క్రమంలో రహానే చేతికి గాయమైంది. దిల్లీ క్యాపిటల్స్ ఓపెనర్ డుప్లెసిస్ ( గట్టిగా కొట్టిన బంతి అజింక్య రహానే చేతిని తాకింది. దీంతో అతడు మైదానాన్ని వీడాల్సి వచ్చింది. ఆట ముగిసేంత వరకు తిరిగి అతడు గ్రౌండ్‌లోకి రాలేదు. చేతికి కట్టుతో కనిపించాడు. ‘అది మరీ అంత తీవ్రమైన గాయం కాదు. ఓ రెండు మూడు రోజుల్లో రహానే కోలుకునే అవకాశం ఉంది. అతడికి కొన్ని కుట్లు పడ్డాయి. డాక్టర్లు పరిస్థితిని అంచనా వేసి మరింత స్పష్టత ఇస్తారు. కానీ ప్రస్తుతానికైతే అతడు బాగానే ఉన్నాడు’ అని కోల్‌కతా నైట్ రైడర్స్ స్పిన్నర్ అనుకుల్ రాయ్ వెల్లడించాడు.

# దిల్లీ క్యాపిటల్స్ కచ్చితంగా పుంజుకుంటుంది: విప్రాజ్ నిగమ్

: ఐపీఎల 2025 సీజన్‌లో భాగంగా మంగళవారం కోల్‌కతా నైట్ రైడర్స్ దిల్లీ క్యాపిటల్స్ ( మధ్య మ్యాచ్ జరిగింది. ఈ పోరులో మొదట బ్యాటింగ్ చేసిన కోల్‌కతా 205 పరుగుల లక్ష్యాన్ని దిల్లీ ముందు ఉంచింది. ఛేజింగ్‌లో దిల్లీ క్యాపిటల్స్ 14 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. హోం గ్రౌండ్‌లో దిల్లీకిది మూడో ఓటమి. ప్రస్తుతం ఈ జట్టు 12 పాయింట్లతో పట్టికలో నాలుగో స్థానంలో కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఆ జట్టు స్పిన్ ఆల్‌రౌండర్ విప్రాజ్ నిగమ్ మీడియాతో మాట్లాడాడు. తమ టీమ్ తిరిగి కచ్చితంగా విజయాల బాట పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశాడు.



‘మేం కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు చెందిన ఇద్దరు ప్రధాన స్పిన్నర్లను లక్ష్యంగా చేసుకుని ఆడాలనుకున్నాం. మొదటి రెండు ఓవర్లలో మేం అనుకున్న ప్రణాళికను బాగానే అమలు చేశాం. కానీ మా బ్యాటర్లు కొన్ని తప్పుడు షాట్ సెలక్షన్స్ వల్ల ఔటయ్యారు. తర్వాత వచ్చిన బ్యాటర్లు వెంటనే పెద్ద షాట్లు ఆడి స్కోర్ రాబట్టాలంటే అంత సులభం కాదు. అప్పటికే సెట్టైన ప్లేయర్లుంటే మేం తేలిగ్గా గెలిచి ఉండేవాళ్లం. ఐపీఎల్ ప్రయాణం ఎప్పుడూ సాఫీగా సాగదు. ఇందులో ఒడుదొడుకులు సాధారణం. మేం ఇప్పటికే టాప్ 4లో ఉన్నాం. మా చేతిలో ఇంకా అయిదు మ్యాచులున్నాయి. మేం కచ్చితంగా తిరిగి పుంజుకుంటాం. ప్లేఆఫ్స్‌నకు స్థానం సంపాదించడమే కాదు. టాప్2లో ఉంటాం’ అని విప్రాజ్ నిగమ్ అన్నాడు.




# నేడు రికార్డుల బాహుబలి.. రో‘హిట్’ శర్మ బర్త్ డే...

ఈ రోజు టీమ్‌ఇండియా కెప్టెన్, హిట్‌మ్యాన్ రోహిత్ శర్మ బర్త్‌డే. అతడు 37 సంవత్సరాలు పూర్తి చేసుకొని 38 లోకి అడుగుపెడుతున్నాడు. కొన్ని ఏళ్లుగా రోహిత్ శర్మ భారత జట్టుకు తన సేవలు అందిస్తున్నాడు. ఈక్రమంలో ఎన్నో రికార్డులు తన ఖాతాలో వేసుకున్నాడు. ఈనేపథ్యంలో కేవలం హిట్ మ్యాన్‌కే సాధ్యమైన కొన్ని రికార్డుల గురించి క్లుప్తంగా తెలుసుకుందాం.

వన్డేల్లో రారాజు

రోహిత్ శర్మకు వన్డే క్రికెట్‌లో అద్భుతమైన రికార్డులున్నాయి. సెంచరీ చేయడమే గగనమైపోతున్న ఈ రోజుల్లో హిట్‌మ్యాన్‌కు ఏకంగా ఈ ఫార్మాట్లో మూడు డబుల్ సెంచరీలున్నాయి. రోహిత్ శర్మకు వన్డే ఫార్మాట్లో 264 పరుగులు అత్యధిక వ్యక్తిగత స్కోరు. వన్డేల్లో ఒక టీమ్ కొట్టే స్కోర్ ఇది. టీమ్ అంతా కొట్టే స్కోర్‌ను రోహిత్ శర్మ ఒక్కడే బాది చూపించాడు. 2014 నవంబరు 13న కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో, రోహిత్ శర్మ శ్రీలంకపై 264 పరుగులు చేసి వన్డే క్రికెట్‌లో కొత్త బెంచ్‌మార్క్‌ను నెలకొల్పాడు. ఇప్పటివరకు ఈ ఫార్మాట్‌లో ఇదే అత్యధిక వ్యక్తిగత స్కోరు. ఇంతవరకు ఈ రికార్డు బ్రేక్ కాలేదు. ఈ ఇన్నింగ్స్‌లో రోహిత్ శర్మ 33 ఫోర్లు, 9 సిక్స్‌లు బాదాడు.

వరల్డ్ కప్‌లో శతకాల వర్షం..

2019 వన్డే వరల్డ్ కప్‌లో రోహిత్ శర్మ పేరిట అద్భుతమైన రికార్డు ఉంది. తాను ఆడిన తొమ్మిది ఇన్నింగ్స్‌ల్లో ఏకంగా 5 సెంచరీలు నమోదు చేశాడు. ఇప్పటివరకు ఒక వరల్డ్‌కప్‌లో ఏ బ్యాటర్ కూడా ఇన్ని సెంచరీలు చేయలేదు.

పొట్టి ఫార్మాట్‌లోనూ గట్టోడే!

కేవలం వన్డేల్లోనే కాదు.. పొట్టి ఫార్మాట్ అయిన టీ20ల్లోనూ రోహిత్ శర్మకు ఘనమైన రికార్డుంది. ఇప్పటివరకు రోహిత్ శర్మ ఈ ఫార్మాట్లో 5 సెంచరీలు చేశాడు. ఇందులో ఓ సెంచరీని కేవలం 35 బంతుల్లోనే పూర్తి చేశాడు.

సిక్సుల మోతే..

ఆడేది అయిదు రోజుల టెస్ట్‌మ్యాచ్ అయినా, 50 ఓవర్ల వన్డే అయినా, 20 ఓవర్ల పొట్టి క్రికెట్ అయినా.. ఫార్మాట్ ఏదైనా రోహిత్ శర్మ ఫార్ములా ఒక్కటే.... సిక్సుల మోత మోగించడం. ఇప్పటివరకు రోహిత్ శర్మ ఏకంగా 637 సిక్స్‌లు బాది, ఈ జాబితాలో ప్రథమస్థానంలో ఉన్నాడు. ఈ లిస్ట్‌లో యూనివర్సల్ బాస్ క్రిస్‌గేల్ 553 సిక్స్‌లతో రెండోస్థానంలో ఉన్నాడు. అలాగే వరల్డ్ కప్‌లు, ఛాంపియన్స్ ట్రోఫీ లాంటి ఐసీసీ వన్డే టోర్నమెంట్లలోనూ రోహిత్ శర్మ 68 సిక్సులు బాదాడు. ఈ జాబితాలోనూ హిట్‌మ్యానే టాప్ ప్లేస్‌లో ఉన్నాడు. అలాగే ఆస్ట్రేలియా మీద 132 సిక్స్‌లు బాదాడు. ఒక ప్రత్యర్థి జట్టుపై రోహిత్ తప్ప ఏ బ్యాటర్ కూడా ఇన్ని సిక్స్‌లు కొట్టలేదు. కేవలం సిక్సులే కాదు.. ఫోర్లలోనూ రోహిత్ శర్మకు ఒక రికార్డు ఉంది. తన 264 పరుగుల ఇన్నింగ్స్‌లో 33 ఫోర్లు బాదాడు కదా! ఒక వన్డే ఇన్నింగ్స్‌లో ఇన్ని ఫోర్లు కొట్టిన బ్యాటర్ ఇంకెవరూ లేరు. మొత్తానికి మన హిట్ మ్యాన్‌కు మంచి ఘనమైన రికార్డులే ఉన్నాయి. నేడు అతడి పుట్టినరోజు సందర్భంగా అభిమానులు వీటన్నింటినీ ఓసారి నెమరువేసుకుంటూ.. సోషల్ మీడియాలో పోస్టులు పెడుతూ తమ ఫేవరేట్ బ్యాటర్‌కు బర్త్‌డే విషెస్ చెబుతున్నారు.

# సత్తా చాటిన స్నేహ్, ప్రతీక .. దక్షిణాఫ్రికాపై భారత్ గెలుపు

కొలంబో: ముక్కోణపు వన్డే సిరీస్‌లో భారత మహిళల జట్టు జోరు కొనసాగిస్తోంది. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో హర్మన్‌ప్రీత్ బృందం వరుసగా రెండో విజయాన్ని ఖాతాలో వేసుకుంది. మంగళవారం 15 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాను ఓడించింది. బౌలింగ్‌లో స్నేహ్‌రాణా (5/43).. బ్యాటింగ్‌లో ప్రతీక రావల్ (78బీ 91 బంతుల్లో 7ఐ4, 1ఐ6) టీమ్‌ఇండియా గెలుపులో కీలకపాత్ర పోషించారు. సఫారీ జట్టు ఓపెనర్ టాజ్మిన్ బ్రిట్స్ (109బీ 107 బంతుల్లో 13ఐ4, 3ఐ6) శతకం వృథా అయింది. మొదట బ్యాటింగ్ చేసిన భారత్ 5 వికెట్లకు 276 పరుగులు సాధించింది. ఫామ్‌ను కొనసాగించిన ఓపెనర్ ప్రతీక.. మొదటి వికెట్‌కు స్మృతి మంధాన (36బీ 54 బంతుల్లో 5ఐ4)తో 83 పరుగులు జోడించి ఇన్నింగ్స్‌కు గట్టి పునాది వేసింది. హర్మన్‌ప్రీత్ (41), జెమీమా రోడ్రిగ్స్ (41), హర్లీన్ డియోల్ (29), రిచా ఘోష్ (24) తలో చేయి వేయడంతో భారత్ మెరుగైన స్కోరు సాధించగలిగింది. దక్షిణాఫ్రికా బౌలర్లలో ఎంలబా (2/55) రాణించింది. బదులుగా దక్షిణాఫ్రికా 49.2 ఓవర్లలో 261 పరుగులకే ఆలౌటైంది. ఛేదనలో బ్రిట్స్ జట్టును ముందుకు నడిపించింది. కెప్టెన్ లారా వోల్వార్ట్ (43)తో ఆమె తొలి వికెట్‌కు 140 పరుగులు జత చేయడంతో సఫారీ జట్టు లక్ష్యం దిశగా దూసుకెళ్లింది. వోల్వార్ట్‌ని ఔట్ చేయడం ద్వారా దీప్తిశర్మ (1/40) ఈ జోడీని విడగొట్టింది. అయినా 33 ఓవర్లకు 170/2తో దక్షిణాఫ్రికా మెరుగైన స్థితిలో నిలిచింది. భారత స్పిన్నర్లు విజృంభించడంతో ఆ జట్టు 80 పరుగుల వ్యవధిలో 8 వికెట్లు కోల్పోయి ఓటమి కొనితెచ్చుకుంది. ఆఫ్ స్పిన్నర్ స్నేహ్‌రాణా ఆ జట్టు పతనంలో కీలకపాత్ర పోషించింది. సెంచరీ చేసి జోరు మీద కనిపించిన బ్రిట్స్.. ఎండకు తాళలేక 33వ ఓవర్ తర్వాత రిటైర్ కావడం దక్షిణాఫ్రికాను దెబ్బ తీసింది. 48వ ఓవర్లో బ్రిట్స్ మళ్లీ బ్యాటింగ్‌కు వచ్చినా.. జట్టును గెలిపించలేకపోయింది. ఆమె తన స్కోరుకు ఒక్క పరుగే జోడించగలిగింది. 48వ ఓవర్ వేసిన స్నేహ్.. డిక్లెర్క్ (0), డెర్క్‌సెన్ (30)తో పాటు బ్రిట్స్‌ను ఔట్ చేసి అయిదు వికెట్ల ఘనతను పూర్తి చేయడమే కాక విజయాన్ని ఖాయం చేసింది. సంక్షిప్త స్కోర్లు... భారత్: 276/6 (ప్రతీక 78, స్మృతి 36, హర్లీన్ 29, హర్మన్‌ప్రీత్ 41, జెమీమా 41బీ ఎంలబా 2/55) దక్షిణాఫ్రికా: 49.2 ఓవర్లలో 261 ఆలౌట్ (బ్రిట్స్ 109, వోల్వార్ట్ 43

# '3 ఇడియట్స్' సీన్‌తో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లకు సుందర్ పిచాయ్ సలహా..



ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికత వినియోగం పెరుగుతున్న తరుణంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లకు గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ సలహా అందించారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికత వినియోగం నానాటికీ పెరుగుతోంది. ఈ క్రమంలోనే అభ్యర్థుల్లో ఉద్యోగాలపై ఆందోళన నెలకొంది. దీంతో ఉద్యోగులకు సూచనలు అందించారు గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన రోట్ లెర్నింగ్ గురించి మాట్లాడారు. అలానే తనకు ఇష్టమైన భారతీయ వంటకాల గురించి పంచుకున్నారు.

టాప్ టెక్ సంస్థలైన (ఫేస్‌బుక్, యాపిల్, అమెజాన్, నెట్‌ఫ్లిక్స్, గూగుల్) సంస్థల్లో ఇంటర్వ్యూల్లో విజయం సాధించడమెలాగో యువకులకు సలహా ఇవ్వాలని ఇంటర్వ్యూయర్ పిచాయ్‌ని కోరారు. దీంతో "రోట్ లెర్నింగ్(బట్టీ పట్టి చదవడం)".. అనే అంశాన్ని పిచాయ్ ప్రస్తావించారు. విషయాన్ని లోతుగా అర్థం చేసుకోవడం ద్వారా నిజమైన విజయం వస్తుందని తాను బలంగా నమ్ముతానన్నారు. అదే పద్ధతినే ఇప్పటి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు పాటించాలన్నారు. ఏదైనా అంశాన్ని తెలుసుకోవడానికి, అర్థం చేసుకోవడానికి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని వివరించేందుకు "3 ఇడియట్స్"లోని ఓ సన్నివేశాన్ని గుర్తుచేశారు. అందులో మోటార్ ఎలా పనిచేస్తుందో నిర్వచించమని ఓ విద్యార్థిని అడగ్గా.. కంఠస్థం చేసిన డెఫినేషన్ చెప్పకుండా సాధారణ పదాలతో యంత్రం అంటే ఏమిటో వివరిస్తాడు. విషయాన్ని గ్రహించడమంటే ఇదే అని అన్నారు.'సాంకేతికతను లోతుగా అర్థం చేసుకోవాలి. అలా చేస్తేనే మీరు పరివర్తన చెందగలరు. ఏదైనా సాధించగలం అని నేను నమ్ముతాను" అని పిచాయ్ అన్నారు. ఇక ఇష్టమైన భారతీయ వంటకం గురించి అడగ్గా.. ప్రాంతాన్ని బట్టి తనకు వంటకాలు నచ్చుతాయన్నారు. "బెంగళూరులో ఉన్నప్పుడు నేను దోశ బాగా తినేవాడిని. అది నాకు చాలా ఇష్టమైన ఫుడ్. దిల్లీలో అయితే చోలే బటూరే. ఇక ముంబయిలో అయితే పావ్ భాజీ" అని చెప్పుకొచ్చారు. ఇదే ఇంటర్వ్యూలో ఏఐ సాంకేతికత, స్టార్టప్‌ల గురించి కూడా ఆయన ప్రస్తావించారు.

# వసూళ్లు 27%.. వదులుకుంది 73%

దిల్లీ: నిరర్థక ఆస్తులుగా మారిన రుణాల నుంచి వసూళ్లకు చేపట్టిన దివాలా పరిష్కార ప్రక్రియ, ఆర్థిక సంస్థలకు ఎంతగా ఉపయోగ పడుతోందో ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. బ్యాంకులు–ఇతర ఆర్థిక సంస్థలు ఇస్తున్న రుణ మొత్తంతో పోలిస్తే, దివాలా పరిష్కార ప్రక్రియ కింద వసూలవుతున్న మొత్తం నాలుగో వంతుకు పరిమితం కావడం ఇందుకు కారణం. 2022-23లో ప్రతి రూ.100 బకాయిల్లో, ఆర్థిక సంస్థలు దివాలా ప్రక్రియ కింద రూ.64 వదులుకోగా, 2023-24లో ఈమొత్తం మరింత అధికమై రూ.73 పోగొట్టుకున్నట్లు రేటింగ్ సంస్థ ఇక్రా తెలిపింది. 2022-23లో రుణ సంస్థలకు రావాల్సిన బకాయిల్లో సగటున 36 శాతం రాగా, 2023-24లో ఇది 27 శాతానికి పరిమితమైనట్లు సంస్థ నివేదిక వెల్లడించింది. 2023-24లో మొత్తంగా 269 దివాలా పరిష్కార ప్రక్రియలకు జాతీయ కంపెనీ లా ట్రైబ్యునళ్లు ఆమోదం తెలిపాయి. 2022-23లో ఈ సంఖ్య 189గా ఉంది. కొత్తగా దాఖలైన దివాలా పరిష్కార దరఖాస్తుల సంఖ్య 2022-23లోని 1,263తో పోలిస్తే 2023-24లో 987కు తగ్గింది. కార్పొరేట్ దివాలా పరిష్కార ప్రక్రియలో, పలు కారణాల రీత్యా రుణ సంస్థలు తమకు రావాల్సిన మొత్తం బకాయిల నుంచి కొంత మొత్తాన్ని వదులుకోవడం లేదా త్యాగం చేయక (హెయిర్‌కట్) తప్పట్లేదు. ఈ మొత్తం మరీ ఎక్కువగా ఉంటుండటంపైనే ఆందోళన వ్యక్తమవుతోందని ఇక్రా హెడ్ (స్ట్రక్చర్డ్ ఫైనాన్స్ రేటింగ్స్) అభిషేక్ డాఫ్రియా తెలిపారు.




జాప్యం వల్లే: దివాలా స్మృతి ప్రకారం.. దివాలా పరిష్కార ప్రక్రియను 330 రోజుల్లో పూర్తి చేయాలి. అయితే దివాలా పరిష్కార ప్రక్రియ పూర్తికి పడుతున్న సమయం 2023-24లో సగటున 843 రోజులకు పెరిగింది. న్యాయ వివాదాలు ఇందుకు కారణమవుతున్నాయి. ఆర్థిక సంస్థలు తమకు రావాల్సిన బకాయిల్లో, భారీమొత్తాన్ని వదులుకోవాల్సిన పరిస్థితి ఏర్పడటానికి ఈ పరిణామమూ ఓ కారణమని ఇక్రా తెలిపింది. 2024-25లోనూ రుణ సంస్థలకు వసూళ్ల సగటు 30-35 శాతంగానే కొనసాగొచ్చని అభిప్రాయపడింది. 2023-24లో మొత్తంగా ఎన్‌సీఎల్‌టీ 446 కేసుల్లో లిక్విడేషన్ (ఆస్తుల విక్రయానికి) ఆదేశాలు జారీచేసింది. 2022-23లో ఈ సంఖ్య 400గా ఉంది. దివాలా స్మృతి అమల్లోకి వచ్చినప్పటి నుంచి మొత్తం 5,467 దివాలా పరిష్కార ప్రక్రియలు పూర్తి కాగా.. ఇందులో 45% శాతం కేసులు లిక్విడేషన్‌కు దారి తీశాయి.

# నవ లిమిటెడ్.. రుణ రహితం



హైదరాబాద్,ఫెర్రో అల్లాయ్స్, మైనింగ్, విద్యుదుత్పత్తిలో నిమగ్నమై ఉన్న నవ లిమిటెడ్, గత ఆర్థిక సంవత్సరం మార్చి త్రైమాసికంలో ఏకీకృత ఖాతాల ప్రకారం రూ.951.6 కోట్ల ఆదాయాన్ని, రూ.255.1 కోట్ల నికరలాభాన్ని ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరం (2023-24) పూర్తి కాలానికి రూ.3,955 కోట్ల ఆదాయంపై రూ.1,256 కోట్ల నికరలాభాన్ని సంస్థ నమోదు చేసింది. 2022-23తో పోల్చితే వార్షిక లాభం 2.8% పెరిగింది. నవ లిమిటెడ్‌కు ఆఫ్రికాలోని అనుబంధ సంస్థ అయిన ఎంసీఎల్ (మాంబా కాలరీస్ లిమిటెడ్), గత ఆర్థిక సంవత్సరంలో 314.4 మిలియన్ డాలర్ల (సుమారు రూ.2,621 కోట్లు) దీర్ఘకాలిక రుణాన్ని పూర్తిగా చెల్లించింది. దీంతో నవ లిమిటెడ్ రుణ రహిత కంపెనీగా మారింది. తద్వారా భవిష్యత్తులో ఎంసీఎల్ నుంచి మాతృ సంస్థ అయిన నవ లిమిటెడ్‌కు లాభాలు జమ అయ్యే అవకాశం కలుగుతోంది. వాటాదార్లకు 200% డివిడెండ్ (రూ.2 ముఖ విలువ గల ఒక్కో షేరుకు రూ.4 చొప్పున) చెల్లించాలని యాజమాన్యం ప్రతిపాదించింది.

మెరుగైన పనితీరు: నవ లిమిటెడ్ అనుబంధ సంస్థ, నవ భారత్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ పనితీరు మెరుగుపడింది. ఈ సంస్థకు చెందిన 150 మెగావాట్ల పవర్ ప్లాంట్ ఏడాది మొత్తం పనిచేసిన ఫలితంగా రూ.115 కోట్ల పీబీటీ (పన్నుకు ముందు లాభం) నమోదైంది. ఫెర్రో అల్లాయ్స్ విభాగమూ మార్చి త్రైమాసికంలో మెరుగైన ఫలితాలు సాధించింది. మైనింగ్ విభాగం ఆదాయాలు 21.2%, పీబీటీ 165% పెరిగాయి. గనుల తవ్వకాలు.. అవకాడో పెంపకం: ఎంసీఎల్ తన విద్యుదుత్పత్తి సామర్థ్యాన్ని విస్తరించనుంది. రెండో దశలో 300 మెగావాట్ల ప్లాంట్ నిర్మించేందుకు అవసరమైన నిధుల సమీకరణ యత్నాలు చేపట్టింది. దీంతో పాటు జాంబియా సెంట్రల్ ప్రావిన్స్‌లో 323 హెక్టార్లలో మాగ్నటైట్ గని అభివృద్ధి చేసే అంశాన్ని ఎంసీఎల్ పరిశీలిస్తూ, గనుల తవ్వకం హక్కుల కోసం అక్కడ ప్రభుత్వానికి దరఖాస్తు చేసింది. వచ్చే ఏడాది కాలంలో దీనికి సంబంధించిన వ్యాపార ప్రణాళికను సిద్ధం చేసి, మైనింగ్ కార్యకలాపాలు చేపట్టాలని ఎంసీఎల్ భావిస్తోంది. మరొక అనుబంధ సంస్థ నవ అవకాడో లిమిటెడ్ దాదాపు 225 హెక్టార్లలో 75,000 అవకాడో మొక్కలు నాటింది. రెండు నెలల్లో మరో 20,000 మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉంది. ఈ ప్లాంటేషన్ నుంచి రెండేళ్లలో ఆదాయాలు వస్తాయని యాజమాన్యం ఆశిస్తోంది. అన్ని విభాగాలు బాగున్నాయి: ఏకీకృత, స్టాండ్ అలోన్ స్థాయిలో పూర్తిగా అప్పు తీర్చేసి రుణ రహిత కంపెనీగా మారటం ఎంతో గొప్ప విషయంగా భావిస్తున్నట్లు నవ లిమిటెడ్ సీఈఓ అశ్విన్ దేవినేని పేర్కొన్నారు. రెండున్నరేళ్ల గడువు ఉన్నప్పటికీ ముందే బకాయిలు తీర్చడం వల్ల, దీర్ఘకాలంలో సత్ఫలితాలు కనిపిస్తాయని అన్నారు. సంస్థలోని అన్ని వ్యాపార విభాగాలు మెరుగైన స్థితిలో ఉన్నాయని తెలిపారు.

# కియా కార్లు అద్దెకూ తీసుకోవచ్చు.. హైదరాబాద్ సహా 6 నగరాల్లో

హైదరాబాద్: కారు కొంటే బీమా - నిర్వహణ ఖర్చుల వంటివి తప్పవు. మరో కొత్త మోడల్ కొనుగోలుకు పాత కారు విక్రయించాలంటే తగిన ధర వస్తుందో రాదో అనే బెంగ ఒకటి. ఇలాంటివి ఏమీ లేకుండా, కొత్త కారును లీజుపై తీసుకుని, వాడుకునే సేవను కియా ఇండియా అందుబాటులోకి తెస్తోంది.

ఓరిక్స్ ఆటో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సర్వీసెస్‌తో ఒప్పందాన్ని కుదుర్చుకుని, 'కియా లీజ్' సేవను హైదరాబాద్, దిల్లీ, ముంబయి, చెన్నై, బెంగళూరు, పుణేలలో అందుబాటులోకి తీసుకురానున్నట్లు కియా ఇండియా చీఫ్ సేల్స్ ఆఫీసర్ మ్యుంగ్-సిక్ సోన్ తెలిపారు.

# జీవిత బీమా పన్ను ఆదాకు మించి



ఆదాయపు పన్ను మినహాయింపు గురించి ఆలోచించే వారు ముందుగా చూసేది బీమా పాలసీలనే. పన్ను ప్రణాళికలను ప్రారంభించాల్సిన సమయం కావడంతో బీమా సంస్థలూ ఇప్పుడు పలు కొత్త పాలసీలతో ముందుకు వస్తుంటాయి. అయితే వీటిని కేవలం పన్ను ఆదా కోసమే ఎంచుకోవద్దు. అంతకు మించి కుటుంబానికి ఆర్థిక రక్షణ కల్పించేలా చూసుకోవాలి. పాత ఆదాయపు పన్ను విధానం ఎంచుకున్న వారు.. సెక్షన్ 80సీ పరిమితి రూ.1,50,000 వరకూ వివిధ పెట్టుబడి పథకాల్లో మదుపు చేయాల్సి ఉంటుంది. ఇందులో జీవిత బీమా పాలసీలకు చెల్లించే ప్రీమియమూ వస్తుంది. ఇప్పటికే చాలామందికి పన్ను కోత ప్రారంభమైంది. దీంతో మినహాయింపు పొందడం కోసం భిన్న పథకాలను పరిశీలిస్తున్నారు. ఇందులో జీవిత బీమా పాలసీలకు ప్రాధాన్యం అధికంగా ఉంటుంది. రక్షణకే ప్రాధాన్యం..జీవిత బీమా ప్రథమ సూత్రం.. అనుకోని కష్టం వచ్చినప్పుడు కుటుంబానికి ఆర్థికంగా రక్షణ కల్పించాలి. పన్ను ప్రయోజనం కోసం మాత్రమే ఈ పాలసీని ఎంచుకున్న వారు ఎక్కువ ప్రీమియం పాలసీలను కొనుగోలు చేస్తుంటారు. దీనివల్ల మీ పన్ను ఆదా లక్ష్యం నెరవేరుతుంది. కానీ, కుటుంబానికి అవసరమైన రక్షణ మాత్రం లభించకపోవచ్చు. బాధ్యతలకు తగ్గట్టుగా..ముందుగా మీకు ఎంత మొత్తానికి బీమా అవసరమో చూసుకోండి. మీ ఆదాయం, జీవన శైలి, బాధ్యతలు, అప్పులు అన్నీ లెక్కించుకొని ఎంత విలువైన పాలసీని తీసుకోవాలన్నది చూసుకోవాలి. ఉదాహరణకు పిల్లల వయసు అయిదేళ్లు అనుకుందాం. రాబోయే 18 ఏళ్లపాటు మీపై ఆధారపడి ఉంటారనుకుందాం. అంటే.. 18 ఏళ్లపాటు వారి అవసరాలను తీర్చే మొత్తంతో బీమా పాలసీని తీసుకోవాలి. మీ వార్షికాదాయానికి 10-12 రెట్ల వరకూ జీవిత బీమా పాలసీ ఉండటం ఎప్పుడూ మంచిది. అంతేకానీ, కేవలం పన్ను ఆదా కోసం చూసుకుంటూ.. తక్కువ మొత్తం పాలసీని తీసుకోవడం కుటుంబానికి శ్రేయస్కరం కాదు. కొత్తగా తీసుకుంటుంటే..

ఇప్పటి వరకూ బీమా పాలసీ తీసుకోని వారు.. టర్మ్ పాలసీకి ప్రాధాన్యం ఇవ్వండి. తక్కువ ప్రీమియానికి, అధిక రక్షణ లభిస్తుంది. పన్ను ఆదాకూ ఉపయోగపడుతుంది. పాలసీని ఏటా పునరుద్ధరించుకోవాల్సి ఉంటుంది. సాధారణ టర్మ్ పాలసీలను ఎంచుకుంటే.. గడువు తీరిన తర్వాత ఎలాంటి మొత్తమూ వెనక్కి రాదు. ఇప్పుడు కొత్తగా కొన్ని టర్మ్ పాలసీలు ప్రీమియం వెనక్కి ఇస్తామని చెబుతున్నాయి. వీటికి కాస్త అధిక ప్రీమియం ఉంటుంది. వీటికి బదులు సాధారణ టర్మ్ పాలసీలను ఎంచుకునే ప్రయత్నం చేయొచ్చు. పాలసీ అవసరం లేదు అనుకుంటే.. ప్రీమియం చెల్లింపును కావాలనుకున్నప్పుడు ఆపేయొచ్చు. మారుతున్న అవసరాలను బట్టి, పాలసీ విలువనూ పెంచుకునే ప్రయత్నం చేయొచ్చు. పెట్టుబడి కోసమూ..కుటుంబ ఆర్థిక రక్షణ కోసం పాలసీని తీసుకున్న తర్వాత సంపద సృష్టి కోసం బీమా పాలసీలను ఎంచుకోవచ్చు. ఇందులోనూ యూనిట్ ఆధారిత బీమా పాలసీలు(యులిప్), ఎండోమెంట్ పాలసీల వంటివి పరిశీలించాలి. యులిప్‌లను ఎంచుకునేటప్పుడు ఎన్నేళ్లపాటు, ఎంత ప్రీమియం చెల్లించాలి అనే విషయం గమనించాలి. కనీసం అయిదేళ్ల ప్రీమియం చెల్లిస్తేనే ఈ పాలసీలకు స్వాధీన విలువ వస్తుంది. మార్కెట్ హెచ్చుతగ్గుల ప్రభావం కొంత ఉంటుంది. దీర్ఘకాలిక దృష్టితో ఈ పాలసీని ఎంచుకోవాలి. చిన్న వయసులో ఉన్న వారు యులిప్‌లను ఎంచుకున్నప్పుడు ఈక్విటీ ఆధారిత ఫండ్లకు ప్రాధాన్యం ఇవ్వాలి. దీనివల్ల 15 ఏళ్ల తర్వాత మంచి రాబడిని అందుకునేందుకు వీలవుతుంది. ఇప్పటికే జీవిత బీమా పాలసీలుంటే.. ఒకసారి దానిని సమీక్షించుకోండి. మారిన మీ ఆర్థిక పరిస్థితులు, బాధ్యతలు, జీవన శైలి, ద్రవ్యోల్బణంలాంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని, ఆ మేరకు బీమా విలువ ఉందా లేదా చూసుకోండి. అప్పుడే మీ కుటుంబం ఎలాంటి పరిస్థితులనైనా తట్టుకొని, నిలబడగలదని గుర్తుంచుకోండి.

అవసరాలు చూడాలిమీ కుటుంబ అవసరాల మేరకు మాత్రమే పాలసీని తీసుకోవాలి. పన్ను ప్రయోజనాలను ఆ పాలసీ కల్పించే అదనపు ప్రయోజనంగానే చూడాలి. ముందుగా ఆ పాలసీ అందించే ప్రయోజనాలన్నీ తెలుసుకోవాలి. అదే తరహాలో మిగతా బీమా సంస్థలు అందిస్తున్న పాలసీని పోల్చి చూడాలి. ఇందులో ఏది మీకు అనువుగా ఉందో చూసుకొని, ఆ పాలసీని ఎంచుకోవాలి

# స్టాక్ మార్కెట్... పెట్టుబడులు.. కాస్త అప్రమత్తంగా

ఎన్నికలు.. ఇతర కారణాలతో స్టాక్ మార్కెట్లు మిశ్రమంగా స్పందిస్తున్నాయి. ఒకవైపు అంతర్జాతీయ మదుపరులు మన మార్కెట్లపై నిరాశావాద దృక్పథంతో ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. మరోవైపు పెట్టుబడులు పెట్టడానికి ఇదే సరైన తరుణం అంటూ సానుకూల మాటలు.. ఇలాంటి పరిస్థితుల్లో పెట్టుబడులు కొనసాగించాలా? వద్దా అనే సందేహం చాలామందికి వస్తోంది. సూచీలకు వస్తున్న నష్టాలు వారిని ఆందోళనలోనూ పడేస్తున్నాయి. ఇలాంటి ప్రత్యేక పరిస్థితుల నేపథ్యంలో మదుపరులు పాటించాల్సిన సూత్రాలేమిటో చూద్దాం..కొంత కాలంగా స్టాక్ మార్కెట్లు గణనీయంగా పెరిగాయి. జీవన కాల గరిష్ఠాలను తాకి వెనక్కి వచ్చాయి. రెండు మూడేళ్ల క్రితం నుంచి మదుపు చేస్తున్న వారి ఈక్విటీ పోర్ట్‌ఫోలియోల విలువ దాదాపు 25-30 శాతం వరకూ పెరిగిన సందర్భాలూ కనిపిస్తున్నాయి. ఇప్పుడు మార్కెట్లలో కొంత అనిశ్చితి నెలకొంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని, పెట్టుబడులను సర్దుబాటు చేసుకునేందుకు ఇది సరైన సమయమని నిపుణులు చెబుతున్నారు. మంచి పనితీరున్న కంపెనీలు, ఫండ్లను ఎంచుకునేందుకు ఇప్పుడు మంచి అవకాశంగా పేర్కొంటున్నారు.అనిశ్చితి ఉన్నా..మార్కెట్ కొంత గందరగోళంగా ఉందన్న మాట వాస్తవం. కానీ, పెట్టుబడులను ఉపసంహరించుకునేందుకు ఇదొక్కటే కారణం కాకూడదు. పెట్టుబడులు పెట్టాలని నిర్ణయించుకున్నప్పుడే 10-20 శాతం దిద్దుబాటు కచ్చితంగా ఉంటుంది అని తెలుసుకోవాలి. బలమైన కారణం ఉంటేనే పెట్టుబడులను వెనక్కి తీసుకోవాలి. ఎంపికలో జాగ్రత్త..




ఎన్నికలు.. ఇతర కారణాలతో స్టాక్ మార్కెట్లు మిశ్రమంగా స్పందిస్తున్నాయి. ఒకవైపు అంతర్జాతీయ మదుపరులు మన మార్కెట్లపై నిరాశావాద దృక్పథంతో ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. మరోవైపు పెట్టుబడులు పెట్టడానికి ఇదే సరైన తరుణం అంటూ సానుకూల మాటలు..

కరోనా తర్వాత మార్కెట్ ఇస్తున్న లాభాలను చూసిన చాలామంది ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లతోపాటు, నేరుగా షేర్లలోనూ మదుపు చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. పెట్టుబడులను ఎంచుకునేటప్పుడు కాస్త వైవిధ్యం పాటించాల్సిన అవసరం ఉంది. ఒకే పథకంలో మొత్తం మదుపు చేయడం మంచిది కాదు. మీ పెట్టుబడుల్లో కొంత నష్టభయం ఉన్న వాటికీ, మిగిలిన మొత్తం సురక్షిత పథకాలకూ కేటాయించండి. అప్పుడే అనిశ్చితిలోనూ మీ డబ్బుకు ఇబ్బంది ఉండదు. పోర్ట్‌ఫోలియోను సిద్ధం చేసుకునేటప్పుడు లార్జ్, మిడ్, స్మాల్ క్యాప్ షేర్లు, ఫండ్లు ఉండేలా చూసుకోవడం మంచిది.మార్పులకు సరైన సమయం..మీ ప్రస్తుత పెట్టుబడులను ఒకసారి సమీక్షించుకోండి. సూచీల్లో వృద్ధి కారణంగా మీ ఈక్విటీ పెట్టుబడుల మొత్తం పెరిగిపోవచ్చు. ఇందులో కొంత భాగాన్ని వెనక్కి తీసుకొని, సురక్షిత పెట్టుబడుల వైపు మళ్లించవచ్చు. లార్జ్, మిడ్, స్మాల్ క్యాప్ పథకాల్లో ఉన్న పెట్టుబడులనూ ఒకసారి పరిశీలించండి. స్మాల్, మిడ్ క్యాప్‌లలో అధికంగా ఉంటే.. వాటిని కొంత మేరకు విక్రయించి, లార్జ్ క్యాప్‌లోకి మార్చండి. మార్కెట్లో అన్ని కంపెనీల షేర్లూ ఒకే విధంగా పడిపోవు. మార్కెట్ పతనం అవుతున్నప్పుడూ కొన్ని రంగాలు, సంస్థల షేర్లు లాభాలు ఇస్తుంటాయి. ప్రతికూల పరిస్థితులు ఉన్నప్పుడు కొన్ని మంచి కంపెనీల షేర్లూ తగ్గుతుంటాయి. వీటిలో దశల వారీగా మదుపు చేసేందుకు ప్రయత్నించాలి. సరైన సమయంలో సరైన నిర్ణయం.. మార్కెట్లో ఎప్పుడూ దీన్ని మర్చిపోవద్దు.దీర్ఘకాలం కోసమే..దీర్ఘకాలిక లక్ష్యం కోసం మదుపు చేస్తున్నప్పుడు స్వల్పకాలిక లాభాలపై దృష్టి పెట్టకూడదు. కొంతమంది లాభాలు ఇస్తున్న షేర్లను విక్రయించి, నష్టాలు వచ్చిన వాటిని కొనసాగిస్తుంటారు. ఇది సరైన వ్యూహం కాదు. మార్కెట్లో దిద్దుబాటు అంటే దీర్ఘకాలిక మదుపరులకు ఒక అవకాశం. ఇప్పుడు మొత్తం పెట్టుబడి, లాభాలను వెనక్కి తీసుకొని, మార్కెట్ తగ్గినప్పుడు మదుపు చేయాలనేదీ సరైన వ్యూహం కాదు. మార్కెట్ నుంచి ఒకసారి బయటకు వస్తే.. తిరిగి ప్రవేశించడం అంత తేలిక కాదు. విలువలు ఎప్పటికప్పుడు పెరుగుతూనే ఉంటాయి. అప్పుడు మళ్లీ పోర్ట్‌ఫోలియోను నిర్మించడం కష్టం అవుతుంది. కాబట్టి, క్రమానుగత పెట్టుబడులను కొనసాగిస్తూనే ఉండాలి. మీకు సంతృప్తి అనిపించినప్పుడు ఆ మేరకు లాభాలను స్వీకరించే ప్రయత్నం చేయొచ్చు.వైవిధ్యంగా..లక్ష్యం, పెట్టుబడి వ్యవధి ఆధారంగా పథకాలను ఎంచుకోవాలి. అప్పుడే నష్టభయమూ పరిమితంగా ఉంటుంది. పెట్టుబడి పథకాలను వృద్ధి, నాణ్యత, విలువ ఆధారంగా చూడాలి. మార్కెట్లో అందుబాటులో ఉన్న పథకాల్లో మనకు ఏది సరిపోతుంది అనేది తెలుసుకుంటే చాలు. పెట్టుబడుల్లో 15-20 శాతం వరకూ అంతర్జాతీయ ఫండ్లకూ కేటాయించాలి. కనీసం 10-15 శాతం వరకూ డెట్ పథకాలకూ మళ్లించాలి. 10 శాతం వరకూ బంగారంలోనూ మదుపు చేయాలి. ఈక్విటీ మార్కెట్‌లో దిద్దుబాటు వచ్చినప్పుడు ఈ పెట్టుబడులు కొంత ఊరటనిస్తాయి. ఈటీఎఫ్‌లు, ఫండ్ ఆఫ్ ఫండ్స్, ఇండెక్స్ ఫండ్ల ద్వారా పాసివ్ పెట్టుబడులు పెట్టేందుకూ ప్రయత్నించాలి.మార్కెట్‌ను నిరంతరం ఎన్నో వార్తలు ప్రభావితం చేస్తుంటాయి.

# పబ్లిసిటీ గురించి అసలు పట్టించుకోను: వెంకటేశ్



రజనీకాంత్‌తో తనకున్న అనుబంధాన్ని పంచుకున్నారు స్టార్ హీరో వెంకటేశ్. ఓ తమిళ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తన ఆధ్యాత్మిక ప్రయాణం గురించి చెప్పారు. అలాగే తాను ఇండస్ట్రీకి వచ్చినప్పుడు రజనీకాంత్ ఓ సలహా ఇచ్చారని అప్పటినుంచి ఇప్పటివరకూ ఆ సలహానే పాటిస్తున్నానన్నారు.

“రజనీకాంత్‌కు, నాకు ఇద్దరికీ ఆధ్యాత్మిక భావాలు ఎక్కువ. ఆయన నుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్నాను. మా నాన్నతో కలిసి ఆయన వర్క్ చేశారు. నేను ఇండస్ట్రీకి వచ్చినప్పుడు ఒక మాట చెప్పారు. సినిమా రిలీజ్ సమయంలో బ్యానర్లు కట్టారా? పోస్టర్‌లలో మన ముఖం బాగా కనిపిస్తుందా? మ్యాగజైన్ ఫ్రంట్ పేజ్‌లో మన ఫొటో వేశారా? ఇలాంటి వాటి గురించి ఆలోచించొద్దన్నారు. మన పని మనం చేసుకుంటూ వెళ్లాలని సూచించారు. అప్పటినుంచి ఇప్పటివరకూ అదే సలహాను పాటిస్తున్నాను. పబ్లిసిటీ గురించి పట్టించుకోను. దేని గురించి ఎక్కువగా ఆలోచించను” అని వెంకటేశ్ చెప్పారు.

ఇక ఇదే ఇంటర్వ్యూలో వెంకటేశ్ తనకు అరుణాచలం అంటే ఎంతో ఇష్టమని తెలిపారు. రమణ మహర్షిని ఆరాధిస్తానని తెలిపారు. చిన్నప్పటినుంచి ఆధ్యాత్మిక భావాలు ఎక్కువేనని చెప్పారు. దేవుడంటే భయం ఎక్కువని.. భగవంతుడికి సంబంధించిన ఎన్నో పుస్తకాలు చదివినట్లు తెలిపారు. ‘ఘర్షణ’ సమయంలో తాను ప్రయాణిస్తున్న పడవ మునిగిపోయిందని దేవుడి దయతోనే ఎలాంటి ప్రమాదం జరగకుండా బయటపడినట్లు చెప్పారు.

# నాకోసం ఎన్నో త్యాగాలు చేసింది: భార్యపై ప్రశంసలు కురిపించిన అజిత్



: తాజాగా పద్మభూషణ్ అవార్డు అందుకున్నారు కోలీవుడ్ స్టార్ హీరో అజిత్ కుమార్ ( ఈ పురస్కారం అందుకోవడం ఎంతో ఆనందంగా ఉందని.. ఇది తనకు ప్రేరణగా నిలుస్తుందని ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు. ఈ సందర్భంగా తన భార్య షాలినిపై ప్రశంసలు కురిపించారు. ఆమె ఎన్నో త్యాగాలు చేసినట్లు చెప్పారు.

“నేను ఇప్పటికీ సామాన్యుడిలానే ఆలోచిస్తాను. ఇంతటి విజయాన్ని సాధించినందుకు ఒక్కోసారి ఆశ్చర్యంగా అనిపిస్తుంటుంది. ఈ స్థాయిలో ఉండడానికి నా భార్య షాలినినే కారణం. ఆమె నాకోసం ఎన్నో త్యాగాలు చేసింది. ప్రతి పనిలోనూ నాకు తోడుంటుంది. ఒక్కోసారి నేను సరైన నిర్ణయాలు తీసుకోకపోయినా ఆమె అండగా నిలిచింది. నన్ను ఎప్పుడూ నిరుత్సాహ పరచలేదు. నా కష్ట సమయాల్లో పక్కనే ఉండి భరోసానిచ్చింది. నా జీవితంలో సాధించిన సక్సెస్ క్రెడిట్ అంతా ఆమెకే ఇస్తాను. ఎంతో ప్రజాదరణ పొందిన నటి అయినప్పటికీ నాకోసం అన్నిటికీ దూరమైంది. ఆమెకు ఎంతోమంది అభిమానులు ఉన్నారు. వారందరికీ కూడా నేను ఈసందర్భంగా కృతజ్ఞతలు చెబుతున్నాను” అని చెప్పారు.

“నేను కేవలం నటుడిని. నటన నాకు జీతాన్నిచ్చే ఓ ఉద్యోగంగా భావిస్తాను. సూపర్‌స్టార్ అని పిలిపించుకోవడం నచ్చదు. ఎందుకంటే అలాంటి ట్యాగ్స్‌పై నాకు నమ్మకం లేదు. 33 ఏళ్లుగా ఇండస్ట్రీలో కొనసాగుతున్నాను. నా వృత్తిని ప్రేమిస్తాను. జీవితమంతా అభిమానులను అలరించడానికే ప్రయత్నిస్తాను. సాధ్యమైనంతవరకూ సాదాసీదాగా ఉంటాను. అతిగా ఆలోచించను. ఒకేసారి ఎక్కువ ప్రాజెక్ట్‌లు అంగీకరించను. నటనతో పాటు నా ఇతర ఆసక్తులపై కూడా దృష్టిపెడతాను” అని అజిత్ తెలిపారు.

# ఎన్టీఆర్ - నీల్ చిత్రం... వచ్చే ఏడాది జూన్‌లో



ఎన్టీఆర్ కథానాయకుడిగా... ప్రశాంత్‌నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమా వచ్చే ఏడాది జూన్ 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. చిత్రబృందం మంగళవారం ఈ కొత్త తేదీని ప్రకటించింది. ముందుగా జనవరి 9న విడుదల చేయాలనుకున్నా, చిత్రీకరణ ఆలస్యంగా ప్రారంభం కావడంతో ఆ మేరకు విడుదల తేదీని జూన్ 25కి మార్చారు. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంస్థలు కలిసి నిర్మిస్తున్న ఈ సినిమా తెలుగుతోపాటు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో ఒకేసారి ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇటీవలే ఎన్టీఆర్ () ఈ సినిమా సెట్లోకి అడుగు పెట్టారు. ప్రస్తుతం కర్ణాటకలో కీలక సన్నివేశాల్ని తెరకెక్కిస్తున్నారు. ‘కె.జి.ఎఫ్’ చిత్రాలతోపాటు, ‘సలార్’ తర్వాత దర్శకుడు ప్రశాంత్ నీల్... ‘దేవర’ తర్వాత కథానాయకుడు ఎన్టీఆర్ చేస్తున్న ఈ సినిమాపై భారీ అంచనాలున్నాయి. ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా మే 20న గ్లింప్స్‌ని విడుదల చేయనున్నట్టు నిర్మాణ సంస్థలు వెల్లడించాయి. ఈ సినిమా పేరు, ఇందులో కథానాయిక వివరాల్ని ఇంకా వెల్లడించలేదు. కన్నడ భామ రుక్మిణీ వసంత్ ఇందులో కథానాయికగా నటించే అవకాశాలున్నట్టు సమాచారం. కల్యాణ్‌రామ్ నందమూరి, నవీన్ ఎర్నేని, రవిశంకర్ యలమంచిలి, హరికృష్ణ కొసరాజు నిర్మిస్తున్న ఈ చిత్రానికి ఛాయా గ్రహణం: భువన్‌గౌడ, సంగీతం: రవి బస్రూర్, ప్రొడక్షన్ డిజైన్: చలపతి.

# నటిగా కంటే నిర్మాతగానే ఎక్కువ నేర్చుకున్నా: సమంత



: నటిగా వైవిధ్యమైన పాత్రలతో అలరించిన సమంత ( నిర్మాతగానూ తొలి అడుగు వేసేందుకు సిద్ధమైన విషయం తెలిసిందే. తన సొంత నిర్మాణ సంస్థ ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ పతాకంపై నిర్మించిన తొలి సినిమా ‘శుభం’ మే 9న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. నటిగా కంటే నిర్మాతగానే ఎక్కువ విషయాలు నేర్చుకున్నట్లు తెలిపారు. రిస్క్ తీసుకుంటేనే జీవితంలో ముందుకు సాగుతామన్నారు.

“రిస్క్ తీసుకోకుండా అభివృద్ధిని ఆశించలేం. నాకు సవాళ్లను ఎదుర్కోవడం ఇష్టం. ఎన్నోసార్లు రిస్క్ తీసుకున్నాను. 15 సంవత్సరాల నా కెరీర్‌లో కథల గురించి తెలుసుకున్నాను. ఆ అనుభవంతోనే నిర్మాతగా మారాను. నాకు మంచి టీమ్ దొరికింది. సినిమాలో భాగమైనప్పుడు నటిగా కంటే నిర్మాతగా ఎక్కువ బాధ్యతలు ఉంటాయని అర్థమైంది. ఎన్నో విషయాలను పరిశీలించాలి. నేను ఈ సినిమా షూటింగ్ సమయంలో ప్రొడ్యూసర్‌గా ఎన్నో విషయాల గురించి సమగ్రంగా తెలుసుకున్నాను. ఇంకా తెలుసుకోవాల్సిన అంశాలు ఎన్నో ఉన్నాయని భావిస్తున్నాను. ఒకే రకమైన చిత్రాలకు పరిమితం కావాలని నేను అనుకోవడం లేదు. ఎన్నో కథలు వినడానికి సిద్ధంగా ఉన్నాను. ఒక మహిళగా నాకు ఎలాంటి చిత్రాలు నచ్చుతాయో అలాంటి వాటిని నిర్మించాలని భావిస్తున్నా. రొటీన్‌కు భిన్నమైన కథలను రూపొందిస్తాను” అని తెలిపారు. ‘శుభం’ సినిమా కచ్చితంగా ప్రేక్షకుల ఆదరణ సొంతం చేసుకుంటుందని నమ్మకం ఉందన్నారు.

‘సినిమా బండి’ ఫేమ్ ప్రవీణ్ కండ్రేగుల ‘శుభం’ని తెరకెక్కించారు. హర్షిత్ రెడ్డి, గవిరెడ్డి శ్రీనివాస్, చరణ్ పేరి, శ్రియ కొంతం, శ్రావణి లక్ష్మి తదితరులు ప్రధాన పాత్రలు పోషించారు. వినోదం నిండిన హారర్ థ్రిల్లర్‌గా ముస్తాబైనట్లు ట్రైలర్ ఆధారంగా అర్థమవుతోంది. ఓ ఊర్లోని మహిళలంతా ఒక సీరియల్ చూస్తూ దెయ్యం పట్టినట్లుగా ప్రవర్తించడం.. వాళ్ల బారి నుంచి ప్రాణాలు కాపాడుకునేందుకు ఆ ఊర్లోని మగవాళ్లంతా అష్టకష్టాలు పడటం.. ఆఖర్లో సమంత మాతాజీగా ప్రత్యేక పాత్రలో కనిపించడం ట్రైలర్‌లో ఆకర్షణగా నిలిచాయి.

# వరుణ్ తో దక్షా ఐటమ్ సాంగ్....


మెగా కుటుంబంలో హీరోలంతా ఓ వైపు ఉంటే.. నేనొక్కడినే మరోవైపు అంటున్నారు వరుణ్ తేజ్ అప్పుడప్పుడూ మెగా రూట్ ఫాలో అయినా.. ఎప్పుడూ తనకంటూ సపరేట్ రూట్ వేసుకోడానికే ఇష్టపడుతుంటారు ఈ మెగా ప్రిన్స్. ఇప్పుడు కూడా ఇదే చేస్తున్నాడు. ఆ మధ్య రొటీన్ రూట్ ట్రై చేసినా.. ఇప్పుడు మాత్రం సమ్‌థింగ్ డిఫెరెంట్ అంటున్నాడు. ఫలితంతో పని లేకుండా భిన్నమైన సినిమాలు చేస్తూ మెగా ఫ్యాన్స్ ను ఫిదా చేస్తున్నాడు. స్టోరీ సెలక్షన్ విషయంలో ప్రతీ సినిమాకి వ్యత్యాసం ఉండేలా తన నటనకి మరిన్ని పరీక్షలు పెట్టేలా పాత్రలు ఎంచుకుంటున్నాడు. అలాంటి మెగా హీరో ఇప్పుడు భయపెట్టేందుకు వచ్చేస్తున్నాడు.

వరుసగా సినిమాలు బాక్సాఫీసు వద్ద ఫెయిల్ అవ్వటంతో పాటు మార్కెట్ దెబ్బతినటంతో కంబ్యాక్ కోసం వెయిట్ చేస్తున్నాడు. అందుకే ‘కొరియన్ కనకరాజు గా హారర్ కామెడీతో నవ్వులతో పాటు భయపెట్టేందుకు వచ్చేస్తున్నాడు. ఇప్పటికే సినిమాకు కావాల్సినంత బజ్ ను క్రియేట్ చేశాడు. ఈ మూవీలో వరుణ్ కు జోడిగా రితికా నాయక్ ( నటిస్తోంది. అయితే మరింత గ్లామర్ ను యాడ్ చేసేందుకు మేకర్స్ వేస్తున్న స్కెచ్ హాట్ టాపిక్ గా మారింది.

తన అందచందాలతో కుర్రాళ్లను అట్రాక్ట్ చేస్తున్న బోల్డ్ బ్యూటీ దక్షా నాగర్కర్ ) మేర్లపాక గాంధీ దర్శకత్వం వహిస్తున్న ‘కొరియన్ కనకరాజు లో స్పెషల్ అట్రాక్షన్ గా నిలవనున్నట్లు తెలుస్తోంది. ఈ అందాల భామ వరుణ్ తో కలిసి ఓ స్పెషల్ సాంగ్ లో చిందులు వేయనుందట. హైదరాబాద్ లో వేసిన సెట్ లో సాంగ్ షూట్ జరుగుతుందట. ఈ విషయం తెలిసిన మెగా ఫ్యాన్స్ ఇప్పటి నుంచే ఖుషి అవుతున్నారు. ఈ ఐటమ్ సాంగ్ సూపర్ సక్సెస్ కావాలని కోరుకుంటున్నారు.




# పెద్ది’.. బరిలోకి మళ్లీ అప్పుడే



కథానాయకుడు రామ్‌చరణ్ దర్శకుడు బుచ్చిబాబు సానా కలయికలో రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం ‘పెద్ది’ మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్నారు. జాన్వీ కపూర్ కథానాయిక. శివ రాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందు శర్మ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇటీవలే హైదరాబాద్‌లో ఓ కీలక షెడ్యూల్ పూర్తి చేసుకున్న ఈ సినిమా.. తదుపరి షెడ్యూల్‌ను మే రెండో వారంలో ప్రారంభించుకోనున్నట్లు సమాచారం. ఈలోగా చరణ్ మే 9న లండన్ టుస్సాడ్స్‌లో జరిగే తన మైనపు విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలోనూ.. 11న రాయల్ ఆల్బర్ట్ హాల్‌లో జరగనున్న ‘ఆర్ఆర్ఆర్’ రాయల్ ఫిల్హార్మోనిక్ లైవ్ కన్సర్ట్‌లోనూ పాల్గొననున్నారు. ఈ వేడుకలో చెర్రీతో పాటు ఎన్టీఆర్, రాజమౌళి, కీరవాణి సందడి చేయడమే కాక ప్రీ-ఫిల్మ్ టాక్‌లో భాగంగా ప్రేక్షకులతోనూ ముచ్చటించనున్నారు. మే 14తర్వాత రామ్‌చరణ్ మళ్లీ ‘పెద్ది’ చిత్రీకరణ కోసం సెట్లోకి అడుగు పెట్టనున్నట్లు తెలిసింది. ఇది ఉత్తరాంధ్ర నేపథ్యంలో సాగే బలమైన భావోద్వేగాలు నిండిన క్రీడా నేపథ్య చిత్రంగా ముస్తాబవుతోంది. దీంట్లో చరణ్ ఆట కూలీగా కనిపించనున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమా వచ్చే ఏడాది మార్చి 27న థియేటర్లలోకి రానుంది. ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్ సంగీత దర్శకుడిగా వ్యవహరించనున్నారు.

# ఉదయాన్నే వీటిని అల్పాహారంగా తీసుకుంటే బోలెడు బలం..!




రోజంతా ఉత్సాహంగా ఉండాలంటే ఉదయం తీసుకునే అల్పాహారం ప్రధాన పాత్ర పోషిస్తుంది. అందుకే ఉదయం తీసుకునే ఆహారం బలంగా ఉండాలని ఆరోగ్య నిపుణులు అంటుంటారు. అల్పాహారంలో ప్రోటీన్ అధికంగా ఉన్న ఆహారాలు తీసుకుంటే రోజంతా చురుగ్గా, బలంగా ఉండచ్చు. రోజంతా బలంగా ఉంచే ఆహారాలు ఇవీ..

గ్రీక్ యోగర్ట్ పర్ఫైట్..

గ్రీకు పెరుగు, వివిధ రకాల బెర్రీలు, తేనె, గ్రానోలా.. మొదలైనవాటిని ఒక బౌల్ లో ఒక్కొక్కటిగా పొరలుగా వేయాలి. ఈ ప్రోటీన్ ప్యాక్డ్ ఫుడ్ చాలా బలం ఇస్తుంది.

వేసవిలో టమోటా జ్యూస్ తాగడం వల్ల కలిగే 10 ఆరోగ్య ప్రయోజనాలు..!

ఛానల్ ఫాలో అవ్వండి

గుడ్లు, పాలకూర..

గుడ్లు, పాలకూర, ఫెటా చీజ్, ఉప్పు, మిరియాల పొడి తీసుకోవాలి. ఉడికించిన గుడ్లు, వేయించిన పాలకూర, ఉప్పు, మిరియాల పొడి.. అన్నీ టోర్టిల్లా ర్యాప్ పై ఉంచాలి. దీన్ని చుట్టగా చుట్టి తినడమే.

క్వినోవా బ్రేక్ఫాస్ట్ బౌల్..

ఉడికించిన క్వినోవా, అవోకాడో, చెర్రీ టమోటా, చికెన్ బ్రెస్ట్, గుమ్మడి గింజలు, నిమ్మరసం తీసుకోవాలి. క్వినోవాను ఉడికించాలి. అవకాడో ముక్కలు, సగానికి తరిగిన చెర్రీ టమోటా, ఉడికించిన చికెన్ బ్రెస్ట్ వేయాలి. మరింత రుచికోసం గుమ్మడి విత్తనాలు కలుపుతోవాలి.

పిల్లలకు పొరపాటున కూడా తల్లిదండ్రులు చెప్పకూడని 8విషయాలు ఇవీ..!

కాటన్ చీజ్ పాన్ కేక్..

కాటేజ్ చీజ్, గుడ్లు, ఓట్స్ పిండి, బేకింగ్ పౌడర్, వెనిల్లా ఎస్సెన్స్, బెర్రీలు అవసరం. బెర్రీలు మినహాయిస్తే మిగిలినవి అన్నీ మిక్స్ చేసుకుని పెనం మీద దోశల్లా వేసుకోవాలి. రెండువైపులా గోల్డ్ కలర్ వచ్చేవరకు కాల్చి తర్వాత బెర్రీలను పైన అలంకరించి సర్వ్ చేయాలి.

స్మోక్డ్ సాల్మన్ అవకాడో టోస్ట్..

హోల్ మీల్ బ్రెడ్ స్లైసెస్, స్మోక్డ్ సాల్మన్, అవకాడో, నిమ్మరసం, ఛిల్లీ ఫ్లేక్స్ తీసుకోవాలి. బ్రెడ్ ముక్కలను బంగారు రంగు వచ్చేవరకు కాల్చాలి. అవకాడోను మెత్తగా చేసి కాల్చిన బ్రెడ్ మీద స్ప్రెడ్ చేయాలి. కాల్చిన సాల్మన్ ముక్కలను అలంకరించాలి. ఫ్రెష్ నిమ్మరసాన్ని దీనిపై వెయ్యాలి.

# రోజంతా హ్యాపీగా ఉండాలనుందా? హ్యాపీ హార్మోన్స్ ను పెంచే ఈ ఫుడ్స్ ను తింటే..!

సంతోషంగా , పాజిటివ్ గా ఉంటే రోజులో ఎన్ని ఇబ్బందులు వచ్చినా, ఎలాంటి క్లిష్ట పరిస్థితులనైనా చాలా ఈజీగా దాటేయచ్చు. అయితే చాలామందికి ఎలాంటి సమస్యలు లేకపోయినా రోజంతా నీరసంగా, డల్ గా ఉంటారు. శరీరంలో తగినంత హ్యాపీ హార్మోన్స్ లేకపోవడం వల్ల ఇలా జరుగుతుంది.

సంతోషం సగం బలం అని అన్నారు పెద్దలు. సంతోషంగా , పాజిటివ్ గా ఉంటే రోజులో ఎన్ని ఇబ్బందులు వచ్చినా, ఎలాంటి క్లిష్ట పరిస్థితులనైనా చాలా ఈజీగా దాటేయచ్చు. అయితే చాలామందికి ఎలాంటి సమస్యలు లేకపోయినా రోజంతా నీరసంగా, డల్ గా ఉంటారు. శరీరంలో తగినంత హ్యాపీ హార్మోన్స్ లేకపోవడం వల్ల ఇలా జరుగుతుంది. సెరటోనిన్, డోపమైన్, ఎండార్ఫిన్ వంటి హార్మోన్లను హ్యాపీ హార్మోన్లు అని అంటారు. ఈ హార్మోన్లు న్యూరోట్రాన్స్మిటర్ ల ఉత్పత్తిని ప్రభావితం చేస్తాయి. మెదడు మీద ఒత్తిడి తగ్గించి హ్యాపీగా ఉండేలా చేస్తాయి. ఈ హ్యాపీ హార్మోన్స్ పెరగడానికి సహాయపడే ఆహారాలేంటో తెలుసుకుంటే..

సాల్మన్..

ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ పుష్కలంగా ఉన్న సాల్మన్ చేప మెదడు ఆరోగ్యానికి తోడ్పడుతుంది. సెరోటోనిన్ ఉత్పత్తి పెంచుతుంది. సెరోటోనిన్ మానసిక స్థితిని నియంత్రించే హ్యాపీ హార్మోన్.

పిల్లలకు పొరపాటున కూడా తల్లిదండ్రులు చెప్పకూడని 8విషయాలు ఇవీ..!

అరటిపండ్లు..

అరటిపండ్లలో ట్రిప్టోఫాన్ అనే అమైనో ఆమ్లం ఉంటుంజి. ఇది సెరోటోనిన్ ఉత్పత్తికి సహాకరిస్తుంది. అరటిపండ్లలో విటమిన్-బి6 కూడా ఉంటుంది. ఇది ట్రిప్టోఫాన్ ను సెరోటోనిన్ గా మార్చడంలో సహాయపడుతుంది.




డార్క్ చాక్లెట్..

డార్క్ చాక్లెట్ లో ఫ్లేవనాయిడ్ లు ఉంటాయి. ఇవి మెదడుకు రక్తస్రావాన్ని పెంచుతాయి. ఎండార్ఫిన్ల ఉత్పత్తిని ప్రేరేపిస్తాయి.

బెర్రీలు..

బెర్రీలలో యాంటీఆక్సిడెంట్లు, విటమిన్-సి పుష్కలంగా ఉంటాయి. ఇవి మెదడులో ఆక్సీకరణ ఒత్తిడి, వాపు ఎదుర్కోవడానికి, డోపమైన్ పెరుగుదలకు సహాయపడతాయి.

30ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ తప్పక తీసుకోవలసిన 10 విటమిన్ల లిస్ట్ ఇదీ..!

నట్స్..

నట్స్ లో ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్రోటీన్లు, మెగ్నీషియం పుష్కలంగా ఉంటాయి. మెదడు ఆరోగ్యానికి, న్యూరోట్రాన్మిటర్ పనితీరుకు తోడ్పడతాయి.

అవకాడో..

అవకాడోలో కొవ్వులు న్యూరోట్రాన్మిటర్ సిగ్నలింగ్ ను మెరుగుపరచడంలో సహాయపడతాయి. డోపమైన్, సెరోటోనిన్ ఉత్పత్తిని ప్రోత్సహిస్తాయి.

చిక్కుళ్లు..

చిక్కుళ్లలో ఫోలేట్ ఉంటుంది. ఇది సెరోటోనిన్ తో సహా న్యూరోట్రాన్స్మిటర్ సంశ్లేషణలో పాత్ర పోషిస్తుంది. మూడ్ రెగ్యులేషన్ కు తోడ్పడుతుంది.

# పంచదార నిజంగానే ఆరోగ్యానికి చేటు చేస్తుందా? రోజూ ఎంత పంచదార తినొచ్చంటే..!

ఈమధ్య కాలంలో పంచదారకు సంబంధించి చాలా షాకింగ్ విషయాలు బయటకు వస్తున్నాయి. కొందరు ఆరోగ్యం మీద స్పృహతో పంచదార వాడకమే మానేస్తున్నారు. అసలు పంచదార నిజంగానే




ఆరోగ్యానికి చేటు చేస్తుందా? ఇది బరువు పెరగడానికి కారణం అవుతుందా? ఆరోగ్యం సేఫ్ గా ఉండాలంటే రోజులో ఎంత పంచదార తీసుకోవచ్చు?

పంచదార ప్రతి ఇంట్లో వాడే పదార్థం. నిజానికి దీన్ని కాఫీ, టీ, జ్యూస్, స్వీట్లలో ఎక్కువగా వాడుతుంటాం. ఈమధ్య కాలంలో పంచదారకు సంబంధించి చాలా షాకింగ్ విషయాలు బయటకు వస్తున్నాయి. పంచదార అధిక వినియోగం వల్ల మధుమేహం వస్తుందని అంటున్నారు. కొందరు ఆరోగ్యం మీద స్పృహతో పంచదార వాడకమే మానేస్తున్నారు. అసలు పంచదార నిజంగానే ఆరోగ్యానికి చేటు చేస్తుందా? ఇది బరువు పెరగడానికి కారణం అవుతుందా? ఆరోగ్యం సేఫ్ గా ఉండాలంటే రోజులో ఎంత పంచదార తీసుకోవచ్చు? తెలుసుకుంటే..

పంచదార నేరుగా కొవ్వు పేరుకుపోవడానికి కారణం కానప్పటికీ ఇది పరోక్షంగా బరువు పెరగడానికి దోహదం చేస్తుంది. పంచదార ఎక్కువ వినియోగిస్తే శరీరంలోకి వెళ్లే కేలరీల శాతం కూడా పెరుగుతుంది . ప్రాసెస్ చేసిన ఆహారాలలో చక్కెర శాతం ఎక్కువ ఉంటుంది. ఇది ఆహారాన్ని రుచికరంగా మారుస్తుంది. ఈ కారణంగా ఎక్కువ తింటారు. బరువు పెరగడానికి కారణమవుతుంది.

రోజులో ఎంత చక్కెర తీసుకోవచ్చు..

చక్కెర నేరుగా బరువు పెరగడానికి కారణం కాకపోయినా దీన్ని మితంగా తీసుకోవడం చాలా ముఖ్యం. ఆరోగ్య నివేదికల ప్రకారం ప్రతిరోజూ తీసుకునే ఆహారంలో చక్కెర నుండి శరీరానికి అందే కేలరీలు 5శాతానికి మించకూడదు. ఇక ప్రతిరోజూ 30గ్రాముల కంటే ఎక్కువ చక్కెర వాడకూడదు. పంచదార వాడేటప్పుడు పిల్లల విషయంలో జాగ్రత్త వహించాలి. పిల్లల వయస్సు ఆధారంగా రోజులో 19గ్రాముల నుండి 24గ్రాముల లోపు మాత్రమే చక్కెర తీసుకునేలా చూడాలి. ఇంతకంటే ఎక్కువ తీసుకుంటే బరువు పెరగడం, మధుమేహం, గుండె జబ్బులతో సహా వివిధ ఆరోగ్య సమస్యలు పెరగడానికి కూడా కారణమవుతుంది.

# నిమ్మరసమా.. కొబ్బరి నీళ్లా.. వేసవిలో ఏది ప్రయోజనకరం..

వేసవి (ఎండలు పెరిగిపోతున్నాయి. వడగాలులు చెమటలు పట్టిస్తున్నాయి. పెరుగుతున్న ఉష్ణోగ్రతతో చాలా మంది డీహైడ్రేషన్ సమస్యను ఎదుర్కొంటున్నారు. శరీరంలోని నీరు, లవణాలు అన్నీ చెమట రూపంలో బయటకు వెళ్లిపోతాయి. కాబట్టి వాటి స్థానాన్ని మళ్లీ భర్తీ చేయాలి. లేకపోతే వడదెబ్బ తగిలే అవకాశం ఉంది. ఈ కారణంగా బాడీ డీ హైడ్రేట్ కాకుండా ఉండేందుకు హెల్తీ డ్రింక్స్ ను తీసుకోవడం చాలా అవసరం. డీహైడ్రేటింగ్ డ్రింక్స్ అంటే ప్రజలకు ముందుగా నిమ్మరసం, కొబ్బరి నీరు గుర్తుకు వస్తాయి. శరీరాన్ని నిర్జలీకరణం నుంచి రక్షించేందుకు ఈ రెండు పానీయాలు ఎంతో ఉపయోగపడతాయి. అయితే ఈ రెండింటిలో ఏది మంచిదనే అనుమానం సాధారణంగా అందరికీ వస్తుంది. దీనిపై ఆరోగ్య నిపుణులు ఏం చెబుతున్నారో ఇప్పుడు చూద్దాం.



కొబ్బరి నీళ్లల్లో ఎలక్ట్రోలైట్లు అధికంగా ఉంటాయి. పొటాషియం, సోడియం, కాల్షియం, మెగ్నీషియం పుష్కలంగా లభిస్తాయి. ఇవి శరీరంలోని ద్రవాలను సమతుల్యం చేయడమే కాకుండా కండరాల నిర్మాణంలోనూ ఉపయోగపడతాయి. అదే నిమ్మరసం విషయానికి వస్తే విటమిన్ సి, ఫ్లేవనాయిడ్లు, యాంటీఆక్సిడెంట్లు అధిక మొత్తంలో ఉంటాయి. ఇది రోగనిరోధక శక్తిని బలపరుస్తుంది. అంతే కాకుండా అనేక సీజనల్ వ్యాధుల నుంచి రక్షిస్తుంది. జీర్ణక్రియను ఆరోగ్యంగా ఉంచుతుంది. నిమ్మకాయలో ఆల్కలీన్ గుణాలు అధికం. శరీరం స్థాయిని నిర్వహించడంలో మేలు చేస్తుంది.

వేసవి కాలంలో డీహైడ్రేషన్ బారిన పడకుండా ఉండేందుకు నిమ్మరసం, కొబ్బరి నీరు రెండూ తీసుకోవచ్చు. కొబ్బరి నీళ్లు శరీరంలో ఎలక్ట్రోలైట్స్ లోపాన్ని భర్తీ చేస్తే, నిమ్మరసంలోని విటమిన్ సి ఆక్సీకరణ ఒత్తిడిని తొలగిస్తుంది. కాబట్టి పరిగడుపునే కొబ్బరి నీళ్లు తాగడం మంచిది. రోజంతా చురుగ్గా ఉండేందుకు నిమ్మరసాన్ని డైట్ లో భాగం చేసుకోవాలి.

# కంటికి మెట్‌ఫార్మిన్ రక్ష

ఒకటి కొంటే ఒకటి ఉచితమనే ప్రకటనలు చూస్తూనే ఉంటాం. మరి ఒక మందు వేసుకుంటే అదనంగా మరో జబ్బు నుంచీ కాపాడితే? రక్తంలో గ్లూకోజు తగ్గటానికి వాడే మెట్‌ఫార్మిన్ మందు ఇలాంటి పనే చేస్తున్నట్టు రెటీనా పత్రికలో ప్రచురితమైన అధ్యయనం పేర్కొంటోంది. ఇది వయసుతో ముడిపడిన మాక్యులర్ క్షీణత ముప్పు స్వల్పంగా తగ్గటానికి తోడ్పడుతున్నట్టు తైవాన్ వాసుల ఆరోగ్య సమాచార విశ్లేషణలో వెల్లడైంది. వయసు మీద పడుతున్నకొద్దీ కొందరికి కంటి రెటీనా మధ్యభాగం (మాక్యులా) క్షీణిస్తుంటుంది. నెమ్మదిగా ముదురుతూ వచ్చే ఈ సమస్య చూపు తగ్గటానికీ దారితీస్తుంది. యాభై ఏళ్లు పైబడ్డవారిలో చూపు పోవటానికి దారితీస్తున్న వాటిల్లో ఇది ప్రధానమైంది. మెట్‌ఫార్మిన్ వాడే మధుమేహుల్లో మాక్యులా క్షీణత ముప్పు 8% వరకూ తగ్గుతున్నట్టు తేలటం గమనార్హం.



# పాము విషానికి కొత్త విరుగుడు

అత్యంత విషపూరిత పాము కరిచినా ఒక్క సూది మందుతో ప్రాణాలు నిలబడితే? త్వరలోనే ఇది నిజం కానుంది. పాముల విషంలోని ప్రధాన విషతుల్యాలను నిర్వీర్యం చేయగల యాంటీబాడీని స్క్రిప్స్ రీసెర్చ్ శాస్త్రవేత్తలు రూపొందించారు మరి. దీని పేరు 95మ్యాట్5. దీన్ని ఎలుకలపై పరీక్షించగా.. నల్లతాచు, బ్లాక్‌మాంబా వంటి పాముల విషాన్ని నిర్వీర్యం చేసినట్టు బయటపడింది. ఇది ప్రాణాలనే కాదు.. అవయవాలు చచ్చుబడకుండానూ కాపాడటం గమనార్హం. పాము కాటు చికిత్సలో ఇది విప్లవాత్మక మార్పులు తీసుకురాగలదని, ఎంతోమంది ప్రాణాలను కాపాడగలదని భావిస్తున్నారు.

సాధారణంగా పాముకాటు చికిత్సలో యాంటీవీనమ్ ఇంజెక్షన్లు ఉపయోగిస్తుంటారు. వీటి తయారీ కష్టమైన ప్రక్రియ. ముందు పాము విషాన్ని సేకరించి, దాన్ని గుర్రాల వంటి జంతువులకు ఇస్తారు. అనంతరం విషాన్ని ఎదుర్కోవటానికి పుట్టుకొచ్చే యాంటీబాడీలను సంగ్రహించి, శుద్ధిచేసి ఇంజెక్షన్లను తయారుచేస్తారు. అయితే వీటితో కొన్ని లోపాలు లేకపోలేదు. తీవ్రమైన అలర్జీ ప్రతిచర్యలు తలెత్తటం, యాంటీబాడీలు కొన్నిరకాల విషాలకు అంతగా పనిచేయకపోవటం వంటి ఇబ్బందులు ఎదురవుతుంటాయి. ఆయా ప్రాంతాల్లో కనిపించే పాములకు అనుగుణంగానే ఇంజెక్షన్లు రూపొందిస్తుంటారు. ఇక్కడే కొత్త యాంటీబాడీ ఆశలు రేకెత్తిస్తోంది. దీన్ని జంతువుల నుంచి కాకుండా ప్రయోగశాలలోనే తయారుచేయటం విశేషం. ఇది సార్వత్రిక పాము విరుగుడు ఇంజెక్షన్‌గా ఉపయోగపడగలదు.

పాము విషంలో మూడు వేళ్ల వంటి పొడవైన న్యూరోటాక్సిన్లు నాడులను దెబ్బతీసి, అవయవాలు చచ్చుబడేలా చేస్తాయి. ఈ యాంటీబాడీ సరిగ్గా వీటి మీదే దాడి చేసి, నిర్వీర్యం చేసేస్తుంది. పాము విషాన్ని సమర్థంగా నిలువరించటంతో పాటు అలర్జీ ప్రతిచర్యల ముప్పు తగ్గటానికీ తోడ్పడటం దీని ప్రత్యేకత. పెద్దఎత్తున తయారుచేసే వీలుండటం వల్ల మారుమూల ప్రాంతాల్లో యాంటీవీనమ్ కొరతనూ తగ్గించగలదు. హెచ్ఐవీ టీకా తయారీకి ఉపయోగించుకున్న పద్ధతుల స్ఫూర్తితోనే 95మ్యాట్5ని రూపొందించారు. పాము విషానికి సమర్థ చికిత్సల కోసం మన రోగనిరోధక వ్యవస్థను వాడుకోవచ్చనీ ఇది నిరూపించింది. అయితే కొన్ని సవాళ్లు లేకపోలేదు. పాము విషంలో రకరకాల విషతుల్యాలు ఉండటం వల్ల ఒకే ఒక్క యాంటీబాడీ అన్నిరకాల విషాలను నిర్వీర్యం చేయలేకపోవచ్చు. అందుకే పలు కృత్రిమ యాంటీబాడీలను సృష్టించి, సమగ్రమైన యాంటీ వీనమ్‌ను తయారుచేయటం మీద కూడా పరిశోధకులు దృష్టి సారించారు.

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed at Sri Muktheswara Publications, D.No. 10-1-70/A, Lingojiguda, Opp. H.P Gas Agency, Karmanghat, Saroornagar ,RangaReddy( Dist.), Hyderabad - 500035, Telangana .Published at Plot No.43,Flat No.210,Raja Rjeswari APTS,HUDA Complex,Saroornagar,Ranga Reddy(Dist),Hyderabad.500035, Telangana
Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy